

తంగేడు.. గునుగు మురిసే ఉయ్యాలో!

తీరొక్కపూలతో బతుకమ్మలు. చుట్టూ చేరి ఆడిపాడే ఆడపడుచులు. శరత్కాల తేటనీటిలో నిమజ్జనాలు! ఇవాళ్టి నుంచి తొమ్మిది రోజుల దాకా పల్లె, పట్నాల్లో హద్దుల్లేని సందళ్లు!!

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 2-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 186 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య రా. 12.19 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఉత్తర మ. 12.23 తదుపరి హస్త; వర్జ్యం: రా. 9.53-11.41; దుర్ముహూర్తం: ఉ. 11.40 నుంచి 12.27 వరకు; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: మ. 12.00 నుంచి 1.30 వరకు; సూర్యోదయం: 6.09, సూర్యాస్తమయం: 5.59 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


చీఫ్ జస్టిస్ విచారణ సెట్టింగ్ వేసి..

ఈడీ, సీబీఐ పేరు చెప్పి 7 కోట్లు దోచారు.. సైబర్ నేరగాళ్ల బారిన వర్ధమాన్ సీఎండీ ఎస్.పి.ఓస్వాల్

- వీడియోకాల్ చేసి ఆర్థిక అవకతవకల పేరిట బెదిరింపు
- డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు వెల్లడి.. ఏకంగా జస్టిస్ చంద్రచూడ్ విచారణ జరిపినట్లుగా కోర్టు సెట్టింగ్
- భయపెట్టి 7 కోట్ల దోపిడీ.. పోలీసులకు ఓస్వాల్ ఫిర్యాదు
- రూ.5.25 కోట్ల రికవరి.. గౌహతిలో ఇద్దరి అరెస్టు
- సూత్రధారి, ఇతర నిందితుల కోసం గాలింపు

న్యూఢిల్లీ, అక్టోబరు 1: సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. వీడియో కాల్ చేసి.. పోలీసుల్లా మాట్లాడుతూ.. అరెస్టు చేస్తాం అని బెదిరించి డబ్బులు దండుకునే గ్యాంగులకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఈసారి వీరి బారిన ఒక బడా పారిశ్రామికవేత్త పడి.. ఏకంగా రూ.7 కోట్లు పోగొట్టుకున్నారు. జరిగిన మోసం తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. పోయిన సొమ్ములో రూ.5 కోట్లు ఇప్పటి వరకూ దొరికింది. ఆ పారిశ్రామికవేత్త పేరు ఎస్పీ ఓస్వాల్. ప్రముఖ టెక్స్‌టైల్స్ కంపెనీ వర్ధమాన్ గ్రూపు సంస్థల చైర్మన్, ఎండీ. 82 ఏళ్ల వయసున్న ఓస్వాల్‌కు ఆగస్టు 28వ తేదీన ఓ ఫోన్ వచ్చింది. ముంబైలోని కొలాబాలో ఉన్న సీబీఐ ఆఫీసు నుంచి ఫోన్ చేస్తున్నామని అవతలి వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. 'మీ పేరిట ఉన్న కెనరా బ్యాంకు ఖాతాలో ఆర్థిక అవకతవకలు జరిగాయి. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన జెట్ ఎయిర్‌వేస్ మాజీ చైర్మన్ నరేశ్ గోయల్ వ్యవహారంతో ఈ ఖాతాకు సంబంధం ఉన్నట్లు తేలింది. కాబట్టి మిమ్మల్ని

మిగతా 2వ పేజీలో...



వర్ధమాన్ గ్రూపు సంస్థల చైర్మన్, ఎండీ ఎస్.పి.ఓస్వాల్

2.17 కోట్ల సిమ్‌లు రద్దు!

- 2.26 లక్షల మొబైల్స్ బ్లాక్ చేసే యోచన
- సైబర్ నేరాలకు అడ్డుకట్ట దిశగా కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ కసరత్తు

2

సైబర్ నేరగాళ్లకు... బ్యాంకు ఖాతాలతో సహకారం!

- రాజస్థాన్‌లో 27 మందిని అదుపులోకి తీసుకున్న రాష్ట్ర పోలీసులు
- రెండు వారాల పాటు అక్కడే ఉండి స్పెషల్ ఆపరేషన్

12



ఇజ్రాయెల్‌పైకి దూసుకెళ్తున్న క్షిపణులు

ఇజ్రాయెల్‌పై ఇరాన్

క్షిపణుల వర్షం

- 3 గంటల పాటు 400కుపైగా బాలిస్టిక్ క్షిపణులు
- ఐరన్‌డోమ్‌లు అడ్డుకున్నా.. టెల్‌అవీవ్‌కు నష్టం
- సైన్యం, వైమానిక దళం స్థావరాలే లక్ష్యంగా దాడి
- టెల్‌అవీవ్, నెగెవ్, షారోన్‌లను తాకిన క్షిపణులు
- మధ్యధరా సముద్రంలో గ్యాస్ పైప్‌లైన్ ధ్వంసం!
- ఇజ్రాయెల్ పట్టణం జాఫాలో ఉగ్రదాడి
- 9 మంది దుర్మరణం.. పలువురికి గాయాలు
- ఇరాన్ క్షిపణులను కూల్చేయండి.. పశ్చిమాసియాలో సేనలకు బైడెన్ ఆదేశాలు

టెల్‌అవీవ్/వాషింగ్టన్, అక్టోబరు 1: పశ్చిమాసియా భగ్గుమంది..! హమాస్.. హిజ్బుల్లాతో పోరుసల్పుతున్న ఇజ్రాయెల్‌పై ఇరాన్ విరుచుకుపడింది. ఇజ్రాయెల్ కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 7.30 సమయంలో ఒకసారి.. 8 గంటల సమయంలో మరోసారి బాలిస్టిక్ క్షిపణుల వర్షాన్ని కురిపించింది. ఆ తర్వాత విడతల వారీగా రాత్రి 10 గంటల వరకు క్షిపణిదాడులను కొనసాగించింది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) స్థావరాలు, వైమానిక దళ బేస్‌లు ఉన్న హాట్జెరిమ్, నెవాటిమ్లోని, వాణిజ్య/వ్యాపార కేంద్రాలు అధికంగా ఉండే ప్రాంతాలే లక్ష్యంగా.. తొలుత 102 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఆ తర్వాత అరగంటకే.. మరో 100 క్షిపణులు ఇజ్రాయెల్‌పైకి వచ్చాయని ఐడీఎఫ్ అధికారికంగా వెల్లడించింది. రాత్రి 10 గంటల వరకు 400కుపైగా క్షిపణులను ప్రయోగించామని

మిగతా 2వ పేజీలో...



సామాన్యులకు నష్టం కలిగించను

- హైడ్రాతో ప్రభుత్వానికి మంచి పేరు వచ్చింది
- సహించలేకే విపక్షాల దుష్ప్రచారం
- నిర్వాసితులకు వసతి ఏర్పాట్లు చేశాం
- హైకోర్టు అడిగిన వివరాలు ఇవ్వడానికి సిద్ధం
- హైదరాబాద్ భవిష్యత్తు కోసమే ఈ చర్యలు
- కూల్చివేతలపై ఖర్గేకు రేవంత్‌రెడ్డి వివరణ
- హర్యానా ప్రచారం తర్వాతే రాహుల్‌తో భేటీ

న్యూఢిల్లీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ఆదేశాలు, విపక్షాల ఎదురుదాడి నేపథ్యంలో సోమవారం రాత్రి ఢిల్లీకి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం అధిష్ఠానం ముఖ్యులతో భేటీ అయ్యారు. మొదట కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో, అనంతరం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో చివరకు వారిద్దరి సలహా మేరకు రాజ్యసభ ఎంపీ, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీలతో కీలక మంతనాలు

మిగతా 13వ పేజీలో...

రాష్ట్రానికి రూ.416 కోట్ల వరద సాయం

- 14 రాష్ట్రాలకు 5,858 కోట్లు విడుదల
- మోదీ, అమిత్ షాకు కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు

13

గురుద్వారా, దర్గా, గుడి.. రోడ్లపై ఏది ఉన్నా..

తొలగించాల్సిందే!



- ప్రజాప్రయోజనం, భద్రతే ముఖ్యం
- ఆక్రమణల తొలగింపునకు మతాలతో సంబంధం లేదు
- దేశమంతటా వర్తించేలా మార్గదర్శకాలు జారీ చేస్తాం
- 'బుల్డోజర్ కూల్చివేతల'పై విచారణలో సుప్రీంకోర్టు
- తీర్పు రిజర్వు.. అప్పటి వరకు కూల్చొద్దని ఆదేశం

మనది సెక్యులర్ దేశం. జాతి, మతంతో సంబంధం లేదు. అక్రమ నిర్మాణాల విషయంలో అందరికీ ఒకే చట్టం వర్తిస్తుంది.

\- సుప్రీంకోర్టు ధర్మాసనం

న్యూఢిల్లీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రహదారులు, జలాశయాలు, రైల్వే ట్రాక్‌లను ఆక్రమించి నిర్మించిన ఏ మతానికి సంబంధించిన కట్టడాలనైనా తొలగించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రజాప్రయోజనం, వారు సురక్షితంగా ఉండడమే అత్యంత ప్రధాన అంశమని తేల్చి చెప్పింది. రోడ్డు మధ్యలో గురుద్వారా లేదా దర్గా లేదా గుడి.. ఏది నిర్మించినా ఉపేక్షించరాదని.. అవి ప్రజలకు ప్రతిబంధకంగా మారరాదని పేర్కొంది. మతంతో నిమిత్తం లేకుండా దురాక్రమణలను తొలగించే చర్యలు ప్రజలందరికీ వర్తింపజేయాలంది. అక్రమ నిర్మాణాల కూల్చివేతకు సంబంధించి దేశమంతటా వర్తించేలా మార్గదర్శకాలు జారీ చేస్తామని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. నేరగాళ్ల ఇళ్లపై బుల్డోజర్ చర్యలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. భారత్ సెక్యులర్ దేశమని, ఆక్రమణల తొలగింపు, బుల్డోజర్‌తో చర్యలు మతాలతో సంబంధం లేకుండా అందరికీ ఒక్కటేనని ధర్మాసనం పేర్కొంది. ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరయ్యారు. వాదనల సందర్భంగా 'ఏదైనా క్రిమినల్ కేసులో నిందితుడిగా ఉండడమే బుల్డోజర్ చర్యలకు ఆధారమా?' అని ధర్మాసనం మెహతాను ప్రశ్నించింది. స్పందించిన మెహతా.. "కచ్చితంగా కాదు. అత్యాచారం, ఉగ్రవాదం వంటి ఘోరమైన నేరాల్లో నిందితులైనా సంబంధం లేదు. ఒక్కరోజు ముందు నోటీసు ఇంటి గోడపై అంటించినా పరిగణనలోకి తీసుకోం. ఆక్రమణలు గతంలోనే జరిగి ఉంటేనే చర్యలు తీసుకొంటాం" అని బదులిచ్చారు. ఒకే మతం వారిని లక్ష్యంగా పెట్టుకున్నామన్న ఆరోపణలతో కోర్టు ఆదేశాలు జారీ చేస్తున్నట్లుగా ఉందని తాను ఆందోళన చెందుతున్నట్లు తుషార్ మెహతా పేర్కొన్నారు. స్పందించిన ధర్మాసనం.. "మనది సెక్యులర్ దేశం. మేం జారీ చేసిన మార్గదర్శకాలు అందరికీ వర్తిస్తాయి. జాతి, మతంతో సంబంధం లేదు. ఆక్రమణల విషయానికి వస్తే మేం ఇప్పటికే స్పష్టంగా చెప్పాం. గురుద్వారా లేదా

మిగతా 2వ పేజీలో...

మలక్‌పేటలోని శంకర్‌నగర్ బస్తీలో ఇళ్లను కూల్చివేస్తున్న కూలీలు



13

చీపుర్లు, రోకళ్లతో సిద్ధంగా ఉండండి

'మూసీ బాధితులకు భరోసా'లో కేటీఆర్

మూసీ ప్రక్షాళన మీ నిర్ణయమే!

మంత్రి శ్రీధర్‌బాబు

12

ఖాళీ చేసిన ఇళ్ల కూల్చివేత

- మూసీలో స్వచ్ఛందంగా వెళ్లినవారి నిర్మాణాల తొలగింపు.. గల్లీల్లో కూలీలతోనే పనులు
- డబుల్ బెడ్ రూమ్‌లకు వెళ్లిన నిర్వాసితులు
- కొంత సానుకూలత.. మరికొంత వ్యతిరేకత
- సంతోషం వ్యక్తం చేస్తున్న చిన్న కుటుంబాలు

హైదరాబాద్ సిటీ/ఓల్డ్ మలక్‌పేట్/చాదర్‌ఘాట్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మూసీ సుందరీకరణలో మరో అడుగుపడింది. డ్రోన్ సర్వే ద్వారా గుర్తించిన నదీ గర్భం (రివర్ బెడ్)లో ఉన్న ఇళ్ల కూల్చివేత మొదలైంది. స్వచ్ఛందంగా తరలివెళ్లినవారి నివాసాలను తొలగిస్తున్నారు. వీరికి డబుల్‌బెడ్ రూం

మిగతా 13వ పేజీలో...



25% బ్యాంకు గ్యారెంటీ

ఇస్తేనే ధాన్యం!

- మిల్లుల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కూడా అందజేయాలి
- మిల్లు లీజుకు తీసుకుంటే ఆ రిజిస్ట్రేషన్ డీడ్ తప్పనిసరి
- ఇదంతా మిల్లర్లు ధాన్యం అమ్ముకోకుండా కట్టడి చేసేందుకే
- క్రిమినల్ కేసులు, డిఫాల్టర్లుగా ఉన్న మిల్లర్లకు ధాన్యం బంద్
- ఖరీఫ్- 2024 సేకరణ మార్గదర్శకాల్లో చేర్చాలని నిర్ణయం
- అధికార్లు జాయింట్ కస్టోడియన్‌గా ఉన్నా బాధ్యత మిల్లర్లదే
- సార్టెక్స్, బ్లెండింగ్ మిషన్ల ఏర్పాటుకు డిసెంబరు 31 డెడ్‌లైన్

సకాలంలో మిల్లింగ్ చేయాల్సిందే!

నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు: డీఎస్ చౌహాన్

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం బ్యాంకు గ్యారెంటీ (బీజీ సిస్టమ్) విధానం అమల్లోకి రానుంది. ధాన్యాన్ని అమ్ముకోకుండా, కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియను ఆలస్యం చేయకుండా రైస్ మిల్లర్లను కట్టడి చేసేందుకు 2024-25 సేకరణ విధానంలో ఈ నిబంధన చేర్చాలని సర్కారు నిర్ణయించింది. దీనిపై త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకోనున్నారు. దీని ప్రకారం.. మిల్లింగ్ కోసం ధాన్యం ఇచ్చేముందే ఆ రైస్‌మిల్లుల తాలూకు రిజిస్ట్రేషన్ పత్రాలను డిపాజిట్ చేసుకోంది. అలాగే మొత్తం ధాన్యం విలువలో 25 శాతం మొత్తాన్ని బ్యాంకు గ్యారెంటీ కింద తీసుకోనుంది. ఉదాహరణకు ఒక రైస్‌మిల్లర్‌కు కోటి రూపాయల విలువైన ధాన్యం అప్పగించాలంటే సదరు రైస్ మిల్లరు రూ. 25 లక్షలు బ్యాంకులో చెల్లించాలి. మిగిలిన రూ.75 లక్షలకు విలువైన

మిగతా 14వ పేజీలో...



ఉధంపూర్ జిల్లాలోని ఓ పోలింగ్ బూత్‌లో ఓటర్లు

68.72% పోలింగ్

- జమ్మూ కశ్మీర్‌లో ముగిసిన ఓటింగ్
- మూడో దశలో రికార్డు స్థాయిలో పోలింగ్
- మూడు దశల్లో కలిపి మొత్తం 64.45%
- తొలిసారిగా ఓటువేసిన శరణార్థులు, వాల్మీకులు, గూర్ఖాలు

2

లడ్డూపై సిట్‌కు తాత్కాలిక బ్రేక్

14

- సుప్రీం ఆదేశాలు వచ్చే దాకా దర్యాప్తు నిలిపివేత
- ఎవరినో ఇరికించాలనో మాకు లేదు
- చట్టాలను, తీర్పులను గౌరవిస్తాం: ఏపీ డీజీపీ

600 వైద్య పోస్టుల భర్తీకి పచ్చజెండా

14

- ఈఎస్ఐ ఆస్పత్రుల్లో నింపాలని ఆదేశాలు
- మెడికల్ బోర్డు ద్వారా నియమించాలని జీవో



స్థానిక సంస్థల ఎన్నికల్లో 'సంతానం నిబంధన' ఎత్తివేత

- ఎంతమంది పిల్లలున్నా పోటీ చేయొచ్చు
- సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు వర్తింపు
- సిద్ధమైన సవరణ.. ఆర్డినెన్సు జారీకి అవకాశం

12

విద్యుదాఘాతంతో రోజుకు ఇద్దరు బలి!

- రాష్ట్రంలో ఏడాదికి సగటున 700 మంది
- కరెంట్ షాక్‌లతో పిట్టల్లా రాలుతున్న జనం
- గడిచిన ఏడేళ్లలో మనుషులు, జీవాలు కలుపుకొని 15,600 మరణాలు
- మృతుల్లో అత్యధికులు రైతులే
- ఉత్తర డిస్కం పరిధిలో మరణాలు అధికం.. తగ్గించడంలో అధికార్ల వైఫల్యం

3

రంగారెడ్డి జిల్లాలో షాక్‌తో ఇద్దరు రైతుల మృతి



దీక్ష విరమిస్తున్న ఈటల, మహేశ్వర్‌రెడ్డి

రేవంత్ సర్కారు.. ఇక ఇంటికే

- ఆరు గ్యారెంటీల అమలుకు కాలం చెల్లింది
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా.. ఎండగడతాం: బీజేపీ నేత అభయ్ పాటిల్
- ప్రజలే రేవంత్ భరతం పడతారు: ఈటల

12

మతపరమైన ఉత్సవాలు, ఊరేగింపుల్లో డీజేలపై నిషేధం

14

- పెరిగిపోతున్న అనారోగ్య సమస్యలు
- వృద్ధులు, చిన్నారులపై దుష్ప్రభావం
- ప్రజల నుంచి ఫిర్యాదుల వెల్లువ
- హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్

స్కూల్ బస్సుకు మంటలు.. 23 మంది మృతి

- వారిలో 20 మంది విద్యార్థులే
- బ్యాంకాక్‌లో దుర్ఘటన

2

ఇజ్రాయెల్‌పై ఇరాన్
క్షిపణుల వర్షం


క్షిపణి దాడితో టెల్ అవీవ్‌లో ఏర్పడ్డ భారీ గొయ్యి
టెల్ అవీవ్ వైపు దూసుకు వస్తున్న ఇరాన్ క్షిపణులు

(మొదటి పేజీ తరువాయి)

ఇజ్రాయెల్ రివల్యూషనరీ గార్డ్స్(ఐఆర్‌జీసీ) ప్రకటించింది. ఇజ్రాయెల్‌ను కంచుకోటగా కాపాడే ఐరన్‌డోమ్ వ్యవస్థ సింహభాగం క్షిపణులను అడ్డుకున్నా.. టెల్‌అవీవ్, నెగెవ్, షారోన్ నగరాలను పలు క్షిపణులు తాకాయని.. అక్కడ భవనాలు దెబ్బతిన్నాయని అధికారిక వర్గాలు చెప్పాయి. మధ్యధరా సముద్రంలోని తమ గ్యాస్‌పైప్‌లైన్ దెబ్బతిన్నట్లు సమాచారం అందినట్లు వివరించాయి. ఇరాన్ నుంచి వచ్చే క్షిపణులను కూల్చేయాలంటూ పశ్చిమాసియాలో ఉన్న తమ సైన్యానికి అమెరికా అధ్యక్షుడు జోబైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ ఆదేశాలు జారీ చేశారు. ముందు జాగ్రత్తగా పశ్చిమాసియాలో మూడు ఫైటర్ స్క్వాడ్రన్లను తరలించారు. క్షిపణి దాడి నేపథ్యంలో అధికారులు ఇజ్రాయెల్ గగనతలాన్ని మూసివేసివేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో.. టెల్‌అవీవ్‌లోని బెన్‌గురియన్ విమానాశ్రయంలో టేకాఫ్‌లు, ల్యాండింగ్‌లు నిలిచిపోయి.. పదుల సంఖ్యలో విమానాలు గాల్లో చక్కర్లు కొట్టాయి. ఇరాన్ నుంచి క్షిపణుల దాడి నిలిచిపోయాక.. గగనతలంలో విమానాల రాకపోకలను తిరిగి అనుమతించారు. ఓవైపు ఇరాన్ దాడులు కొనసాగుతుండగా.. పలువురు ముష్కరులు జాఫా ప్రాంతంలోని జెరూసలేం బోల్డె వార్డ్ వద్ద తుపాకులతో కాల్పులు జరుపుతూ ఉగ్రదాడికి దిగారు. ఈ దాడుల్లో 9 మంది పౌరులు చనిపోయారని.. పలువురు గాయపడ్డారని తెలుస్తోంది.


క్షిపణుల నుంచి రక్షణ కోసం నేలమాళిగల్లో దాక్కున్న ఇజ్రాయెల్ ప్రజలు

బంకర్లలోకి వెళ్లాలంటూ హెచ్చరికలు

ఇరాన్ దాడులు ప్రారంభమవ్వడానికి ముందే.. ఇజ్రాయెల్ ప్రభుత్వ వర్గాలు ఇళ్లలోంచి బయటకు రావాలని, సురక్షిత ప్రాంతాలు, బంకర్లలోకి తరలి వెళ్లాలని ప్రజలకు హెచ్చరికలు జారీ చేశాయి. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు కూడా బంకర్లలోంచే పరిస్థితిని సమీక్షించారు. దేశవ్యాప్తంగా.. 1,864 ప్రాంతాల్లో సైరన్లు మోగాయని.. తమ ఇంటర్‌సెప్టర్లు ఇరాన్ క్షిపణులను అడ్డుకుంటున్నాయని ఐడీఎఫ్ అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు. రాత్రి పదిగంటల సమయంలో ఇరాన్ క్షిపణి దాడి నిలిచిపోయిందని ఐడీఎఫ్ ప్రకటించింది. దాంతో.. ప్రజలు బంకర్లు, షెల్టర్ జోన్ల నుంచి తమ ఇళ్లకు తిరిగి వెళ్లారు. కాగా.. ఇరాన్ రాబోయే 12 నుంచి 24 గంటల్లో ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్ క్షిపణులతో దాడులు చేయవచ్చని అమెరికా మంగళవారం ఉదయమే హెచ్చరించింది. "హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియే హత్య తర్వాత ఇరాన్ తన బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులను, డ్రోన్లను సిద్ధం చేసింది. హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా హత్య తర్వాత దాడులకు వ్యూహాలను రచించింది. 12 నుంచి 24 గంటల్లో దాడులు జరుపుతుందని మా నిఘా వర్గాల సమాచారం" అని అప్రమత్తం చేసింది. ఇరాన్ గనక దాడికి దిగితే.. మూల్యం చెల్లించుకోక తప్పదని అమెరికా హెచ్చరించింది. మరోవైపు, భూతల దాడులను వెంటనే ఆపాలని, ఇజ్రాయెల్ తన సేనలను లెబనాన్ నుంచి ఉపసంహరించుకోవాలంటూ రష్యా మంగళవారం సాయంత్రం హెచ్చరికలు జారీ చేసినట్లు అరబ్ పత్రికలు పేర్కొన్నాయి. మరోవైపు.. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య ఫోన్‌లో చర్చలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అధికారవర్గాలు వెల్లడించాయి.

హిజ్బుల్లా ఆయుధాల ధ్వంసం

యుద్ధ ట్యాంకులు.. రాకెట్ లాంచర్లతో లెబనాన్ దక్షిణ ప్రాంతంపై విరుచుకుపడుతూ భూతల దాడులు ప్రారంభించిన ఇజ్రాయెల్.. మంగళవారం ఒక్కరోజే 70కి పైగా ఆపరేషన్లను నిర్వహించినట్లు వెల్లడించింది. సరిహద్దుల్లో హిజ్బుల్లాకు చెందిన భారీ సొరంగాలను గుర్తించి, వాటిని ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ తన అధికారిక టెలిగ్రామ్ చానల్‌లో ప్రకటించింది. ఐడీఎఫ్‌కు చెందిన 98వ డివిజన్ కమాండోలు సరిహద్దుల నుంచి 10 కిలోమీటర్ల దూరం వరకు చొచ్చుకుపోయారని వెల్లడించింది. ఇజ్రాయెల్ సరిహద్దులకు సమీపంలో ఉన్న టన్నెల్స్‌లో హిజ్బుల్లా ఉగ్రవాదులు వ్యూహాత్మకంగా ఆయుధాలను నిల్వ చేశారని.. హమాస్ తరహాలో ఇజ్రాయెల్‌లోకి చొరబడి దాడికి కుట్ర పన్నిన విషయాన్ని గుర్తించామని పేర్కొంది. "సరిహద్దుల్లో ఇరుదేశాల మధ్య ఉన్న గోడను ధ్వంసం చేసేందుకు హిజ్బుల్లా ఐఈడీలను సిద్ధం చేసుకున్నట్లు గుర్తించాం. హమాస్ మాదిరిగా.. ఇజ్రాయెల్‌లోకి చొరబడి.. పౌరులను అంతమొందించాలనేది హిజ్బుల్లా ప్రణాళిక అని తెలుస్తోంది" అని వివరించింది. కాగా.. భూతల దాడులకు ముందే ఇజ్రాయెల్ సైన్యం లెబనాన్ పౌరులకు హెచ్చరికలు జారీ చేసింది. "మీకు ప్రాణనష్టం కలగకుండా ఉండాలంటే.. అవాలి నది(సరిహద్దు నుంచి 60 కిలోమీటర్ల దూరం) సమీపానికి వెళ్లండి" అని పేర్కొంది. మంగళవారం రాత్రి కడపటి వార్తలందేసరికి.. ఐడీఎఫ్ బలగాలు సరిహద్దుల నుంచి 10-15 కిలోమీటర్ల మేర.. పలు గ్రామాలను దాటుకుంటూ వెళ్లింది.

మా సీక్రెట్ సర్వీస్ చీఫ్ ఇజ్రాయెల్ గూఢచారి

ఇరాన్ గూఢచారి ఇచ్చిన సమాచారం ఆధారంగానే హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లాను ఇజ్రాయెల్ హతమార్చిందనే వార్తల నేపథ్యంలో ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమూద్ అహ్మదీన్‌జాద్ సంచలన విషయం బయటపెట్టారు. ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్.. ఇరాన్‌లో చేస్తోన్న కార్యకలాపాలపై నిఘాకు తాము ఏర్పాటు చేసిన సీక్రెట్ సర్వీస్ సంస్థ అధిపతి ఓ ఇజ్రాయెల్ గూఢచారి అని పేర్కొన్నారు. ఇరాన్‌లో ఇజ్రాయెల్ గూఢచర్యాన్ని అడ్డుకునే బాధ్యత కలిగిన దేశ అత్యున్నత అధికారి మొస్సాద్ మనిషి అని తాము 2021లో గుర్తించామని తెలిపారు.

ఖండించిన ఐరాస చీఫ్
నేడు భద్రతా మండలి సమావేశం

పశ్చిమాసియాలో దాడులను ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ఖండించారు. ఆయన ఏ దేశం పేరును ప్రస్తావించకుండా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఆగిపోవాలని.. కాల్పుల విరమణ జరగాలని ఆకాంక్షించారు. మరోవైపు ఇరాన్ దాడిపై బుధవారం ఐరాస భద్రతామండలిలో చర్చకు డిమాండ్ చేస్తామని ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ వెల్లడించారు. "ఇజ్రాయెల్‌పై ఇరాన్ అతిపెద్ద, అత్యంత హింసాత్మకంగా క్షిపణులతో దాడి చేసింది. మేము ఆత్మరక్షణకు దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇజ్రాయెల్ పౌరుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలను తీసుకునే హక్కు ఇజ్రాయెల్ ప్రభుత్వానికి ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు.




పేజర్ పేలుళ్ల వెనక భారతీయుడు?

గత నెల లెబనాన్ వ్యాప్తంగా ఏకకాలంలో 3 వేలకు పైగా పేజర్ బాంబులు పేలి.. 39 మంది మృతిచెందిన తెలిసిందే.! తొలుత తైవాన్‌కు చెందిన కంపెనీ.. ఆ తర్వాత హంగరీకి చెందిన డిస్ట్రిబ్యూటర్ ద్వారా హిజ్బుల్లాకు పేజర్లు అందినట్లు వార్తలు వచ్చాయి. అయితే.. భారతీయ-నార్వేయన్ రిన్సన్ జోస్ కోసం అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలు వేట కొనసాగిస్తున్నాయి. నార్వేలో స్థిరపడ్డ రిన్సన్ స్వస్థలం కేరళ. పేలిపోయిన పేజర్లను నార్వే ఆధారంగా పనిచేస్తున్న అతని కంపెనీలో తయారైనవని నార్వేస్ నేషనల్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ సర్వీస్ గుర్తించింది.

దాడులకు మేం సిద్ధం: హిజ్బుల్లా


లెబనాన్‌లో ఇజ్రాయెల్ భూతల దాడులు ప్రారంభమైన మాట నిజం కాదని హిజ్బుల్లా పేర్కొంది. ఈ మేరకు హిజ్బుల్లా ప్రతినిధి మహమ్మద్ అఫీఫ్ అరబిక్‌లో మాట్లాడిన ఓ వీడియోను విడుదల చేశారు. ఇజ్రాయెల్‌పై తమ రాకెట్ దాడులు కొనసాగుతున్నాయని.. భూతల దాడులకు వచ్చే ఐడీఎఫ్ బలగాలను ఎదుర్కొనేందుకు తమ ఫైటర్లు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. అటు ఐడీఎఫ్ కూడా.. లిటానీ నది పరిసరాల్లో వెయ్యి మందికిపైగా హిజ్బుల్లా ఉగ్రవాదులు కాపు కాచిన విషయాన్ని గుర్తించినట్లు తెలిపింది. కాగా.. హిజ్బుల్లా వద్ద ఇరాన్ తయారీ ఫాది క్షిపణులు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు ఇజ్రాయెల్ అనుమానిస్తోంది. ఇవి ఇరాన్‌కు చెందిన ఖైబర్ ఎం-302లాంటివని తెలుస్తోంది. 1987లో హతమైన ఫాది హసన్ తవీల్ పేరుతో హిజ్బుల్లా ఈ క్షిపణులను తయారు చేయిస్తోందని అనుమానిస్తోంది. వీటిల్లో ఫాది-4 క్షిపణికి 300 కిలోల వార్‌హెడ్‌ను మోసుకెళ్లే సామర్థ్యం ఉంది. 200 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. ఫాది-3 క్షిపణి 250 కిలోల పేలోడ్‌ను మోసుకెళ్తూ.. 150 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదిస్తుంది. ఫాది క్షిపణులు గైడెడ్ కాగా.. భూతలం నుంచి భూతలంపై ఉండే లక్ష్యాలను ఛేదించే దీర్ఘశ్రేణి 'ఖాదర్' క్షిపణి, చైనా తయారీ సీ801, సీ802 కూడా ఉన్నట్లు అంతర్జాతీయ పరిశోధన సంస్థలు చెబుతున్నాయి.

లోకం తీరు



మీ అమ్మాయికి పెళ్లి చేసి భక్తురాళ్లకు సన్యాసం బోధా?

- జగ్గీ వాసుదేవ్‌కు మద్రాస్ హైకోర్టు చురక



చెన్నై, అక్టోబరు 1: సద్గురు జగ్గీ వాసుదేవ్ ఒకపక్క తన కుమార్తెకు చక్కగా పెళ్లిచేసి జీవితంలో స్థిరపడేట్లు చేసి, మరోపక్క ఇతర యువతులను ఐహిక జీవితాన్ని వదిలి యోగా కేంద్రాల్లో సన్యాసినులుగా బతికే విధంగా ఎందుకు ప్రోత్సహిస్తున్నారని మద్రాస్ హైకోర్టు ప్రశ్నించింది. బాగా చదువుకున్న తన ఇద్దరు కూతుళ్లను ఈష ఫౌండేషన్ మాయలో పడేసి ఆశ్రమానికి శాశ్వత బందీలుగా మార్చిందని, వారిద్దరిని తనకు అప్పగించాలని ఒక తండ్రి వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్ విచారణ సందర్భంగా ధర్మాసనం సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. తమిళనాడు వ్యవసాయ వర్సిటీలో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేసిన ఎస్.కామరాజ్(69) తన ఇద్దరు కుమార్తెల(42, 39)ను ఈష ఫౌండేషన్ నుంచి విడిపించాలని మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టుకు హాజరైన ఇద్దరు కుమార్తెలు తాము ఇష్ట పూర్తిగానే సన్యాసినుల జీవితాన్ని ఎంచుకున్నామని చెప్పారు. వారిని పలు ప్రశ్నలు అడిగిన న్యాయ మూర్తులు ఈ అంశంపై మరింత దర్యాప్తు జరపాలని నిర్ణయించారు. ఆచార్యుడి కుమార్తెలు ఏదో చెప్పబోగా, "ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నామని భావిస్తున్న మీకు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం పాపంగా కనబడటం లేదా? అని ధర్మాసనం నిలదీసింది. ఈషా ఫౌండేషన్‌పై కేసుల ప్రస్తుత పరిస్థితి మీద నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ ధర్మాసనం విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. మద్రాస్ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కోయంబత్తూరులోని ఈషా యోగా కేంద్రంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు.

పేజర్ పేలుడు వ్యవస్థ భారత్‌లోకి రాకుండా అడ్డుకోవాలి!

- ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర

న్యూఢిల్లీ, అక్టోబరు 1: పేజర్ పేలుడు వ్యవస్థ.. భారత్‌లోకి ప్రవేశించకుండా ఎక్కడికక్కడ అడ్డుకోవాల్సిన అవసరం ఉందని, హిజ్బుల్లా తీవ్రవాదులకు చెందిన పేజర్లు, వాకీ-టాకీలను పేల్చివేయడం ద్వారా లెబనాన్‌కు ఇజ్రాయెల్ మాస్టర్‌స్ట్రోక్ ఇచ్చిందని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ అన్నారు. ఈ ఆపరేషన్ ఒక్కరోజులో జరిగింది కాదని, ఏళ్ల తరబడి ఇజ్రాయెల్ దీనిపై కసరత్తు చేసిందన్నారు. అయితే, ఇలాంటి వ్యవస్థలు భారత్‌లోకి ప్రవేశించకుండా సప్లయ్ చైన్‌ను ఎక్కడికక్కడ అడ్డుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన 'చాణక్య డిఫెన్స్ డైలాగ్స్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తూర్పు లద్దాఖ్‌లోని వాస్తవాధీన రేఖ వెంబడి పరిస్థితి స్థిరంగా ఉందని, కానీ, సాధారణస్థాయిలో లేదని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర తెలిపారు. చైనా-భారత్‌ల మధ్య దౌత్యపరమైన చర్చల ద్వారా మాత్రమే సానుకూల పరిస్థితులు ఏర్పడతాయని, అక్కడ ఎలాంటి చర్యలు చేపట్టాలన్నా క్షేత్రస్థాయిలో ఉన్న మిలటరీ కమాండర్ల ప్రణాళికలపై ఆధారపడి ఉంటుందన్నారు. అయితే, 2020, ఏప్రిల్‌కి ముందున్న పరిస్థితిని పునరుద్ధరించాలని తాము కోరుకుంటున్నట్టు చెప్పారు. భారత సరిహద్దు వెంబడి చైనా గ్రామాలను నిర్మిస్తోందన్న ప్రశ్నకు స్పందిస్తూ.. "చైనా కృత్రిమ వలసలను ప్రోత్సహిస్తోంది. అయినా ఎలాంటి ఇబ్బందీ లేదు. అది వారి దేశమే. మనకు కూడా సరిహద్దు వెంబడి మోడల్ గ్రామాలు ఉన్నాయి" అని ఉపేంద్ర వ్యాఖ్యానించారు.

జమ్మూ కశ్మీర్ మూడో దశలో 68.72% పోలింగ్

జమ్మూ/శ్రీనగర్, అక్టోబరు1: జమ్మూ-కశ్మీర్‌లో మంగళవారం చివరిదైన మూడో దశ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మూడో దశలో 68.72%, మొత్తంగా(మూడు దశల్లో కలిపి) 64.45 శాతం ఓటింగ్ నమోదైంది. అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లోనూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని అధికార వర్గాలు పేర్కొన్నాయి. జమ్మూ, కశ్మీర్‌ల్లోని ఏడు జిల్లాల్లో ఉన్న 40 నియోజకవర్గాల్లో మూడో దశ ఓటింగ్ జరిగింది. ఆర్టికల్ 370 అధికరణం రద్దు కారణంగా తొలిసారి ఓటు హక్కు పొందిన పశ్చిమ పాకిస్థాన్ శరణార్థులు, వాల్మీకీ సమాజ్, గోర్ఖా సామాజిక వర్గం ఓటర్లు ముందుగానే లైన్లలో నిల్చొన్నారు. ఇది 'చరిత్రాత్మక సందర్భమ'ని వారు అన్నారు. కశ్మీరీ శరణార్థుల కోసం ఢిల్లీలో నాలుగు, ఉధంపూర్ జిల్లాలో ఒకటి, జమ్మూలో 19, మొత్తం 24 ప్రత్యేక పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల కోసం 400కుపైగా కంపెనీల దళాలను నియమించారు.

డేరా బాబాకు 20 రోజుల పాటు మళ్లీ పెరోల్

చండీగఢ్, అక్టోబరు 1: శిష్యురాళ్లపై అత్యాచారం చేశారన్న కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌదా అధిపతి గుర్మీత్ రాం రహీం సింగ్ మరోసారి పెరోల్‌పై విడుదల కానున్నారు. 20 రోజుల పెరోల్ ఇవ్వాలన్న ఆయన వినతిని మంగళవారం రోహతక్ డివిజనల్ కమిషనర్ సంజీవ్ వర్మ ఆమోదించారు. ఆయన బుధవారం రోహతక్‌లోని సునారియా జైలు నుంచి విడుదల కానున్నారు. హరియాణా ఎలక్షన్లు సమీపిస్తున్న సమయంలో డేరాబాబా కారాగారం నుంచి బయటకు రానుండడం గమనార్హం. అయితే, ఆయన హరియాణాలో అడుగుపెట్టకూడదని ఎన్నికల సంఘం ఆంక్షలు పెట్టింది. ప్రత్యక్షంగాగానీ, సామాజిక మాధ్యమాల రూపంలోగానీ ప్రచారం చేయకూడదని తెలిపింది.

బ్యాంకాక్‌లో స్కూల్ బస్సుకు మంటలు... 20 మంది చిన్నారులు మృతి

బ్యాంకాక్, అక్టోబరు 1: ప్రమాదవశాత్తు ఓ పాఠశాల బస్సు మంటల్లో చిక్కుకోవడంతో దాదాపు 23 మంది మృతిచెందిన ఘటన థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ శివారులోని థాని ప్రావిన్స్‌లో మంగళవారం జరిగింది. మృతుల్లో 20 మంది చిన్నారులతో పాటు ముగ్గురు ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. విహార యాత్రకు వెళ్లి వస్తుండగా బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఈ దుర్ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో మొత్తం 44 మంది ఉన్నారు.

2.17 కోట్ల సిమ్ కార్డులు రద్దు!

- సైబర్ నేరాలకు అడ్డుకట్ట దిశగా చర్యలు

న్యూఢిల్లీ, అక్టోబరు 1: సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సైబర్ క్రైమ్‌కు ప్రధాన కారణంగా మారిన సిమ్ కార్డులు, మొబైల్ ఫోన్లపై దృష్టిపెట్టింది. నకిలీ డాక్యుమెంట్లతో తీసుకున్న, సైబర్ నేరాలకు దుర్వినియోగం చేస్తున్న 2.17 కోట్ల సిమ్ కార్డులను రద్దు చేస్తామని, సుమారు 2.26 లక్షల మొబైల్ ఫోన్లను బ్లాక్ చేస్తామని కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ.. ఉన్నతస్థాయి ప్యానెల్‌కు చెప్పినట్టు తెలిసింది. ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిర్వహించిన సమావేశంలో ఈ కనెక్షన్ల రద్దుకు సంబంధించిన సమాచారాన్ని టెలికాం శాఖ పంచుకున్నట్టు తెలిసింది. అలాగే సిమ్ కార్డుల జారీ సమయంలో కేవైసీ (నో యువర్ కస్టమర్)ను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపింది. ఈ సమావేశంలో బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్, ఆర్బీఐ, ఎన్ఐఏ, ఐటీ శాఖ, సీబీఐ అధికారులు, ఇతర భద్రత ఏజెన్సీలకు చెందిన నిపుణులు, రాష్ట్రాల సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ అంచనా ప్రకారం ఈ ఏడాది మార్చికి ముందు 6 నెలల కాలంలో భారతీయులు సైబర్ నేరాల బారినపడి సుమారు రూ.500 కోట్లు పోగొట్టుకున్నారు. దీనిపై దృష్టిపెట్టిన కేంద్ర ప్రభుత్వం సైబర్ నేరాలపై ఉన్నత స్థాయి ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. 'నిర్దేశిత పరిమితికి మించి, ఫోర్జరీ డాక్యుమెంట్లతో తీసుకున్న.. లేదా సైబర్ నేరాలకు వినియోగించిన సుమారు 2.17 కోట్ల సిమ్ కార్డులను టెలికాం శాఖ డిస్‌కనెక్ట్ చేయనుంది. అలాగే 2.26 లక్షల మొబైల్ ఫోన్లను బ్లాక్ చేయనుంది' అని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

చీఫ్ జస్టిస్ విచారణ సెట్టింగ్ వేసి..

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఈ కేసులో నిందితుడిగా చేరుస్తున్నాం' అని చెప్పాడు. ఓస్వాల్ స్పందిస్తూ.. తనకు కెనరా బ్యాంకులో ఖాతానే లేదని చెప్పారు. దీనికి సైబర్ కేటుగాడు.. 'మీ ఆధార్‌తోనే ఆ ఖాతాను తెరిచారు' అని పేర్కొన్నాడు. తనకు నరేశ్ గోయల్ కూడా తెలియదని, కాకపోతే, జెట్ ఎయిర్‌వేస్‌లో ప్రయాణించానని, అప్పుడు ఆధార్ వివరాలు ఇచ్చి ఉంటానని ఓస్వాల్ చెప్పారు. దీంతో ఆ మోసగాడు.. మీ ఆధార్ వివరాలను దుర్వినియోగం చేసినట్లుందని పేర్కొంటూ.. అయినప్పటికీ, ఈ కేసులో మీరు నిందితుడిగా ఉన్నారు కాబట్టి, డిజిటల్ కస్టడీలోకి తీసుకుంటున్నామని చెప్పాడు. అనంతరం మరొకడు వీడియోకాల్ చేశాడు. తన పేరు రాహుల్ గుప్తా అని, తాను చీఫ్ ఇన్వెస్టింగ్ ఆఫీసర్‌నని చెప్పాడు. సైబర్ అరెస్టుకు సంబంధించిన నిబంధనలను వాట్సాప్ ద్వారా పంపించాడు. ఆ తర్వాత మరికొందరు అధికారుల పేర్లతో వీడియోకాల్స్ చేసి ఓస్వాల్ బాల్యం, విద్యాభ్యాసం, వ్యాపారంలోకి ప్రవేశం, ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన స్టేట్‌మెంట్ 'రికార్డు' చేసుకున్నారు. ఆ తర్వాత.. 'మీరు వీడియో నిఘా కింద ఉన్నారు. మీరు మీ గది నుంచి బయటకెళ్తే మాకు చెప్పాలి. ఫోన్ మీ వెంటే ఉంచుకోవాలి. ఈ కేసు 'జాతీయ రహస్యాల చట్టం' కింద నమోదైంది కాబట్టి.. ఎవరికీ దీని గురించి చెప్పవద్దు. ఎవరితో మాట్లాడినా మీతోపాటు వాళ్లు కూడా 3-5 ఏళ్లు జైలుపాలైతారు' అని ఓస్వాల్‌ను బెదిరించారు. ఈ వీడియోకాల్స్ కొనసాగుతూ వచ్చాయి. ఒకదశలో వీడియోలోనే కోర్టు విచారణ జరిపారు. ఏకంగా సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఈ కేసు విచారిస్తున్నట్లు సెట్టింగు వేశారు. కేసు విచారణ జరిపిన 'జస్టిస్ చంద్రచూడ్' ఓస్వాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. సుప్రీంకోర్టు లోగోతో, రెవెన్యూ స్టాంపులతో కూడిన ఆ ఆదేశాలను ఓస్వాల్‌కు వాట్సాప్‌లో జారీ చేశారు. అనంతరం.. ఈడీ, ముంబై పోలీసుల లోగోలతో కూడిన అరెస్టు వారెంటు వాట్సాప్‌లో పంపించారు. దాని మీద ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ నీరజ్ కుమార్ పేరుతో ఓ సంతకం ఉంది. వీటన్నింటి తర్వాత, మరికొందరు కేటుగాళ్లు ఈడీ, సీబీఐ అధికార్ల పేరుతో ఫోన్ చేసి మాట్లాడుతూ.. మిమ్మల్ని రక్షిస్తాం.. రూ.7 కోట్లు పంపించండి అని చెప్పటంతో.. వారు సూచించిన వేర్వేరు బ్యాంకు ఖాతాలకు రూ.7 కోట్లు ఓస్వాల్ పంపించారు. ఇదంతా ఆగస్టు 28, 29 తేదీల్లో జరిగింది. తొలుత బెదిరిపోయి డబ్బులు పంపించిన ఓస్వాల్.. తర్వాత.. జరిగిన మోసం గుర్తించి పోలీసులకు అదే నెల 31వ తేదీన ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఓస్వాల్ డబ్బులు పంపిన 3 ఖాతాలను స్తంభింపజేశారు. తద్వారా రూ.5.25 కోట్లను తిరిగి ఓస్వాల్‌కు అప్పగించారు.


ఓస్వాల్

డిజిటల్ అరెస్టు అనేదే లేదు!

ఈ ఘటనపై ముంబై పోలీసులు స్పందిస్తూ.. చట్టప్రకారం డిజిటల్ అరెస్టు అనేదే లేదని, వరుస వీడియోకాల్స్ చేసి బెదిరించటానికి మోసగాళ్లు వేస్తున్న ఎత్తుగడ ఇదని తెలిపారు. ఇటువంటి కాల్ రాగానే పోలీసులకు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.

అంతరాష్ట్ర ముఠా

దీని వెనుక ఓ అంతరాష్ట్ర ముఠా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అస్సాం గౌహతిలో అతనుచౌదరి, ఆనంద్‌కుమార్ అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఈ భారీ దోపిడీ వెనుక ఉన్న అసలు సూత్రధారి ఓ మాజీ బ్యాంకు ఉద్యోగి అని, ఆ వ్యక్తి పేరు రుమి కలితా అని పోలీసులు గుర్తించారు. నిందితులకోసం గాలిస్తున్నారు.

బిలియనీర్ల పెళ్లిళ్లకు వేల కోట్లు... పేదలకేమో అప్పులు!

- అంబానీ కొడుకు పెళ్లికి ఖర్చు చేసిన డబ్బంతా పేదల సొమ్మే
- హరియాణా ప్రచారంలో రాహుల్



న్యూఢిల్లీ, అక్టోబరు 1: పాతికమంది పారిశ్రామికవేత్తల కోసం మోదీ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. భారత్‌లో కేవలం ఓ 25 మంది తమ ఇంట పెళ్లిళ్లకు వేలాది కోట్లు ఖర్చు పెడుతున్నారని, అదే సమయంలో రైతులు, సామాన్య ప్రజలు మాత్రం తమ పిల్లల పెళ్లిళ్ల కోసం అప్పులు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎంపిక చేసిన కొద్దిమంది పారిశ్రామికవేత్తల కోసమే పనిచేస్తున్న మోదీ ప్రభుత్వ తీరు రాజ్యాంగ ఉల్లంఘన కాక మరేమిటని రాహుల్ ప్రశ్నించారు. దిగ్గజ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ తన కుమారుడి వివాహం కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని అది ఈ దేశ ప్రజల సొత్తు అని రాహుల్ అన్నారు. హరియాణాలోని బహదూర్‌గఢ్‌లో ఎన్నికల సభలో రాహుల్ మంగళవారం ప్రసంగించారు. ఈ నెల 5న పోలింగ్ జరగనున్న హరియాణాలో హ్యాట్రిక్ కొట్టాలని బీజేపీ, పదేళ్ల తర్వాతైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ హోరాహోరీ తలపడుతున్నాయి. కాగా, హిందుత్వ సిద్ధాంతకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ దాఖలైన పరువు నష్టం దావాలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి కోర్టు సమన్లు జారీ చేసింది. స్వయంగాగానీ, న్యాయవాదిని పంపించడం ద్వారాగానీ విచారణకు హాజరు కావాలని నాసిక్ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేటు దీపాలీ పరిమల్ కదూస్కర్ సమన్లు పంపించారు.

గురుద్వారా, దర్గా, గుడి.. రోడ్లపై ఏది ఉన్నా.. తొలగించాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)



దర్గా లేదా గుడి ఏదైనా, ఏ మతపరమైన ప్రార్థనా మందిరమైనా రోడ్లు, ఫుట్‌పాత్‌లు, జలాశయాలు, రైల్వే ట్రాక్‌లు, ప్రభుత్వ భూములు, అటవీ భూములు వంటి వాటిలో ఉంటే కచ్చితంగా తొలగించాల్సిందే. అవన్నీ ప్రజలకు అడ్డంకి కాదా? అక్రమ నిర్మాణాల విషయంలో అందరికీ ఒకే చట్టం వర్తిస్తుంది. వాటిని ఎప్పుడూ సమర్థించం" అని వ్యాఖ్యానించింది. "అక్రమ నిర్మాణాల విషయంలో ఎవరికైనా ఒకే చట్టం. మతం లేదా ప్రజల విశ్వాసాలతో సంబంధం లేదు" అని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు. మునిసిపల్ కార్పొరేషన్లు, పంచాయతీలకు వేర్వేరు చట్టాలు ఉన్నాయని తెలిపింది. ఆన్‌లైన్ పోర్టల్‌లో అన్ని వివరాలు ఉండాలని, దానివల్ల ప్రజలకు సమాచారం లభిస్తుందని ధర్మాసనం పేర్కొంది. ఇదేసమయంలో ఐరాస ప్రతినిధి తరఫున దేశంలో ఇళ్ల లభ్యతపై సీనియర్ న్యాయవాది బృందా గ్రోవర్ వాదనలు వినిపించబోగా.. తుషార్ మెహతా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం లేదని, దేశ న్యాయస్థానాలకు తగిన సామర్థ్యం ఉందని చెప్పారు. ఈ అంశంలో అంతర్జాతీయ జోక్యం అవసరం లేదని స్పష్టం చేశారు. పిటిషనర్ల తరపున న్యాయవాది సీయూ సింగ్ వాదిస్తూ.. నేరాలపై పోరాటానికి బుల్డోజర్ చర్యలను ఆయుధాలుగా వాడుకోరాదన్నారు. మైనారిటీలపై తీసుకున్న చర్యలు తక్కువేనని మెహతా పేర్కొనడాన్ని తప్పుపట్టిన ధర్మాసనం.. 4.45 లక్షల ఇళ్లను కూలగొట్టారని తెలిపింది. నేరం చేశారన్న నెపంతో వారి ఆస్తులను ధ్వంసం చేయకూడదని.. ఎవరైనా అక్రమ నిర్మాణాలను చేపడితే కూలగొట్టవచ్చని స్పష్టం చేసింది. ఇరుపక్షాల వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే, అక్టోబరు 1 వరకు తమ అనుమతి లేకుండా ఎలాంటి కూల్చివేతలకు పాల్పడవద్దని గత నెల 17న సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించాలని పిటిషనర్ల తరపు న్యాయవాది కోరారు. స్పందించిన ధర్మాసనం.. ఈ అంశంపై తాము తీర్పు ఇచ్చే వరకు నాటి మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది.

సిద్దరామయ్య భార్యకు స్థలాల కేటాయింపు రద్దు

బెంగళూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సీఎం సిద్దరామయ్య భార్య పార్వతికి భూసమీకరణలో పరిహారం కింద ఇచ్చిన 14 ప్లాట్ల కేటాయింపును ముడా(మైసూర్ నగరాభివృద్ధి సంస్థ) రద్దు చేసింది. ఆ స్థలాలపై ఎటువంటి లావాదేవీలూ నిర్వహించే అధికారం ఇకపై వారికి లేదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అంతకుముందు ఆ 14 ప్లాట్లలో లోకాయుక్త పోలీసులు సర్వే నిర్వహించారు. ఈ ప్లాట్ల కేటాయింపు వివాదాస్పదమైన నేపథ్యంలో లోకాయుక్త పోలీసులు సెప్టెంబరు 27న కేసు నమోదు చేయగా, ఆ ఎఫ్ఐఆర్‌ను పరిగణనలోకి తీసుకున్న ఈడీ అధికారులు సోమవారం సిద్దరామయ్య, పార్వతి తదితరులపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ప్లాట్లను ముడాకు తిరిగి అప్పగించడం.. వారు తప్పు చేశారని ఒప్పుకోవడమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర విమర్శించారు. కేసుల నుంచి తప్పించుకోడానికే ఇలా రాజకీయ డ్రామాకు తెరతీశారన్నారు. సిద్దరామయ్య మొండిపట్టు వీడి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని విజయేంద్ర డిమాండ్ చేశారు. కాగా, ముడా స్థలాలకు మనీలాండరింగ్ నిబంధనలు ఎలా వర్తిస్తాయో తనకు అర్థం కావడం లేదని సిద్దరామయ్య మంగళవారం ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ కవితకు వైద్య పరీక్షలు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యతో ఇబ్బంది పడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మంగళవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమెకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అనంతరం సాయంత్రం ఆమె ఇంటికి వెళ్లి పోయినట్లు పేర్కొన్నాయి. ఢిల్లీ మద్యం కేసులో తిహాడ్ జైలులో ఉన్న సమయంలో గైనిక్ సమస్యలు, తీవ్ర జ్వరంతో కవిత పలుసార్లు అనారోగ్యానికి గురయ్యారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో ఆమెకు గతంలో వైద్య పరీక్షలు చేశారు. కాగా, ప్రస్తుతం ఆమె గైనిక్ సమస్యతో బాధపడుతున్నట్లు సమాచారం. 5 నెలలపాటు జైలులో గడిపిన తర్వాత సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంతో గత నెల ఆమె జైలు నుంచి విడుదలయ్యారు.

జమైకాలో యూపీఐ చెల్లింపులకి భారత్ సిద్ధం

న్యూఢిల్లీ, అక్టోబరు 1: భారత ప్రధాని నరేంద్ర మోదీ, జమైకా ప్రధాన మంత్రి ఆండ్రివ్ హోల్నెస్‌ల మధ్య జరిగిన విస్తృత స్థాయి ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా పలు కీలక అంశాలపై రెండు దేశాల మధ్య ఒప్పందాలు జరిగాయి. యూపీఐ చెల్లింపుల విధానాన్ని జమైకాలో ప్రారంభించేందుకు భారత్ అంగీకరించింది. రక్షణ, ఇంధన, విద్య, వైద్య వ్యవసాయం, పరిశ్రమలు తదితర అంశాల్లో సహకారం అందించేందుకు భారత్ అంగీకారాన్ని తెలిపింది. జమైకా సైనికులకి శిక్షణ, ఆ దేశ రక్షణ వ్యవస్థ ఆధునీకరణకు రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ సహకారానికి చిహ్నంగా 'జమైకా మార్గ్' రోడ్డును హోల్నెస్ ప్రారంభించారు.

ఆయిల్ పామ్‌కు పైసలే పైసలు!

కేంద్రం దిగుమతి సుంకం పెంచడంతో రూ.2,651 చొప్పున పెరిగిన గెల ధర

- రూ.17,043కు చేరుకున్న ధర
- ఈ నెలలోనే రైతులకు అదనంగా రూ.12 కోట్ల మేర లబ్ధి
- ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు 14 కంపెనీలకు అనుమతులు: తుమ్మల

హైదరాబాద్, అశ్వారావుపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 5.5 శాతం నుంచి 27.5 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడంతో రూ. 14,392గా ఉన్న ముడి గెల ధర అమాంతం రూ. 2,651 పెరిగి రూ. 17,043కు చేరుకున్నదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇది ఆయిల్‌పామ్ రైతులకు దసరా కానుకగా ఆయన అభివర్ణించారు. పెరిగిన ధరలు ఈ నెల నుంచే అమల్లోకి వస్తాయని చెప్పారు. ధరల పెరుగుదలతో రైతులకు ఈనెలలో అదనంగా రూ. 12 కోట్లు లబ్ధి చేకూరుతుందన్నారు. ముడిపామాయిల్‌పై దిగుమతి సుం కాన్ని తిరిగి విధించి దేశీయ ఆయిల్‌పామ్ రైతులను ఆదుకొనేవిధంగా చర్యలను తీసుకోవాలంటూ కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను తుమ్మల ఇటీవల కోరారు. తుమ్మల చొరవతో సెప్టెంబరు 13న కేంద్ర ప్రభుత్వం ముడిపామ్ ఆయిల్ దిగుమతిపై సుంకాన్ని 5.5 శాతం నుంచి 27.5 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. ఫలితంగా రైతులకు మేలు జరిగిందని తుమ్మల అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 44,444 ఎకరాల పామ్ ఆయిల్ తోటల నుంచి ఏడాదికి 2.80 లక్షల టన్నుల ఆయిల్ పామ్ గెలల దిగుబడి వస్తోందని, ఈధరల పెరుగుదలతో 9,366 మంది ఆయిల్ పామ్ రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. పామ్ ఆయిల్ దిగుమతిపై కేంద్ర ప్రభుత్వానికి సంవత్సరానికి రూ.80 వేల కోట్ల మేర విదేశీమారక ద్రవ్యం ఖర్చవుతుందని, దిగుమతి సుంకాలు విధించడంవల్ల దేశంలోని పామ్ ఆయిల్ రైతులు, ముఖ్యంగా తెలంగాణ పామ్ ఆయిల్ రైతులు ప్రయోజనం పొందుతారని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గెలల ధర పెరుగుదలతో కొత్తగా రైతులు పామ్ ఆయిల్ వైపు మొగ్గు చూపే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం 31 జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరణ చేపట్టేందుకు 14 కంపెనీలకు అనుమతులిచ్చిందని, ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 2.23 లక్షల ఎకరాలను ఆయిల్ పామ్ సాగు కిందకు తీసుకవచ్చినట్లు తుమ్మల తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు చేయాలనుకునే రైతుల కోసం మొక్కలు సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో 20 మంది సిబ్బందిని నియమించి, వారు ఆయా జిల్లాల్లో రైతుల వద్దకు వెళ్లి ఒక్కో మొక్క సంరక్షణకు రూ. 4,200 చొప్పున చెల్లిస్తూ పర్యవేక్షణ చేయిస్తున్నట్లు తుమ్మల తెలిపారు. ఆయిల్‌పామ్ రైతుల సంక్షేమం, ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేస్తుందని పేర్కొన్నారు. పామాయిల్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి నుంచి దేశంలోనే ఉత్పత్తిచేస్తే స్థాయికి చేరాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధిస్తే దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా సహకరిస్తే పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించవచ్చునన్నారు. ఆయిల్‌ఫెడ్‌కు 2,58,370 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు బాధ్యతను అప్పగించినట్లు మంత్రి చెప్పారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తు తం రెండు లక్షల ఎకరాల్లో పామాయిల్ దిగుబడులు వస్తున్నాయి. వీటిలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే 90శాతానికి పైగా దిగుబడులు వస్తున్నాయి.



రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

త్వరలో రూ.2 లక్షల పైనున్న రైతులకు మాఫీ షెడ్యూల్ ప్రకటిస్తాం

రుణమాఫీ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదని, కొనసాగుతోందని మంత్రి తుమ్మల అన్నారు. గతఐదేళ్లలో పంట రుణాలు తీసుకున్న రైతులు రాష్ట్రంలో 42 లక్షల మంది ఉన్నారని, వారికి రూ. 31 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, ప్రతి కుటుంబానికి రూ.2లక్షల చొప్పున బకాయిలు తీర్చటమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటివరకు 22 లక్షల మంది రైతులకు రూ. 18 వేల కోట్లు మాఫీ చేశామని, మిగిలిన 20 లక్షల మందికి రూ. 13 వేల కోట్లు మాఫీచేసిన తర్వాతే రుణమాఫీ ప్రక్రియ ముగుస్తుందన్నారు. సచివాలయంలో మంగళవారం తుమ్మల మాట్లాడారు. రూ. 2 లక్షలకు మించి బకాయిలున్న రైతులకు రుణమాఫీ చేసేందుకు మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకొని షెడ్యూలు ప్రకటిస్తామని చెప్పారు. రుణమాఫీ ప్రక్రియ మధ్యలో ఉండగానే బీజేపీ నేతలు నిరసన దీక్షలు చేస్తుండటం సిగ్గుచేటని తుమ్మల ధ్వజమెత్తారు.

వందేళ్లు పూర్తి చేసుకున్న జిమ్మీ కార్టర్



వాషింగ్టన్, అక్టోబరు 1: అమెరికా 39వ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ మంగళవారంతో నిండు నూరేళ్లు పూర్తి చేసుకున్నారు. 101వ పడిలోకి అడుగుపెట్టారు. తద్వారా అమెరికా అధ్యక్షుడిగా పనిచేసినవారిలో వంద సంవత్సరాలు జీవించిన ఏకైక వ్యక్తిగా రికార్డులకెక్కారు. జిమ్మీ కార్టర్ 1924 అక్టోబరు 1న జార్జియాలో జన్మించారు. 1977-81మధ్యలో అమెరికాకు అధ్యక్షుడిగా పనిచేశారు. 2022లో కార్టర్‌కు నోబెల్ బహుమతి వచ్చింది.

మద్యం మత్తులో మరో బైక్‌ను ఢీకొన్న యువకులు

- ముగ్గురి మృతి.. ఒకరి పరిస్థితి విషమం
- మృతుల్లో భార్యాభర్తలు.. ఖమ్మం జిల్లాలో ఘటన

కారేపల్లి, అక్టోబరు 1: మద్యం మత్తులో ద్విచక్ర వాహనాన్ని నడిపిన ఇద్దరు యువకులు ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో భార్యభర్తలతో పాటు ఓ యువకుడు మృతి చెందగా.. మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వద్ద మంగళవారం ఈ ప్రమాదం జరిగింది. కారేపల్లి మండలం గుట్ట కిందగుంపు గ్రామానికి చెందిన ఉండం సూర్యనారాయణ (50), భార్య సుగుణ (45) బైక్‌పై ఇల్లెందు వెళ్లి తిరిగి తమ స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఇల్లెందు సోలార్ ప్లాంట్‌లో ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన నక్క వెంకటేష్ (35) హల్యాతండాకు చెందిన ధారవత్ రాజు మరో బైక్‌పై ఇల్లెందు వైపు వెళుతూ సూర్యనారాయణ బైక్‌ను వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సూర్యనారాయణ, సుగుణతో పాటు వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందారు. ధారవత్ రాజుకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాద సమయంలో వెంకటేష్, దారవత్ రాజు మద్యం మత్తులో ఉన్నారని వారివద్ద బీర్ బాటిళ్లు ఉన్నాయని స్థానికులు తెలిపారు. బైక్ ప్రమాదంలో దంపతులు మృతిచెందడంతో వారి కుమార్తె, కూమారుడు అనాథలయ్యారు. పోలీసులు మృతదేహాలను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సూర్యనారాయణ, సుగుణ, వెంకటేష్ (ఫైల్)

మధ్యాహ్నం నుంచి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనవచ్చు

- అంగన్‌వాడీ టీచర్లకు వెసులుబాటు
- మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు



హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్లు మధ్యాహ్నం 2 గంటల తర్వాత బతుకమ్మ సంబరాల్లో పాల్గొనవచ్చని మహిళా, శిశు సంక్షేమ శాఖ వెసులుబాటు ఇచ్చింది. ఉదయం 9 నుంచి 2 గంటల వరకు టీచర్లు వారికి నిర్దేశించిన విధుల్లో పాల్గొనాలని, ఆ తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల్లోగానీ, ఇతర ప్రాంతాల్లోగానీ బతుకమ్మ ఆడుకోవచ్చని తెలియజేస్తూ అధికారులు మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. బతుకమ్మ సంబరాలు ఈ నెల 2 నుంచి 12 వరకు జరుగుతాయని, ఆ పది రోజులు ఈ వెసులుబాటును వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఫార్మాడీ విద్యార్థినిపై స్నేహితుల అత్యాచారం!

- లాడ్జికి తీసుకెళ్లి బీర్లు తాగించి ఇద్దరు ఘాతుకం
- వరంగల్‌లో ఆలస్యంగా బయటపడిన దారుణం

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 1: బీటెక్ చదువుతున్న ఇద్దరు యువకులు స్నేహం ముసుగులో ఓ ఫార్మాడీ విద్యార్థినిని లాడ్జికి తీసుకెళ్లి బలవంతంగా బీర్లు తాగించి ఆపై అత్యాచారానికి పాల్పడ్డారు. వరంగల్‌లో సెప్టెంబరు 15న జరిగిన ఈ దారుణంపై బాధిత విద్యార్థిని తండ్రి మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటికొచ్చింది. బాధితురాలి తండ్రి, పోలీసుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లికి చెందిన ఓ అమ్మాయి వరంగల్ శివారులోని ఓ కళాశాలలో ఫార్మాడీ చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. భూపాలపల్లికే చెందిన ఇద్దరు అబ్బాయిలు అదే కళాశాలలో బీటెక్ చదువుతూ స్థానికంగా ఓ హాస్టల్‌లో ఉంటున్నారు. ఒకే ఊరి వారు కావడంతో వారు ముగ్గురు స్నేహితులయ్యారు. ఈ క్రమంలో సరదాగా బయటకు వెళ్లివద్దామని చెప్పి ఆ బీటెక్ విద్యార్థులిద్దరూ బాధిత విద్యార్థినిని సెప్టెంబరు 15న కారులో తీసుకెళ్లారు. వరంగల్‌లోని ఓ లాడ్జిలో రెండు గదులు తీసుకొని ఓ గదిని ఆ అమ్మాయికి ఇచ్చా రు. తమ గదిలో బీర్లు తాగిన ఆ యువకులు మద్యం మత్తులో యువతి గదిలోకి వెళ్లి ఆమెతో బలవంతంగా బీర్లు తాగించారు. అనంతరం ఆమె మత్తులో ఉండగా అత్యాచారం చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

పెరిగిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు

న్యూఢిల్లీ, అక్టోబరు 1: దసరా పండుగకు ముందు వ్యాపారులు, వాణిజ్య సంస్థలకు చమురు గ్యాస్ కంపెనీలు భారీ షాక్ ఇచ్చాయి. దేశవ్యాప్తంగా 19 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను సరాసరిన రూ. 48.50 మేర, 5 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను రూ. 12 మేర పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు మంగళవారం నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొన్నాయి. పెరిగిన రేట్లతో దేశ రాజధాని ఢిల్లీలో రూ. 1691.50గా ఉన్న 19 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ. 1740కి చేరింది. 19 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను నెల క్రితమే చమురు కంపెనీలు రూ. 39 మేర పెంచాయి. కాగా, గృహ వినియోగదార గ్యాస్ సిలిండర్లు మాత్రం ప్రస్తుతం పాత ధరల వద్దే కొనసాగుతున్నాయి.

విద్యుదాఘాతంతో రోజుకు ఇద్దరు బలి!

రాష్ట్రంలో ఏడాదికి సగటున 700 మంది మృతి.. కరెంట్ షాక్‌లతో పిట్టల్లా రాలుతున్న జనం

- ఏడేళ్లలో 4420 మంది దుర్మరణం

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుదాఘాతంతో రోజుకు సగటున ఇద్దరు చొప్పున ప్రాణాలు కోల్పోతున్నారు. కరెంట్ షాక్‌తో పిట్టల్లా రాలిపోతున్నారు. గడిచిన ఏడేళ్లలో 4420 మంది మరణించారు. అంటే ఏటా సగటున 700 మంది బలైపోతున్నారు. విద్యుత్తు పంపిణీ వ్యవస్థ కోసం రూ.వేల కోట్లు వెచ్చిస్తున్నా.. ప్రజల ప్రాణాలను పరిరక్షించడానికి డిస్కమ్‌లు తగిన చర్యలు చేపట్టడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్తు వారోత్సవాలు జరిగినప్పుడు పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు నిర్మించడం, వేలాడే వైర్లను తొలగించడం, స్తంభాల మధ్య దూరం తగ్గించే చర్యలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అన్ని రంగాలకు 24 గంటల కరెంట్ ఇస్తున్నారు. అందులోనూ రైతులకు 24గంటల పాటు విద్యుత్తు సరఫరా చేస్తుండగా.. కరెంట్ కాటుకు అత్యధికంగా రైతులే బలవుతుండడం గమనార్హం. ఈ మరణాల లెక్కలన్నీ సాక్షాత్తూ డిస్కంలే తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)కి సమర్పించాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు దాకా దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్) పరిధిలో 86 మంది, ఉత్తర డిస్కమ్(ఎన్పీడీసీఎల్) పరిధిలో 132 మంది చనిపోయారు. మనుషులే కాదు.. మూగ జీవాల మరణాల్లోనూ ఎన్పీడీసీఎల్ ముందుంది. 2018-19లో దక్షిణ డిస్కమ్ పరిధిలో 754 మూగజీవాలు ప్రాణాలు వదిలితే.. ఉత్తర డిస్కమ్ పరిధిలో 1142 జీవాలు చనిపోయాయి. ఏడేళ్లలో మనుషులు 4420 మంది, మూగ జీవాలు 11,180 కలిపి 15,600 ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

పదేళ్లలో రూ.35 వేల కోట్లకు పైగా..

మౌలిక సదుపాయాల కల్పనకు పదేళ్లలో రూ.35 వేల కోట్లు వెచ్చించామని డిస్కమ్‌లు చెబుతున్నాయి. అయితే వినియోగదారుల రక్షణకు ఏ మేరకు ఖర్చు చేశాయనేది లెక్క తేలడం లేదు. ప్రమాదాలు ఏటా తగ్గాల్సి ఉండగా.. ఏయేటికాయేడు పెరుగుతూనే ఉన్నాయి. 2018-19లో రెండు డిస్కమ్‌ల పరిధిలో 714 మంది చనిపోగా, 2019-20లో 754 మంది చనిపోయారు. 2020-21లో 696 మంది, 2021-22లో 733, 2022-23లో 661, 2023-24లో 644, 2024-25లో ఆగస్టు దాకా 218 మంది చనిపోయారు. ప్రజల ప్రాణాలు కాపాడడానికి డిస్కంలు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా రైతులే అధికంగా కరెంట్ షాక్‌లతో మృత్యువాత పడుతున్నారు. విద్యుత్తు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఫ్యూజులు వేసుకోవడానికి వెళ్లి, ప్రాణాలు కోల్పోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ లేకపోవడం, వేలాడే వైర్లను సరిచేయకపోవడం, సకాలంలో ఫిర్యాదులపై స్పందించకపోవడం వంటి శాఖాపరమైన నిర్లక్ష్యం విలువైన ప్రాణాలను బలిగొంటోంది. నిబంధనల ప్రకారం కరెంట్ షాక్‌తో ఎవరైనా చనిపోతే 24 గంటల్లోగా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ)కి క్షేత్రస్థాయి సిబ్బంది సమాచారం అందించాలి. ఆ ప్రక్రియ అమలు కావడం లేదు. ఇక కరెంట్ షాక్‌లకు చనిపోయే వారిలో 95 శాతానికి పైగా పేదలు, దిగువ మధ్యతరగతికి చెందినవారే ఉంటున్నారు.

పరిహారానికి అనేక నిబంధనలు

విద్యుత్తు షాక్‌తో ఎవరైనా చనిపోతే, ఆ రోజు నుంచి రెండు నెలల్లోపు బాధిత కుటుంబానికి పరిహా రం అందించాలి. పరిహారం చెల్లించడంలో జాప్యం జరిగితే 12% వార్షిక వడ్డీని చెల్లించాలని టీజీఈఆర్సీ గతంలో ఆదేశాలు ఇచ్చింది. పరిహారం విషయంలో శాఖాపరమైన నిర్లక్ష్యమే కాకుండా అనేక ని బంధనలు కూడా జాప్యానికి కారణం అవుతున్నాయి. రాష్ట్రంలో విద్యుదాఘాతంతో చనిపోతున్న వారి వివరాలను సేకరించేందుకు యంత్రాంగం ఉన్నా సమాచారం ఇవ్వడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

మరణాలు	పరిహారం
మనిషి చనిపోతే	రూ.5 లక్షలు (తొలుత రూ.50 వేలు, మిగిలిన రూ.4.5 లక్షలు కుటుంబ సభ్యుల పేరిట జమ)
బర్రెలు, ఆవులు చనిపోతే	రూ.40 వేలు
గొర్రెలు, మేకలు చనిపోతే	రూ.7 వేలు

కరెంటు తీగలే మృత్యుపాశమై..

రంగారెడ్డి జిల్లాలో విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి

బొంరాస్‌పేట్/చౌదరిగూడ, అక్టోబరు 1: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మంగళవారం వేర్వేరుచోట్ల ఇద్దరు రైతులు విద్యుదాఘాతంతో మృతిచెందారు. వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట్ మండలం ఎన్కెపల్లి గ్రామానికి చెందిన సంగెం అంజిలయ్య (34) ఉదయం పొలం పనులకు వెళ్లాడు. పొలం దగ్గర తెగిపడి ఉన్న విద్యుత్ తీగను గమనించకపోవడంతో కాలికి తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల పరిధి రేగడి చిల్కమర్రిలో రాచూరి జనార్దన్ రెడ్డి (64) ఉదయమే పొలానికి వెళ్లాడు. వర్షానికి గ్రామశివారులో తెగిపడిన విద్యుత్ తీగ కనిపించకపోవడంతో.. అది కాలికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నిర్ణాయక ఘట్టం

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల చివరిదశ పోలింగ్ మంగళవారం ప్రశాంతంగా పూర్తయింది. మొత్తం తొంభైస్థానాల్లో నలభైస్థానాలు ఈ విడతలో ఉండగా, 24 జమ్మూడివిజన్‌లో, మిగతావి కశ్మీర్‌లోనివి. ఈ నలభై అసెంబ్లీ స్థానాల సగటు పోలింగ్ 69శాతం మేరకు ఉన్నందున, తొలి రెండుదశలతో పోల్చితే భావి పాలకులు ఎవరో నిర్ణయించే ఈ కీలకమైన దశలో ప్రజాభాగస్వామ్యం మరీ బాగున్నట్టు. మొదటి విడత పోలింగ్ ఏడు జిల్లాల్లోని 24 స్థానాల్లో జరిగినప్పుడు 61శాతం వరకూ ఓట్లు పడినప్పటికీ, 2014 కంటే తక్కువే. రెండోదశ పోలింగ్ జరిగిన ప్రాంతాలు ఉగ్రవాద ప్రభావం వల్ల అనాదిగా తక్కువ రికార్డవుతున్నవే. అక్కడ 2014తో పోల్చితే ఈ మారు ఒకటిన్నరశాతం తక్కువ పోలింగ్ జరిగింది. మొత్తంగా మూడుదశల సగటు 63శాతానికి పైగా ఉన్నందున సంతోషించవలసిందే. పోలింగ్‌కు ముందు ఈ మూడుదశల్లోనూ కొన్ని ఉగ్రవాద చర్యలు జరిగినప్పటికీ, పోలింగ్‌ను నేరుగా దెబ్బతీసేందుకు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు నిర్దిష్టమైన ప్రయత్నాలేమీ లేకపోవడం ఊరటనిచ్చే అంశం. అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో ఎన్నికలు సజావుగా పూర్తయ్యేందుకు సమస్త బలగాలూ తమ శక్తి యుక్తులను ధారపోశాయి.

జమ్మూకశ్మీర్ ప్రజానీకం ఈ ఎన్నికల పట్ల ఏ మేరకు ఉత్సాహంగా ఉన్నారు, పదేళ్ళనాటితో పోల్చితే వాతావరణం ఎట్లా ఉంది అన్న విశ్లేషణలు ఇప్పుడు సాగుతున్నాయి. ప్రజాప్రతినిధులకు ఏ అధికారాలూ లేని, చరిత్రలో అత్యంత బలహీనమైన జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి తమవారిని నాయకులుగా పంపేందుకు ప్రజలకు ఈ మూడు దశల పోలింగ్ అవకాశం ఇచ్చింది. ప్రత్యేకప్రతిపత్తిని కోల్పోయి, రాష్ట్రంగా ఉన్నదల్లా రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మారి, దశాబ్దం తరువాత జరుగుతున్న ఈ ఎన్నికల్లో తిరిగి రాష్ట్రహోదా సాధించడమే ప్రచారాంశంగా, ప్రధానాంశంగా, లక్ష్యంగా మిగిలింది. అన్ని పార్టీలూ ఆ మేరకు ప్రజలకు గట్టి హామీ ఇస్తున్నాయి. పీడీపీ, బీజేపీ, నేషనల్ కాన్ఫరెన్స్–కాంగ్రెస్ కూటమి ప్రధానంగా బరిలో ఉండగా కొన్ని చిన్న చితకాపక్షాలతో పాటు, జమాతే ఇస్లామీ కూడా ఈ మారు పరోక్షంగా పోటీపడటం విశేషం. దశాబ్దాలుగా ఎన్నికల బహిష్కరణకు కట్టుబడిన ఈ సంస్థ, ఈమారు లోయలోని కొన్ని కీలకమైన చోట్ల తన వారిని స్వతంత్రులుగా నిలబెట్టింది. ఉగ్రవాదాన్ని పోషిస్తున్న, ప్రోత్సహిస్తున్న ఆరోపణలమీద 2019లో కేంద్రం ఈ సంస్థను 'ఊపా'తో నిషేధించి, మరో మారు గడువును ఇటీవలే పొడిగించింది కూడా. ఆర్టికల్ 370 రద్దు తరువాత, ఈ సంస్థమీద విరుచుకు పడటమే కాక, దాని నాయకులంతా వేర్పాటువాదం ముసుగులో ఆస్తులు పోగేసుకున్నారని ఆరోపిస్తూ కేంద్రం ఆస్తులను సైతం జప్తుచేసింది. ఏడాది కాలంగా ఈ సంస్థ వైఖరిలో మార్పువచ్చిందని, ఎన్నికలను బాయ్‌కాట్ చేయడం కాక, వాటిద్వారా ప్రజలకు చేరువకావాలన్న ఆలోచన ఆ నాయకుల్లో పెరిగిందని అంటారు. ఇది కచ్చితంగా సంతోషించాల్సిన పరిణామం. స్థానిక ప్రధాన పక్షాల ఓట్లను చీల్చేందుకు, ముఖ్యంగా నేషనల్ కాన్ఫరెన్స్–కాంగ్రెస్ కూటమిని అది గెలవగలిగే స్థానాల్లో దెబ్బతీసేందుకు జమాతేను బీజేపీ రంగంలోకి దింపిందన్న ఆరోపణలు సైతం లేకపోలేదు.

ఈ అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో మెరుగ్గా ఉంది. మొత్తం ఐదుస్థానాల్లో జమ్మూలోని రెండింటినీ బీజేపీ గెలుచుకుంది. కశ్మీర్ లోయలోని మిగతా మూడు స్థానాల్లో రెండింటిని నేషనల్ కాన్ఫరెన్స్, ఒకదానిని ఇండిపెండెంట్ గెలుచుకున్నారు. పీడీపీకి ఒక్కటీ రాలేదు. ఆ ప్రాతిపదికన చూస్తే ఎన్‌సీ–కాంగ్రెస్ కూటమికి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో 43 స్థానాలవరకూ రావాలి. మరోపక్క జమ్మూలో బీజేపీ ఎంతో బలంగా ఉన్నమాట వాస్తవం. ప్రత్యేక ప్రతిపత్తి, అనంతర పరిణామాల మీద ప్రజల ప్రతిస్పందన ఏ విధంగా ఉన్నదో ఈ ఎన్నికల్లో తేలుతుంది. గతాన్నీ, గాయాలనూ మరిచిపోయి, పాలకులు హామీ ఇస్తున్న అభివృద్ధినీ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొనేందుకు కొత్తతరం సిద్ధంగా ఉన్నదని కొందరి నమ్మకం. ప్రత్యేక ప్రతిపత్తి రద్దు తరువాత జమ్మూకశ్మీర్ అద్భుతంగా ఎదిగిపోయిందని బీజేపీ పెద్దలు చెబుతున్నారు. ఆయా రంగాల్లో సాధించిన ప్రగతిని విశ్లేషిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయపక్షాలు, అనాదిగా ఏలుతున్న అబ్దుల్లాలు, ముఫ్తీలతో పాటుగా, స్వతంత్రులు, చిన్నాచితకాపార్టీలు ఈ మారు బరిలో నిలిచినందున అక్టోబర్ 8న విడుదలయ్యే ఫలితాలు సైతం ఊహించని రీతిలో ఉండవచ్చును.

> లెబనాన్‌పై దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ నేరుగా ఇజ్రాయిల్‌తో పూర్తిస్థాయి యుద్ధానికి తలపడితే పరిస్థితి అదుపు తప్పుతుంది. అనివార్యంగా భారత్‌తో సహా సమస్త దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర దుష్ప్రభావం పడుతుంది. ఫలస్తీనా–ఇజ్రాయిల్ సమస్య కొనసాగినంత కాలం పశ్చిమాసియాలో ఈ రకమైన ఉద్రిక్తతలు, హింసాకాండ కొనసాగుతూనే ఉంటాయి.

లెబనాన్‌పై దాడులు

ఊహించిందే సంభవించింది. ఇజ్రాయిల్ – ఫలస్తీనా సంక్షోభంలోకి లెబనాన్‌ను వ్యూహాత్మకంగా లాగడం అనివార్యమని పశ్చిమాసియా పరిణామాల పరిశీలకులు చెప్తూ వచ్చారు. ఇప్పుడు లెబనాన్ ఇజ్రాయిల్ దాడితో సరిగ్గా అదే జరిగింది. అరబ్బు దేశాలలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

పశ్చిమాసియాలో ఇజ్రాయిల్ వెళ్ళలేని ప్రదేశం ఏదీ లేదని లెబనాన్‌పై దాడి అనంతరం ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. దక్షిణా లెబనాన్ వైపు తమ సేనలను పంపిస్తూ పొరుగున ఉన్న సిరియాపై సైతం దాడులకు ఇజ్రాయిల్ నాంది పలికింది. తత్ఫలితంగా పశ్చిమాసియాలో రాజకీయ అలజడి, ఆందోళనలు ముమ్మరమయ్యాయి. అమెరికాపై అరబ్‌ల ఒత్తిడి తగ్గించేందుకే పరిమిత స్థాయిలో మాత్రమే లెబనాన్‌పై దాడి చేసినట్టు ఇజ్రాయిల్ వ్యూహాత్మక ప్రకటన చేసింది.

భౌగోళిక సరిహద్దులతో సంబంధం లేకుండా సమస్త అరబ్ దేశాలలో ఫలస్తీనా ఒక సున్నిత సమస్య, ఎంత కాదన్నా అది అనివార్యంగా చుట్టుకొంటుంది, ఇందుకు ఎవరు మినహాయింపు కాదు. ఫలస్తీనా సమస్య ప్రాతిపదికన పశ్చిమాసియా రాజకీయ, దౌత్య, సైనిక సమీకరణలు ఉంటున్నాయి. అమెరికా విరోధి ఇరాన్ ఒక వైపు, అమెరికా సన్నిహిత అరబ్బు దేశాలు మరో వైపు ఉన్నాయి. అమెరికాలో ఇజ్రాయిల్‌కు గట్టి మద్దతుదారుడయిన జో బైడెన్ అధ్యక్షపదవిలో ఉండడంతో గతంలో ఎప్పుడు లేని విధంగా ఇజ్రాయిల్‌కు అమెరికా నుంచి అన్ని రకాలుగా పూర్తి స్థాయి మద్దతు లభిస్తోంది. తత్ఫలితంగానే ఇజ్రాయిల్ దాడులు అంతకంతకూ ఉధృతమవుతున్నాయి.

గల్ఫ్ లేఖ

ఫలస్తీనా అంశం ఆధారంగా లెబనాన్, గాజా ప్రాంతంలోను యమన్‌లోను తిరుగుబాటు దారులను ఇరాన్ వ్యూహాత్మకంగా ప్రోత్సహిస్తోంది. యమన్‌లోని హుతీల ద్వార సౌదీపై దాడులనూ ఇరాన్ ప్రోత్సహిస్తోంది. లెబనాన్‌లో షియా ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. దీంతో ఇరాన్‌కు అక్కడ ప్రాబల్యమున్నది. దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయిల్ దురాక్రమణ అనంతరం ఇరాన్ అండతో షియాలకు చెందిన హిజ్బుల్లా ఒక ప్రత్యేక రాజ్య వ్యవస్థగా పరిణమించింది. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ఒకవైపు సాయుధ పోరాటం చేస్తూనే మరోవైపు లెబనాన్ ప్రభుత్వంలో సంకీర్ణ భాగస్వామిగా ఎదిగింది. మధ్య ప్రాచ్య దేశాలలో ఇరాన్ సృష్టించిన సాయుధ తిరుగుబాటు దళాలలో హిజ్బుల్లా సుశిక్షితమైనది. గల్ఫ్ దేశాలకు, లెబనాన్ మధ్య అగాధం ఏర్పడడానికి హిజ్బుల్లా ఒక ప్రధాన కారణం.



శక్తిమంతమైన ఇజ్రాయిల్‌ను గెరిల్లా యుద్ధ పోరాటం ద్వారా హిజ్బుల్లా ఢీ కొంటోంది. గెరిల్లా యుద్ధం, క్షిపణి దాడులకు మాత్రమే పరిమితమైన హిజ్బుల్లాకు ఇజ్రాయిల్‌తో పూర్తి స్థాయిలో సైనికంగా ఢీకొనే సామర్థ్యం లేదు. మెరుపుదాడులతో ఇజ్రాయిల్‌ను ముప్పు తిప్పలు పెడుతోంది. పూర్తి స్థాయిలో యుద్ధాన్ని అది కోరుకోదు. అయితే హసన్ నస్రల్లా హత్య కారణంగా యుద్ధం అనివార్యమైనా హిజ్బుల్లా సమర రంగానికి నడిపించేది ఎవరనేది ఇప్పుడు అసలైన ప్రశ్న. 2006లో ఇజ్రాయిల్ చివరిసారి లెబనాన్‌ను దురాక్రమించినప్పుడు ఇజ్రాయిల్ సైన్యానికి ఎదురయిన పరిస్థితి ఇప్పుడు లేదు.

ఐక్యరాజ్యసమితి తీర్మానాల మేరకు తాము సరిహద్దును కాపాడుతామని లెబనాన్ ప్రధానమంత్రి తాజాగా ప్రకటించినా క్షేత్రస్థాయిలో అది అంత సులువు కాదు. లెబనాన్, ఇజ్రాయిల్ మధ్య సరిహద్దును 'నీలి రేఖ' అంటారు. ఇది ఐక్యరాజ్యసమితి శాంతి దళాల పరిశీలనలో ఉండగా భారతీయ సైనికులు నిర్వహించిన పాత్ర అత్యంత ప్రశంసనీయమైంది. సైనికపరమైన చర్యలకు కాకుండ శాంతి పునరుద్ధరణ, మానవతాపూర్వక సహాయ కార్యక్రమాలకు మాత్రమే ఇక్కడ ఐక్యరాజ్యసమితి పాత్ర పరిమితం. ఈ సరిహద్దు రేఖ వద్ద ఉన్న భారతీయ దళాలను కేంద్ర రక్షణ సహాయమంత్రిగా ఉన్నప్పుడు యం.యం. పల్లంరాజు సందర్శించారు.

ఇరాన్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా ప్రస్తుత పరిస్థితులలో ఇజ్రాయిల్‌తో నేరుగా యుద్ధం చేయకపోవచ్చని పరిశీలకుల అంచనా. ఒకవేళ ఇరాన్ నేరుగా యుద్ధానికి తలపడితే మాత్రం పరిస్థితి అదుపు తప్పుతుంది. అనివార్యంగా భారత్‌తో సహా సమస్త దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర దుష్ప్రభావం పడుతుంది.

అన్ని అరబ్బు దేశాల కంటే కూడ లెబనాన్‌లో ప్రగతిశీల, ఉదారవాద ప్రభావాలు ఎక్కువ. ప్రజలు మతాన్ని వ్యక్తిగత వ్యవహారంగా భావిస్తారు. ఈ కారణంగానే లెబనాన్ ఒకప్పుడు అరబ్ స్విట్జర్లాండ్‌గా ప్రసిద్ధి చెందింది. ప్రస్తుతం దుబాయి ఏ రకమైన అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా కొనసాగుతుందో ఒకప్పుడు లెబనాన్ రాజధాని బైరూట్ అంతకంటె మెరుగైన రీతిలో పర్యాటక కేంద్రంగా వర్థిల్లింది. చమురు ఆదాయం లేని అలనాటి ఎడారి పేద దేశాలు సముద్ర మత్స్య సంపాదనపై ఆధారపడి జీవిస్తున్న కాలంలో లెబనాన్‌లో నైట్ క్లబులు, డిస్కో క్లబ్బులు, బోటు షికార్లతో లెబనీస్ అరబ్బులు విలాసవంత వినోదభరిత జీవితాన్ని గడిపారు. అరబ్బు ప్రపంచంలో బలీయమైన ఐరోపా ప్రభావం కల్గిన లెబనాన్ జాతీయులు అనేక మంది గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కార్పొరేట్ రూపేణా కీలక పాత్ర వహించారు. చమురు సంపాదనతో వెల్లువలా వచ్చిన అంతర్జాతీయ బహుళజాతి సంస్థలతో పాటు స్థానిక భారీ నిర్మాణ సంస్థలలో లెబనీస్ జాతీయులు అత్యున్నత స్థానాలలో కొనసాగారు. ఆ రకమైన ఘనకీర్తి ఉన్న లెబనాన్ ఫలస్తీనీయులకు ఆశ్రయం ఇవ్వడంతో అతలాకుతలమై దుస్థితికిలోకి జారిపోయింది. ఫలస్తీనా–ఇజ్రాయిల్ సమస్య కొనసాగినంత కాలం పశ్చిమాసియాలో ఈ రకమైన ఉద్రిక్తతలు, హింసాకాండ కొనసాగుతూనే ఉంటాయి.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఆంధ్ర పాండ్యన్ ఈ ప్రవీణ్ ప్రకాశ్!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

మట్టిని పారతో త్రవ్వడం, తట్టల్లో ఎత్తడం అంత సులభం కాదు. పగులగొట్టిన 20 కిలోల బరువున్న రాళ్లను తట్టలో వేసుకుని కొన్ని వందల మీటర్ల దూరం వరకు తీసుకెళ్లి క్రింద పడేయ్యడం ఇంకా ఎంతో కష్టం. కాని నిత్యం అదే పని చేసే శ్రామిక మహిళలు అవలీలగా, శాస్త్రీయంగా ఈ పనులు చేస్తుంటారు. శ్రామిక మహిళల జీవనాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఒక విద్యాధికురాలైన స్త్రీ తాను కూడా ఇదే పని చేసేందుకు ప్రయత్నించి విఫలురాలై వెన్నునొప్పి, ఒళ్లు నొప్పులతో వెనుదిరిగారు. ప్రభుత్వ నిబంధనలు ఈ శ్రామిక స్త్రీలు చేసే పనులను నైపుణ్యం లేనివని కొట్టిపారేసి వారికి చాలీచాలని జీతాలు నిర్ణయిస్తాయని, నిబంధనలు తయారు చేసే వారికి ఈ శ్రమజీవుల జీవితాల గురించి ఏ మాత్రం తెలియదని, ఏనాడూ వారు పనిచేసే ప్రాంతాల వద్దకు వెళ్లిన పాపాన పోలేదని ఆమె వాపోయారు. ఒక రోజంతా కష్టించి భౌతిక శ్రమ చేసి ఎంతో దూరంలో ఉన్న ఇళ్లకు తిరిగి వెళ్లి మర్నాడు ఇదే కష్టానికి సిద్ధమయ్యే శ్రమజీవుల నైపుణ్యం గురించి వారెప్పుడైనా అధ్యయనం చేశారా? అని ఆమె ప్రశ్నించారు. ఆమె ఎవరో కాదు, తమిళనాడులో తన ఐఏఎస్ ఉద్యోగాన్ని వదులుకుని, రాజస్థాన్‌లో శ్రమజీవుల మధ్య తన జీవితాన్ని అంకితం చేసేందుకు వెళ్లిన రామన్ మెగసేసే అవార్డు గ్రహీత అరుణా రాయ్. ఆమె ఆలోచనా విధానం మూలంగానే 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం' రూపుదిద్దుకుంది.

ప్రజలకోసం పనిచేసే ఇలాంటి సివిల్ సర్వీస్ అధికారులు మనకు అరుదుగా తటస్థిస్తారు. బిఎస్ యుగంధర్, ఎస్ఆర్ శంకరన్, బిడి శర్మ, కెబి సక్సేనా, కెఆర్ వేణుగోపాల్ ఎందరో అధికారులు ప్రజలకు అనుకూలమైన పథకాలను రూపొందించి అమలు చేయడంలో విజయవంతమయ్యారు. ప్రభుత్వ అక్రమ ఆదేశాలను అమలు చేయబోమని ప్రతిఘటించి బదిలీలకు గురైన అధికారులు ఎందరో ఉన్నారు. రాజస్థాన్‌లోని చిత్తోర్‌ఘడ్‌లో ఒక ఎమ్మెల్యే వచ్చినప్పుడు లేచి నిలబడని క్లర్కును తొలగించమని వచ్చిన ఆదేశాలను పాటించనందుకు డా. సమిత్ శర్మ అనే కలెక్టర్ తానే బదిలీ కావల్సి వచ్చింది. అందుకు నిరసనగా 12వేల మంది సామూహికంగా సెలవుపై వెళ్లినా ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఐఏఎస్ అధికారులకు ఇలాంటి వారు ఆదర్శంగా ఉంటే, ఐఏఎస్ అధికారులు ఆదర్శంగా తీసుకోకూడని అధికారులు కూడా ఎందరో ఉంటారు. వారిలో రెండు రోజుల క్రితం స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ప్రవీణ్ ప్రకాశ్ ఒకరు. ఆయన పదవీవిరమణ చేశారంటే ఢిల్లీలో కూడా కొందరు అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకుంటున్నారు. దీన్ని బట్టి తన సర్వీస్‌లో ఆయన ఎంత వ్యతిరేకత మూటకట్టుకున్నారో అర్థమవుతుంది. తన అధికారం కోసం ఎవరినైనా బలి చేయడానికి ఉపేక్షించని అధికారి ప్రవీణ్ ప్రకాశ్. ఉత్తర భారతావనికి చెందిన ప్రవీణ్ ప్రకాశ్ ఒడిషాలో పాండ్యన్ మాదిరి ఆంధ్రప్రదేశ్‌లో తిరుగులేని అధికారం చలాయించారు.

నిజానికి ఏపీ భవన్‌లో రెసిడెంట్ కమిషనర్‌గా ఉన్నప్పుడే ప్రవీణ్ ప్రకాశ్‌పై టీటీడీ నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఆరోపణలు ఉన్నాయి. ఢిల్లీలో టీటీడీ ఎల్ఏసి చైర్మన్‌గా ఈ దుర్వినియోగం చేసిన ఆరోపణలపై నాడు చీఫ్ సెక్రటరీగా ఉన్న ఎల్వీ సుబ్రహ్మణ్యం విచారణకు ఆదేశించారు. అప్పుడు మెడిటెక్ జోన్‌కు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూనం మాలకొండయ్యకూ, జీఏడీని నిర్వహిస్తున్న ప్రవీణ్ ప్రకాశ్‌కూ మధ్య కుదిరిన ఒప్పందం మూలంగా ఇరువురూ ఒకరి నొకరు రక్షించుకున్నారని ఐఏఎస్ అధికారులే చెప్పారు.

2019లో తెలుగుదేశం, బీజేపీకి మధ్య దూరం పెరగడానికి కారకుల్లో ప్రవీణ్ ప్రకాశ్ కూడా ఒకరు. తెలుగుదేశం ఓడిపోయిన వెంటనే జగన్ శిబిరంలో చేరారు. అందుకు ఆయనకు వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి పూర్తి సహాయం చేశారు. 'నీవు టీడీపీ మనిషివి కదా అని జగన్ అంటే, నేను మీ అభిమానిని సార్. కావాలంటే విజయసాయిని అడగండి' అని చెప్పిన ప్రవీణ్ ప్రకాశ్ జగన్‌కు అత్యంత సన్నిహితుడు అయ్యారు. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా అత్యంత బలోపేతమైన జీఏడీని హస్తగతం చేసుకుని ఎల్వీ సుబ్రహ్మణ్యం, పి.వి.రమేశ్ లాంటి వారి అధికారాలను నీరుకార్చారు. చీఫ్ సెక్రటరీకి తెలియకుండా అధికారాలను చలాయించి, అదేమిటని ప్రశ్నించినందుకు చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యంనే శంకరగిరి మాన్యాలను పట్టిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆయన తర్వాత ఢిల్లీ నుంచి నీలం సహానీని రప్పించి చీఫ్ సెక్రటరీ చేయించిన ప్రవీణ్ ప్రకాశ్ ఆమెకు కూడా తెలియకుండా వందలాది జీవోలు జారీ చేశారు. నీలం సహానీకి తెలియకుండానే ఆమె సంతకంతో జీవోలు తయారయ్యేవి! రాత్రి మూడు గంటలకు కూడా జీవోలు విడుదలైన సందర్భాలున్నాయి. ఆ రకంగా ఫైల్ సిస్టమ్‌లో సీఎస్‌ను జీరో చేసిన ఘనత ప్రవీణ్ ప్రకాశ్‌కు దక్కింది. చివరకు ముఖ్యమంత్రికి వచ్చే ఫైళ్లు కూడా తన వద్దకే తెప్పించుకుని నిర్ణయాలు తీసుకునే అధికారం సంపాదించుకున్నారు. ముఖ్యమంత్రి అనుమతి అవసరం లేదు.. అని తానే కొట్టిపారేయడమే కాక, తానే ఎలా చేయాలో మంత్రిత్వ శాఖ కార్యదర్శులను నిర్దేశించే వారు. కొందరు అధికారులు ముఖ్యమంత్రికి ఈ విషయం గురించి చెప్పినా ఆయన పట్టించుకునేవారు కాదు. దీనితో అర్ధరాత్రి కూడా అధికారులకు ఫోన్లు చేసి వేధించడం, రాత్రి పొద్దుపోయే వరకు సమావేశాలు నిర్వహించడం చేసేవారు.

నీలం సహానీ తర్వాత ఆదిత్యనాథ్ దాస్ చీఫ్ సెక్రటరీ అయ్యారు. ఇండియా సిమెంట్స్ కేసులో తనతో పాటు ఆరోపణలు ఎదుర్కొన్నందుకు జగన్ ఆయనకు ఈ అవకాశాన్ని కల్పించారు. అయితే ఆదిత్యనాథ్ దాస్ పదవీ విరమణ చేసిన తర్వాత ఆయన పదవీ కాలాన్ని మూడు నెలలు పొడిగిస్తూ ముఖ్యమంత్రి చేసిన ఉత్తర్వులను కూడా ఢిల్లీ పంపకుండా ప్రవీణ్ ప్రకాశ్ దాదాపు 15 రోజులు తన దగ్గర పెట్టుకున్నారని సమాచారం. దీనితో ఆదిత్యనాథ్ ఆ ఫైలు ఢిల్లీకి పంపవలసిందిగా ప్రవీణ్ ప్రకాశ్‌ను కాళ్లా వేళ్లా బతిమిలాడాల్సి వచ్చింది.

ఏపీలో సివిల్ సర్వీస్ అధికారులకు వాట్సాప్ గ్రూప్ ఒకటున్నది. అందులో జూనియర్లు, సీనియర్లు కలిపి దాదాపు 360 మంది దాకా ఉంటారు. 'ఏపీలో సివిల్ సర్వీస్ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోంది.. ఇది సరైంది కాదని ఎల్వీ సుబ్రహ్మణ్యం ఒక రోజు వ్యాఖ్యానించారట. 'మీరు రిటైర్ అయ్యారు మీకెందుకు ఇవన్నీ ఇంట్లో కూర్చోకుండా' అని ప్రవీణ్ ఈ గ్రూప్‌లో స్పందించడంతో చాలా మంది సీనియర్ అధికారులు దిగ్భ్రాంతి చెందారు. ఒక 1983 బ్యాచ్ అధికారితో 1994 బ్యాచ్ అధికారి వ్యవహరించే తీరు ఇదేనా అని చాలా మంది బాధపడ్డారు. ప్రవీణ్ అంతటితో ఊరుకోకుండా ఆదిత్యానాథ్ దాస్‌తో కూడా ఎల్వీకి వ్యతిరేకంగా ఈ గ్రూప్‌లో కామెంట్లు పెట్టించారట. దీనితో మనసు గాయపడ్డ ఎల్వీ వాట్సాప్ గ్రూపు నుంచే తప్పుకున్నారు. తన ఫైలు ఢిల్లీకి పంపించాలంటే ఎల్వీపై కామెంట్ చేయాలని ప్రవీణ్ ప్రకాశ్ ఒత్తిడి చేశారని ఆదిత్యనాథ్ దాస్ తన తోటి అధికారులకు చెప్పి బాధపడ్డారని సమాచారం.



> ఒడిషాలో ఏకబిగిన 24 సంవత్సరాలు పాలించిన నవీన్ పట్నాయక్ అధికారం కోల్పోవడానికి పాండ్యన్ కారకుడు. ఉత్తర భారతావనికి చెందిన ప్రవీణ్ ప్రకాశ్ ఒడిషాలో పాండ్యన్ మాదిరి ఆంధ్రప్రదేశ్‌లో తిరుగులేని అధికారం చలాయించారు. ఏపీలో జగన్ అయిదు సంవత్సరాల్లోనే గద్దెదిగేందుకు కేవలం ప్రవీణ్ ప్రకాశ్ లాంటి వారిని మాత్రమే తప్పుపట్టక్కర్లేదు. స్వయంగా వివేక భ్రష్టులైన వారికి ఇలాంటి అధికారులు మరింత తోడ్పాటునందిస్తారు!

ఎట్టకేలకు ఆదిత్యనాథ్ దాస్ సర్వీసు పొడిగింపునకు అనుమతి లేఖ ఆయన పదవి ముగిసే చివరి రోజు లభించింది.

ఆదిత్యనాథ్ దాస్ తర్వాత ప్రవీణ్ ప్రకాశ్ చీఫ్ సెక్రటరీగా సమీర్ శర్మను రప్పించారు. నిజానికి ప్రవీణ్ ప్రకాశ్ ఢిల్లీలో ఉన్నప్పుడు సమీర్ శర్మను సెక్రటరీగా ఎంపానెల్మెంట్ కాకుండా అడ్డుపడ్డారు. కాని తర్వాత ఆయననే చీఫ్ సెక్రటరీగా తెచ్చుకున్నారు. ఆయన పదవీకాలం త్వరలోనే ముగుస్తుండడం, స్థానికుడైతే తన పట్టులో ఉండడని భావించడం ఇందుకు కారణం. సమీర్ శర్మను కూడా నీలం సహానీ మాదిరి డమ్మీ చేసినా కాదనేవారు లేకపోయారు.

ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్నా ప్రవీణ్ ప్రకాశ్ తరుచూ ఢిల్లీ వచ్చేవారు. తరచు వారాంతాలూ ఇక్కడే గడిపేవారు. ఢిల్లీ వచ్చేందుకు వీలుగా ఆయన తనకు తానే స్పెషల్ కమిషనర్ ఏపీ భవన్‌గా కూడా నియమించుకుని బిజినెస్ క్లాస్‌లో ప్రయాణం చేసేవారు. ఢిల్లీలో ఏమి చేసేవారో ఎక్కడికి వెళ్లేవారో అన్న విషయాలపై ఊహాగానాలు ఎన్నో చెలరేగేవి. చాలాసార్లు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి క్వార్టర్‌లోనే ప్రవీణ్ ప్రకాశ్ బసచేసేవారు.

విచిత్రమేమంటే జగన్ శిబిరంలో చేరేందుకు తనకు సహాయ పడ్డ విజయసాయిరెడ్డినే ఆయన ధిక్కరించారని ఒక అధికారి చెప్పారు. విజయసాయిరెడ్డి కోరిన ఒక బదిలీ చేసేందుకు ప్రవీణ్ ప్రకాశ్ నిరాకరించారు. దీనితో వారి మధ్య వాగ్వివాదం పెరిగింది. ఈ విషయం తెలిసి జగన్ వారిద్దరినీ తన వద్దకు పిలిపించారు. 'నేను మీ సెక్రటరీని. నన్ను తిట్టారంటే మిమ్మల్ని తిట్టినట్లే కదా..' అని ప్రవీణ్ ప్రకాశ్ జగన్‌కు చెప్పారు. దీనితో ప్రవీణ్ ప్రకాశ్‌కు క్షమాపణ చెప్పాల్సిందిగా విజయసాయిరెడ్డిని జగన్ ఆదేశించారు. చేసేదేమిలేక విజయసాయిరెడ్డి ప్రవీణ్ ప్రకాశ్‌కు క్షమాపణ చెప్పాల్సి వచ్చింది.

జగన్‌ను పూర్తిగా వశపరుచుకోవడంలో విజయవంతమైన ప్రవీణ్ ప్రకాశ్ సీఎం పేషీలో ఉన్న ఇతర అధికారులకు కూడా కొరకరాని కొయ్యలా మారారు. ఈయనను ఎలా పంపించాలా అని ప్రతి ఒక్కరూ అనుకునేవారు. 'మీరు ఫిల్మ్ స్టార్‌లా ఉన్నారు. మీ ముందు అమితాబ్ బచ్చన్ లాంటి వారు కూడా ఎందుకు సరిపోతారు' అంటూ ప్రవీణ్ ప్రకాశ్ చేసే పొగడ్తలకు జగన్ ఆనందాతిరేకంతో ఉప్పొంగిపోయేవారట! ప్రవీణ్ ప్రకాశ్ తీసుకున్న నిర్ణయాలు న్యాయస్థానంలో ప్రశ్నార్థకమైనా జగన్ గ్రహించలేక న్యాయవ్యవస్థనే తప్పుపట్టేవారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ఆయన తీసుకున్న నిర్ణయాలపై ఉపాధ్యాయులు తీవ్ర నిరసన తెలుపడంతో కొందరు అధికారులు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. మనం మళ్లీ గెలవాలంటే ఇలాంటి వారిని తప్పించాలి అని ఒక నాయకుడు చెప్పారు. 'సీఎం సార్.. వీరి మాటలు వినకండి.. మీరు ఇప్పటికే ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించారు. మీరు గెలిచేసినట్లే.. అనుకోండి' అని ప్రవీణ్ ప్రకాశ్ చెప్పడంతో జగన్ ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఒడిషాలో ఏకబిగిన 24 సంవత్సరాలు పాలించిన నవీన్ పట్నాయక్ అధికారం కోల్పోవడానికి పాండ్యన్ కారకుడైతే, ఏపీలో జగన్ అయిదు సంవత్సరాల్లోనే గద్దె దిగేందుకు కేవలం ప్రవీణ్ ప్రకాశ్ లాంటి వారిని మాత్రమే తప్పుపట్టక్కర్లేదు. స్వయంగా వివేక భ్రష్టులైన వారికి ఇలాంటి అధికారులు మరింత తోడ్పాటునందిస్తారు!

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

రాష్ట్ర విద్యావ్యవస్థకు జీవం ఎన్‌ఈపీ!

ఇటీవలి కాలంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రెండు కార్యక్రమాలు అచేతన స్థితిలో ఉన్న తెలంగాణ విద్యావ్యవస్థకు అవసరమైన జీవం పోసేందుకు దోహదపడతాయి. సకల జనులతో పాటు ప్రధానంగా యూనివర్సిటీల వేదికగా విద్యార్థులు జరిపిన ఉద్యమాల కారణంగా అధికారంలోకి వచ్చిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం దురదృష్టవశాత్తూ విద్యావ్యవస్థను అభివృద్ధి చేసే దిశగా చేసిందేమీ లేదు. పైగా వారి చర్యలు విద్యారంగాన్ని మరింత అధోగతిపాలు చేశాయి. ఈ తరుణంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం, బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ కన్సార్టియం) సూచించిన కోర్సులను ప్రవేశపెట్టడం ఒక ముందడుగుగా కనిపిస్తోంది.

భవిష్యత్‌లో ఉద్యోగాలకు సన్నద్ధంగా ఉండే విధంగా యువతను తీర్చిదిద్దడమే స్కిల్ యూనివర్సిటీ లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేస్తూ వస్తోంది. ఇంకా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 164 ఐటీఐలను సమన్వయం చేస్తూ, వాటిని అప్‌గ్రేడ్ చేసి నైపుణ్య కోర్సులు అందించే బాధ్యతను సైతం స్కిల్ యూనివర్సిటీ తీసుకుంటుంది. ఇది గ్రామీణ నేపథ్యం నుండి వచ్చిన విద్యార్థులకు సాధికారత కల్పిస్తుంది. దీనికితోడు బీఎఫ్ఎస్ఐ సహకారంతో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన కోర్సును ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ప్రవేశపెట్టారు. అన్ని విభాగాలు, సబ్జెక్టులకు చెందిన యూజీ విద్యార్థులందరికీ ఈ కోర్సును అందించనున్నారు. మూడు లేదా నాలుగు సంవత్సరాల తర్వాత కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు తమ సబ్జెక్టుతో పాటు అదనపు నైపుణ్యాన్ని సొంతం చేసుకుంటారు. అందువల్ల ఈ కోర్సు ఉపాధి అవకాశాలను పెంపొందిస్తుంది.

ఈ కోర్సు ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యర్థులపై సున్నితమైన విమర్శలు చేస్తూనే రాష్ట్రంలో విద్యావ్యవస్థను అభివృద్ధి చేసి, విద్యార్థులకు మేలు చేయాలన్న తలంపును వ్యక్తపర్చారు. విజ్ఞాన తృష్ణతో పాటు ఉద్యోగాలకు అవసరమయ్యే నైపుణ్యాలను పొందడానికి విద్యార్థులకు అవకాశం ఉండాలనేది ఈ రెండు కార్యక్రమాల ఉద్దేశ్యమని స్పష్టమవుతోంది.

నిజంగా విద్యార్థులకు మేలు చేయాలన్నదే ప్రభుత్వం ఉద్దేశ్యమైతే రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం–2020ను (ఎన్‌ఈపీ-2020) ఆచరణలో పెడితే రాష్ట్ర ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలు సాధించేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. ఎందుకంటే ఈ విధానం విద్యార్థులు ఉద్యోగాలు, ఉపాధి పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను అందించడంతో పాటు.. ఎంచుకున్న సబ్జెక్టులో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తుంది.

కేవలం 10,000 మంది విద్యార్థులకు మాత్రమే బీఎఫ్ఎస్ఐ కోర్సు పరిమితం, కానీ ఎన్‌ఈపీ రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తుంది. ఎన్‌ఈపీలోని నాలుగు కీలక అంశాలు తెలంగాణ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఉన్నాయి: 1) యూజీ, పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు బహుళ ఆప్షన్లు 2) మల్టిపుల్ ఎంట్రీ అండ్ ఎగ్జిట్ ఆప్షన్లు 3) పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు విద్యను ఒకేషనల్ చేయడం 4) ఒకేసారి రెండు డిగ్రీలు చదివే అవకాశం.

> నిజంగా విద్యార్థులకు మేలు చేయాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమైతే రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం–2020ను (ఎన్‌ఈపీ–2020) ఆచరణలో పెడితే రాష్ట్ర ప్రభుత్వం అనుకున్న లక్ష్యాలు సాధించేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. ఎందుకంటే ఈ విధానం విద్యార్థులు ఉద్యోగాలు, ఉపాధి పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను అందించడంతో పాటు... ఎంచుకున్న సబ్జెక్టులో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తుంది.



ఎన్‌ఈపీ-2020 డిగ్రీ, పీజీ విద్యార్థులు తమకిష్టమైన సబ్జెక్టులను తీసుకునే అవకాశం ఇస్తుంది. ఆర్ట్స్, సైన్సు, వొకేషనల్ విద్య మధ్య హద్దులను చెరిపేస్తుంది. దీంతో విద్యార్థులు తమ అభిరుచులు, కెరీర్ లక్ష్యాలకు అనుగుణంగా వేరువేరు సబ్జెక్టులను ఎంచుకోవచ్చు. ఉదాహరణకు సైన్స్, చరిత్ర రెండింటిపై ఆసక్తి ఉన్న విద్యార్థి ఇప్పుడు ఒకే స్ట్రీమ్‌కు పరిమితం కాకుండా రెండు సబ్జెక్టులను చదువుకోవచ్చు. ప్రస్తుత ప్రొటోకాల్ ప్రకారం బీఎస్సీ (బీజెడ్సీ) చదువుతున్న విద్యార్థికి మూడేళ్లు లేదా కోర్సు పూర్తయ్యే వరకు ఈ వెసులుబాటు లేదు. ఎన్‌ఈపీలో అయితే జంతుశాస్త్రం సబ్జెక్టు స్థానంలో చరిత్రను ఎంచుకోవచ్చు. మూడు సెమిస్టర్లకు చరిత్ర, మరో మూడు సెమిస్టర్లకు డిజిటల్ హ్యుమానిటీస్ ఎంచుకోవచ్చు. అంతేకాకుండా, ల్యాబ్ టెక్నీషియన్ వంటి కోర్సులతో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చు. ఈ ప్రక్రియలో స్కిల్ యూనివర్సిటీ అందించే కోర్సును కూడా ఒక సబ్జెక్టుగా ఎంచుకోవచ్చు.

విద్యార్థి లైఫ్ సైన్సెస్‌లో కోర్సు చేస్తూనే, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే నైపుణ్యాలను సంపాదించడం అంతిమంగా అతనికి ప్రయోజనకరం. ఇది సజావుగా జరగాలంటే, ఉన్నత విద్యాసంస్థల అడ్మిషన్ ప్రొటోకాల్స్ సరళంగా ఉండాలి. ఇది ఎన్‌ఈపీలోని నేషనల్ క్రెడిట్ ఫ్రేంవర్క్ (ఎన్సీఆర్ఎఫ్) సాధ్యం చేస్తుంది.

ఎన్‌ఈపీ-2020లో ఎన్సీఆర్ఎఫ్ ముఖ్యమైన భాగం. పాఠశాల, ఉన్నత విద్య, వృత్తి విద్య నైపుణ్య శిక్షణతో సహా అన్ని స్థాయిలలో అకడమిక్ క్రెడిట్లను సంపాదించడానికి, బదిలీ చేయడానికి సరళమైన, సమగ్రమైన వ్యవస్థను అందించడం ఎన్సీఆర్ఎఫ్ లక్ష్యం. ఇది వ్యవస్థలో సరళతను తీసుకొస్తుంది. విద్యార్థులు వివిధ కార్యకలాపాల నుండి క్రెడిట్లను సంపాదించవచ్చు. వారికి సమగ్ర విద్యను ప్రోత్సహించవచ్చు. అకడమిక్స్, వృత్తి నైపుణ్యాలు, క్రీడలు, కళలు, సమాజ సేవ, ఇంటర్న్‌షిప్ నుండి క్రెడిట్లను సంపాదించవచ్చు. ఉదాహరణకు ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి 18 క్రెడిట్ల జర్నలిజం కోర్సు కొనసాగించవచ్చు. విద్యార్థులు ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా ఆచరణాత్మక నైపుణ్యాలు, విజ్ఞానాన్ని పొందేలా ఎన్సీఆర్ఎఫ్ చేస్తుంది. ఇది విద్య, ఉపాధి మధ్య అంతరాన్ని తగ్గిస్తుంది.

ఎన్‌ఈపీ 2020 అన్ని స్థాయిల్లో విద్యను ఒకేషనల్ చేయడంపై దృష్టి సారిస్తుంది. ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థుల్లో కనీసం 50 శాతం మందికి ఏదో ఒక నైపుణ్యం ఉండేలా 6వ తరగతి నుంచే నైపుణ్య విద్యను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించింది. ఇంకా, ఎన్‌ఈపీలో మల్టీ ఎంట్రీ, ఎగ్జిట్ ఆప్షన్లు ఉంటాయి. ఇది విద్యార్థి ఒక కోర్సులో ఎన్నిసార్లయినా ప్రవేశించవచ్చు, నిష్క్రమించవచ్చు. తద్వారా కోర్సు మధ్యలో విద్యార్థి ప్రత్యక్ష అనుభవం సంపాదించవచ్చు లేదా సంగీతం, కళలు, క్రీడల్లో తమ నైపుణ్యాన్ని పెంచుకోవచ్చు. మధ్యలో వదిలిపెట్టిన కోర్సును ఎప్పుడైనా తిరిగి వచ్చి పూర్తిచేయవచ్చు.

ఇప్పుడు ఎన్‌ఈపీలో భాగంగా ఒకేసారి రెండు డిగ్రీలు చేసేందుకు యూజీసీ అనుమతిస్తుంది. తద్వారా విద్యార్థి ఉన్నత విద్యలో విజ్ఞానాన్ని సముపార్జించవచ్చు, మరోవైపు ప్రతిపాదిత స్కిల్ యూనివర్సిటీ ద్వారా నైపుణ్యాధారిత డిగ్రీల్లో చేరవచ్చు. అంటే విజ్ఞానం పెంపొందించడానికి ఒక డిగ్రీ, నైపుణ్యం కోసం మరో డిగ్రీ ఒకేసారి చేయవచ్చు. ఇది మల్టీ డిసిప్లినరీ అప్రోచ్‌ను ప్రోత్సహించే సమగ్ర విద్యకు దారితీస్తుంది. విద్యారంగాన్ని నైపుణ్య ఆధారిత విద్యతో మిళితం చేస్తుంది.

కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలో విద్య ఉంది. ఎన్‌ఈపీపై కొన్ని రాష్ట్రాలు చేస్తున్న పస లేని విమర్శలు పట్టించుకోదగినవి కావు. తెలంగాణ తనకు మొదటి ప్రాధాన్యత అని రేవంత్‌రెడ్డి అనేకసార్లు చెప్పారు. తెలంగాణ విద్యార్థులను నైపుణ్యాలు, విజ్ఞానంతో శక్తిమంతం చేయాలనే తన లక్ష్యం చేరుకోవాలంటే అందుకు ఎన్‌ఈపీ ఎంతో ఉపయోగపడుతుంది. మన విద్యార్థులను రేపటి ఉద్యోగాలకు సన్నద్ధంగా ఉండేలా తీర్చిదిద్దాలనే రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు లక్ష్యాలను చేరుకోవాలంటే రాష్ట్రంలో ఎన్‌ఈపీ ఆచరణలో పెట్టాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.

■ డా. వై.ఎల్. శ్రీనివాస్
ప్రొ వైస్ ఛాన్సలర్, అరోరా విశ్వవిద్యాలయం



సత్యాగ్రహ శిఖరం

ఓ కరమ్ చంద్..
కర్త కర్మ క్రియలన్నీ నువ్వై
ప్రబోధించిన పాఠాలు పల్లవించట్లేదిక్కడ
గ్రామాభ్యుదయమే దేశాభ్యుదయమన్న స్వాప్నికుడా..
పల్లెలన్నీ వల్లకాళ్లుగా మారుతున్నాయ్
పాల పాకెట్లు నీళ్ల సీసాలు పట్నం నుంచే
చేనేతన్న చావును నేసుకుంటున్నాడు
భగ్గునమండే కుమ్మరి కొలిమి
గిర్రున తిరిగే కమ్మరి చక్రం నీరుగారాయి
ఇచ్చిపుచ్చుకోవటాలు పుచ్చుపట్టి పోయాయి
నీ కలల గ్రామస్వరాజ్యం కన్నీరుపెడుతోంది
నిండు చందురుడిలాంటి కరమ్ చంద్..
నువ్విప్పుడుంటే కన్నీటి సంద్రమయ్యేవాడివి

ఓ మహాత్మా..
మద్యం ఏరులై పారుతోంది
మనిషి మత్తులో జోగుతున్నాడు
నిరుపేదల బ్రతుకులు ఛిద్రమవుతున్నయి
రాజకీయాలు రంగులు మారుతున్నాయి
పాశ్చాత్యుల్ని చూసి వాతపెట్టుకుంటున్నారు
వాయిదాల్లో విలాసాలు కొంటున్నారు
రక్షకులు భక్షకులవుతున్నారు
గల్లీ గల్లీలో ఘోరాలు నేరాలు
పోటీ పరీక్షల్లో కలుపు మొక్కలు పెరిగి
తరుచూ రద్దవుతున్నాయి
యువత నిరుత్సాహంలో మునిగిపోయింది
మహాత్మా మన్నించు ఇది నీ రాజ్యమే..

ఓ బాపూ..
బోసి నవ్వుల బాపూ.. వెలుగు పువ్వుల చూపూ
నీ అడుగడుగూ ఓ నిధి
నీ మాటల మూటలు ఓ పెన్నిధి
నువ్వు ద్వేషించిన హింస
నువ్వు ప్రేమించిన అహింస
అన్నీ ఆదర్శనీయం ఆచరణీయం
నీ ఆకాంక్షల వాదం అస్పృశ్యతా నినాదం
నీ సేవా నిరతి.. నీ నూలు పోగుల హారతి
మాకిచ్చిన ఆత్మీయ బంధువు.. జాతి సింధువు
నీ చరఖా చక్రం స్వావలంబన చిహ్నం
నీ దండియాత్ర పరతంత్రంపై దండయాత్ర
మహిమాన్విత రూపూ మళ్లీ జన్మించు బాపూ..
నువ్వే మా హృదయ సత్యాగ్రహ శిఖరం..!

— కటుకోఝ్వల రమేష్





హనుమకొండ చౌరస్తాలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

బంగారు బతుకమ్మ ఉయ్యాలో

నేటినుంచి పూల పండుగ

- 'ఎంగిలిపూల'తో వేడుకలు ఆరంభం
- వేయిస్తంభాల ఆలయంలో పాటల పోటీలు





హనుమకొండ కల్చరల్, అక్టోబరు 1 : బతుకమ్మ .. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ యావత్ తెలంగాణ మహిళలు గొంతెత్తి పాడే.. పదం పదం కలిపి ఆడే తొమ్మిది రోజుల సంరంభానికి వేళయింది. చిన్నా, పెద్ద లేకుండా మహిళలు ఎంతో ఉత్సాహంతో జరుపుకొనే బతుకమ్మ సంబరాలు ఆశ్వయుజ శుద్ధ అమావాస్య బుధవారం నుంచి 'ఎంగిలిపూల' వేడుకతో ప్రారంభంకానున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పల్లెల్లో, పట్నాలలో ప్రతీ చోట పూల పరిమళాలు గుబాళించనున్నాయి. మహిళలంతా జట్లుగా అందంగా పేర్చిన పూల బతుకమ్మలతో ఒక చోట చేరి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను వల్లెవేసుకుంటూ ఆడిపాడుకునే ఆట విడుపు పర్వం బతుకమ్మకే చెల్లింది. జిల్లా వ్యాప్తంగా తొలినాటి బతుకమ్మలకు ఆయా ప్రాంత పరిసరాల్లోని ఆలయాలే వేదికగా నిలువనున్నాయి. హనుమకొండలోని మెజారిటీ మహిళలకు ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయ ప్రాంగణం తొలినాటి బతుకమ్మ వేడుకలకు వేదికగా నిలువనుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి తరలివచ్చిన తంగేడు, గునుగుపూలతో నగరమంతా తంగేడు శోభతో బతుకమ్మ పర్వాన్ని యాది చేసింది. ప్రధానంగా తంగేడు పూలతో బతుకమ్మలను సిబ్బిలపై ఇతర రకరకాల పూలతో అందంగా పేర్చడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో పూలకు గిరాకీ పెరిగింది. పూల అంగళ్ల వద్ద మంగళవారం సాయంత్రం మహిళల సందడి కనిపించింది.

ఇంతకీ బతుకమ్మ ఎవరు?

కాకతీయులు ఆరాధ్య దేవత కాకతమ్మ. కాకతమ్మను తీరొక్క పూలతో మహిళలంతా పూజింపగా ఆ దేవత పూలతో నిండిపోయింది. అదే ఆచారం ఈనాటికి పూలతోనే బతుకమ్మను పేర్చి.. బతుకమ్మ బతుకనివ్వమ్మా.. అంటూ ఆరాధించడం ప్రారంభమైంది. బతుకమ్మ పర్వానికి మొదలు తొమ్మిది రోజులు కన్నెలు ఆడుకొనే బొడ్డెమ్మను నిమజ్జనం చేసిన క్రమంలో బతుకమ్మ ఆటలకు శ్రీకారం చుట్టనున్నారు. మొదటి రోజు ఎంగిలి పడని పూలతో బతుకునిచ్చే బతుకమ్మ, రెండోరోజు ఆయుష్షునిచ్చే బతుకమ్మ, మూడో రోజు ఆరోగ్య ప్రధాయినిగా బతుకమ్మ ఇలా తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ పర్వంతో వేడుకలను ఆసాంతం చేస్తూ మళ్లీ వచ్చే ఏడుకు స్వాగతం పలకడం ఈ పర్వానికి ప్రత్యేకం.

నేడు పాటల పోటీలు

తొలినాటి బతుకమ్మ వేడుకలకు ప్రదాన వేదికగా నిలిచి వేలాది మంది మహిళలతో కిటకిటలాడే వేయిస్తంభాల ఆలయంలో ఈసారి బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. అంతరించిపోతున్న బతుకమ్మ పాటల సంస్కృతి తెరమరుగు కాకుండా, ముఖ్యంగా ఈనాటి యువతులు పాటల పట్ల ఆసక్తిని పెంచుకునేందుకు వీలుగా పాటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేస్తామని ఆయన చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులను ఈ వేడుకలకు ఆహ్వానించినట్లు చెప్పారు.



విద్యాసంస్థలకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇళ్లబాట పట్టారు. దీంతో మంగళవారం సాయంత్రం హనుమకొండ బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా కనిపించింది.

ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు సేకరించాలి

- ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి..
- వీసీలో కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు



మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు,



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబర్ 1: ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు పక్కాగా సేకరించాలని ఆయా జిల్లా కలెక్టర్‌లను రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, రెండు పడకల గదులు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్‌లతో మంత్రి పొంగులేటి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదీ నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలోని ఒక మునిసిపల్, గ్రామంలో కుటుంబాల వివరాలు ఇంటింటికీ తిరిగి సేకరించాలని, దీనికి నోడల్ ఆఫీసర్‌ను నియమించాలన్నారు. సర్వే సందర్భంగా ఆయా కుటుంబాల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలు తీసుకుని ఎంట్రీ చేయాలన్నారు. ఈ నెల 8వ తేదీ వరకు ఇది పూర్తి చేయాలని, 9వ తేదీ స్క్రూటినీ ఉంటుందని, 10వ తేదీన రిపోర్ట్ సబ్మిట్ ఉంటుందని తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్టు ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా మిగతా సర్వే పనులపై ముందుకు వెళ్తామన్నారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఏఏ జిల్లాల్లో ఎన్ని ఉన్నాయి..? ఎన్ని పూర్తి చేశారని కలెక్టర్‌లను అడిగి తెలుసుకున్నారు. ఆయా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని రెండు పడకల గదులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయో వివరాలు తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా పనులు చేయాల్సి ఉంటే వెంటనే పూర్తిచేసి త్వరలో పంపిణీకి సిద్ధం చేయాలని సూచించారు. సన్న వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 అదనంగా అందజేయనుందని, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సన్న, దొడ్డు వడ్ల సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. సన్నవడ్లలో దొడ్డు వడ్లు కలవకుండా చూసుకోవాలని, వ్యవసాయ అధికారి పరిశీలించిన తర్వాత వాటిని పంపాలన్నారు. రైతులకు ఏ ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

హనుమకొండ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారులు వెంకటేశ్వర్లు, నారాయణతోపాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





భద్రకాళి చెరువు చుట్టూ వెలిసిన నిర్మాణాలు

వాడ్రా ఎప్పుడొచ్చేను?

- నకిలీపత్రాలతో వందల ఎకరాల చెరువుశిఖం భూములు స్వాహా
- భద్రకాళి, బంధం, కోటా, చిన్నవడ్డేపల్లి చెరువుల్లో 1,094అక్రమ కట్టడాలు
- నాలాల చుట్టు 524కు పైగా అక్రమ నిర్మాణాలు
- పార్కులు, సైన్స్ సెంటర్, దేవుడి, బంజర భూముల్లో దర్జాగా కట్టడాలు
- విద్య, వైద్య, వ్యాపార, వాణిజ్య సంస్థల భవనాలున్నట్టు గుర్తింపు
- హైడ్రా తరహా చర్యల కోసం ఓరుగల్లు వాసుల డిమాండ్

వరంగల్ మహానగరంలో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న కబ్జా బాగోతాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయుల గొలుసుకట్టు చెరువులు చరిత్ర చెరిగిపోతోంది. ఆధ్యాత్మిక నగరి ఆనావాళ్లు కోల్పోతోంది. నాలాలు, పార్కులు కబ్జా కోరల్లో చిక్కి తల్లడిల్లుతున్నాయి. రియల్టర్లు, రాజకీయ నేతల స్వార్థపూరిత ఆలోచనలకు చారిత్రత్మక ఓరుగల్లు నగరం కబ్జాలకు కేరాఫ్‌గా మారుతోంది. ఖాళీ స్థలాలు, ప్రభుత్వ పార్కులు, మురికినీటి నాలాలు, చెరువు శిఖం భూములే కాదు.. చివరికి దేవుడి భూములను కూడా వదలడంలేదు. ఖాళీగా జాగా కనిపిస్తే చాలు దర్జాగా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు ఎవరైనా ప్రశ్నిస్తే చేతులు తడపటమో... బెదిరింపులకు దిగటమో చేస్తున్నారు. దీంతో రూ.వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను నకిలీ పత్రాలు, పక్క సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకుని విద్యా సంస్థలు, ఫంక్షన్ హాల్స్, కమర్షియల్ మాల్స్ అపార్ట్‌మెంట్స్‌తో కబ్జారాయుళ్లు తిష్ట వేస్తున్నారు. ఈ కబ్జాలకు చెక్ పడాలంటే హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా) తరహాలో వరంగల్‌లో వరంగల్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (వాడ్రా) ఏర్పాటు చేసి చర్యలు తీసువాల్సిందేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇప్పటికే అధికారులు ఈ దిశగా యోచిస్తున్నట్టు ప్రచారం జరుగుతుండటంతో అక్రమార్కుల్లో గుబులు మొదలైంది.

పార్కులు, బంజరు భూములు మాయం..

వరంగల్ మహానగరంలో కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్టుగా ప్రభుత్వ భూములను అక్రమార్కులు చెరపడుతున్నారు. రూ.వేల కోట్ల విలువ చేసే భూములు వారి పరాధీనమవుతున్నాయి. పార్కుల స్థలాలను కూడా వదలకుండా కబ్జాలు చేస్తున్నారు. హనుమకొండలోని బాలసముద్రం చెరువుకు సంబంధించిన సుమారు 40ఎకరాల భూమిని లేవుట్ చేసి ప్లాట్లుగా మార్చి విక్రయించారు. అయితే దాదాపు నాలుగు చోట్ల పార్కుల కోసం నాలుగు ఎకరాల వరకు స్థలాలను కేటాయించారు. పార్కుకు కేటాయించిన ఎకరం భూమిని గత ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యాలయానికి 30 ఏళ్ల పాటు గజానికి రూ.100 చొప్పున లీజుకు అప్పగించింది. ఇదే ప్రాంతంలో 59జీవో కింద పార్కు స్థలాలను ప్రముఖ వైద్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నేతలు రెగ్యులరైజ్ చేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. నయీంనగర్, ఎక్సైజ్ కాలనీ, కాజీపేట, రంగాశాయిపేట, ఖిలా వరంగల్ తదితర ప్రాంతాల్లో పార్కుల కోసం కేటాయించిన స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. కోట్ల విలువయ్యే పార్కుల స్థలాలను అక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. అలాగే నగరంలోని సర్వే నెం.623లో 10ఎకరాల 22గుంటల బంజర్‌దొడ్డి భూమిలో ఐదారెకరాల వరకు కబ్జా చేశారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం పెంచేందుకు ఏర్పాటు చేసిన రీజినల్ సైన్స్ సెంటర్ భూములను కూడా కబ్జాదారులు వదల లేదు. రూ.200 కోట్లకు పైగా విలువ చేసే పది ఎకరాల పులిగుట్ట భూములు కబ్జాకు గురయ్యాయి. వీటితోపాటు నగరంలో ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేయటం ఆనవాయితీగా వస్తుందనే చర్చ జరుగుతోంది.

వాడ్రాపై వినిపిస్తున్న డిమాండ్

వరంగల్ నగరంలో హద్దుఅదుపు లేకుండా జరుగుతున్న అక్రమాలపై కొరడా ఝులిపించేందుకు ప్రభుత్వం హైడ్రా తరహాలో ఓరుగల్లు నగరంలో వరంగల్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (వాడ్రా) ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఇప్పటికి పలు సంస్థలు, పార్టీలు వాడ్రా ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగుతున్నాయి. నగరంలో లక్షల కోట్ల విలువైన చెరువు శిఖం భూములు, నాలా భూములు, దేవుడి భూములు, పార్కులు, బంజరుదొడ్డి భూములు కబ్జాలకు గురవుతున్నాయి. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన కార్పొరేటర్ స్థాయి నుంచి మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు, ప్రస్తుత ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలతో పాటు అధికారులు, వ్యాపారులు అనే తేడా లేకుండా తెరవెనుక కబ్జాలను ప్రోత్సాహించారనే ఆరోపణలున్నాయి. నగరంలో విచ్చలవిడిగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో భారీగా నిర్మాణాలను చేపట్టారు. వాడ్రా ఏర్పాటుతో కబ్జాకోరుల భరతం పట్టవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్ తరువాత వరంగల్ నగరమే అతిపెద్దది కావటంతో అక్రమార్కులు తిష్టవేసి సుమారు వెయ్యి ఎకరాల చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, తదితర వాటి భూములను రక్షించేందుకు వరంగల్ నగరానికి వాడ్రా ద్వారా బుల్డోజర్లను పంపించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ఓరుగల్లు నగరంలో కబ్జాలు ఇలా..
మొత్తం చెరువులు : 170
అక్రమణకు గురైన శిఖం భూములు : సుమారు 325 ఎకరాలు
చెరువుల్లో అక్రమ నిర్మాణాలు : 1,094
కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు : 127
నాలాలో అక్రమ నిర్మాణాలు : 524
కూల్చివేసిన అక్రమ కట్టడాలు : 107
దేవాలయ భూములు అక్రమణ : సుమారు 317ఎకరాలు
పార్కులు, గుట్టలు, తదితర అక్రమణలు : సుమారు 320 ఎకరాలు

కబ్జాల హోరుగల్లు..

మహానగరంలో 170కి పైగా చెరువులు కుంటలు ఉండగా, సగానికి పైగా కుంటలు ఇప్పటికే మాయం అయ్యాయి. నగరంలో ఉన్న నాలుగు ప్రధాన చెరువులైనా భద్రకాళి, కోటా, చిన్నవడ్డేపల్లి, బంధం చెరువుల్లో వందల కోట్ల రూపాయల విలువైన సుమారు 325ఎకరాల భూములు కబ్జా అయినట్టు అంచనా వేస్తున్నారు. వీటిలో 1,094 అక్రమ నిర్మాణాలు జరిగినట్టు గుర్తించినా కేవలం 127 అక్రమ కట్టడాలనే కూల్చివేశారు. వీటితో పాటు గోపాల్‌పూర్ చెరువు, ఉర్సు చెరువు, తిమ్మాపూర్ బెస్తం చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు,

మిగతా 8వ పేజీలో..

పేదల ఇళ్లు కూల్చివేస్తే ఊరుకునేది లేదు..

- ప్రజలకు హైడ్రా భయాన్ని కలిగిస్తోంది..
- ప్రభుత్వ పాలన ప్రజల పక్షాన ఉండాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

బాలసముద్రం, అక్టోబరు 1: రాష్ట్రంలో పేదల ఇళ్లు కూల్చివేస్తే ఊరుకునేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడారు. హైదరాబాద్‌లో ఎన్ కన్వెన్షన్‌హాల్ కూల్చివేత మినహా ఏ ఒక్కరి ఉన్నత వర్గాల భవనాలను కూల్చలేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. హైడ్రా తీరు గతి తప్పిందని, పేదల జోలికి వెళ్లకుండా చెరువులు, కాల్వలలో భూ కబ్జాదారులు భూ మాఫియాలు చేస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజలకు కొంత ఉపశమనం కలిగించిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేద ప్రజలకు భరోసా కల్పించే విధంగా పేదల జోలికి వెళ్లనని భరోసా కల్పించాలని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన సందర్భంలో పేదల ఇండ్లు కూల్చివేయమని మాట ఇచ్చారని సాంబశివరావు పేర్కొన్నారు. హైడ్రా జిల్లాలకు విస్తరిస్తే భూకబ్జాలు చేసిన ఎకరాల భూములను వెలికితీయాలన్నారు. పేద ప్రజలు ఇళ్లు వేసుకున్న వారికి 58, 59 జీవోను అనుసరించి వారికి పట్టాలు అందించాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రాజకీయంగా విమర్శలు చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్‌ను ప్రజలు ఇప్పట్లో నమ్మే పరిస్థితి లేదని, పదేళ్లలో రాష్ట్రంలో ఏ పని చేశారో ప్రజలకు తెలుసని అన్నారు. కేంద్రంలోని బీజేపీ రైతులకు అన్యాయం చేసిందని, వరదలు వచ్చి నష్టపోతే రైతులకు ఎలాంటి సహాయం చేయలేదని అన్నారు. బీజేపీ రాష్ట్రంలో రైతుల రుణమాఫీపై ధర్నా చేయడం హాస్యాస్పదమని, ప్రతిపక్షంగా పోరాటాలు చేయాలేకానీ రాజకీయాలు చేయవద్దన్నారు. ఈడీ అధికారులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటిపై సోదాలు నిర్వహించడం కుట్రలో భాగమేనన్నారు. బీజేపీలో తప్పులు చేసిన వారు ఉన్నారని, అందరి మీద ఈడీ అధికారులు సోదాలు నిర్వహించాలని సూచించారు.

రాష్ట్రంలో హైడ్రా నుంచి ప్రభుత్వం బయటకు వచ్చి పరిపాలనపై దృష్టిసారించాలని కూనంనేని సూచించారు. ఆడపిల్లల పెళ్లికి బంగారం ఇస్తామని చెప్పారు. పెన్షన్ రూ.4వేలు ఇస్తామన్నారు ఇవి ప్రజలకు ఎప్పుడు ఇస్తారో చెప్పాలనీ సీఎంకు సూచించారు. కాంగ్రెస్‌తో మిత్రపక్షంగా ఉంటూనే ప్రజల సమస్యలపై ప్రతిపక్ష గొంతుక వినిపిస్తామన్నారు. రాష్ట్రంలో వేలాది మంది పేదలకు ఇళ్లు కట్టించామని, పేదలు హైడ్రాతో భయపడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు నేదునూరి జ్యోతి, మండ సదాలక్ష్మీ, ఆదరి శ్రీనివాస్, కొట్టెపాక రవి తదితరులు పాల్గొన్నారు.

నీ పాపాల చిట్టా నా సెల్‌లోనే ఉంది..

- వినయ్‌భాస్కర్ కబ్జాల భాగోతాన్ని ఆధారాలతో బయటపెడతా..
- నయీంనగర్ బ్రిడ్జి, కళాక్షేత్రంపై అసత్య ప్రచారం సిగ్గుచేటు
- మీడియా సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఫైర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, అక్టోబరు 1: మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ పాపాల చిట్టా తన సెల్‌ఫోన్‌లోనే ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. సమయం వచ్చినప్పుడు పక్కా ఆధారాలతో పాపాల భాగోతాన్ని బయటపెడతానని చెప్పారు. మంగళవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వినయ్‌భాస్కర్‌పై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వినయ్‌భాస్కర్ ప్రజలకు, నియోజకవర్గ అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. కబ్జాలు, రౌడీయిజం, గుండాయిజానికి కేరాఫ్ వినయ్‌భాస్కరే అని ఆరోపించారు. ఎమ్మెల్యేగా ప్రభుత్వ, సామాన్యుల స్థలాలను కబ్జా చేసి భయభ్రాంతులకు గురి చేశాడని చెప్పారు. వినయ్‌భాస్కర్ కబ్జాల భాగోతం త్వరలోనే ప్రజల ముందు పెడతానన్నారు. ఆయన బాధితులు తన వద్దకు వచ్చి గోడు వెల్లగక్కుతున్నారన్నారు. వినయ్‌భాస్కర్ కబ్జాల భాగోతం ఆస్ట్రేలియాకు కూడా చేరిందన్నారు.

హనుమకొండ నయీంనగర్ బ్రిడ్జి, బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం తమ హయాంలోనే జరిగిందంటూ వినయ్‌భాస్కర్ చెప్పుకోవడం సిగ్గు చేటని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బ్రిడ్జి, కళాక్షేత్రం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి కోట్లలో నిధులు తెచ్చి పూర్తిచేశామని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులను వెంటేసుకొని బ్రిడ్జి వద్దకు వచ్చి అసత్యాలు పలకడం వినయ్‌భాస్కర్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. గోడకు ఉన్న తుపాకీ తీస్తా.. అంటూ వినయ్‌భాస్కర్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. తాను తలు చుకుంటే వినయ్‌భాస్కర్ మద్రాసు పరిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పెద్దమ్మగడ్డలో స్మశానవాటిక విషయంలో దళితులను వినయ్‌భాస్కర్ వంచించాడని ఆరోపించారు. న్యాయం చేయమని ఆశ్రయిస్తే దళితులపైనే కేసులు పెట్టించాడని విమర్శించారు. అసలు పెద్దమ్మగడ్డ స్మశానవాటిక స్థలం తూర్పు పరిధిలోకి వస్తుందనే విషయం కూడా తెలియకుండా తనపై బురదచల్లడం వినయ్‌భాస్కర్ అవివేకానికి నిదర్శనమన్నారు. కబ్జాదారులు ప్రహరీ కూల్చివేస్తే దళితులకు అండగా ఉండి కబ్జారాయుళ్లపై కేసులు పెట్టించిన నిజాయితీ తనదని రాజేందర్‌రెడ్డి చెప్పుకొచ్చారు.

బీసీ నాయకుడిగా చెప్పుకొంటున్న వినయ్‌భాస్కర్ ఒక్క బీసీని ఎదగకుండా అణచివేశాడని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. కొరబోయిన సాంబయ్య, పుప్పాల ప్రభాకర్.. ఇలా ఎందరో వినయ్‌భాస్కర్‌ను నమ్మిన బీసీలు అణచివేతకు గురయ్యారని తెలిపారు. బీసీ అయిన తోట పవన్‌పై దాడి చేయించిన ఆయన బీసీ నాయకుడు ఎలా అవుతాడని నాయిని ప్రశ్నించారు. తన సోదరుడు మాజీ మంత్రి ప్రణయ్‌భాస్కర్ కుటుంబానికే వినయ్‌భాస్కర్ మోసం చేశాడని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. ప్రణయ్‌భాస్కర్ మరణం క్రమంలో ఆయన భార్య పోటీలో నిలిస్తే కుట్రపూరితంగా వినయ్‌భాస్కరే ఓడించారని ఆరోపించారు. ప్రణయ్‌భాస్కర్ కుమారుడు అభినవ్‌భాస్కర్‌ను రాజకీయంగా ఎదగకుండా అడ్డుకున్నాడని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కాంగ్రెస్ నాయకులు పుల్లా పద్మావతి, అజీజ్‌ఖాన్, బొమ్మతి విక్రం, బంక సరళాదేవి, బిన్నీ లక్ష్మణ్, రజాలీ, డాక్టర్ రామక్రిష్ణ, డాక్టర్ శ్రవణ్, కూర వెంకట్, సంపత్ యాదవ్, అంకూశ్, మార్క విజయ్, మనోహర్, మండల సమ్మయ్య, శివాజీ, చీకటి ఆనంద్, రాహుల్‌రెడ్డి కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.



జగన్‌మోహన్‌రావును సన్మానిస్తున్న టీజీవోలు

జగన్‌మోహన్‌రావుకు టీజీవోల సన్మానం

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబర్ 1: రాష్ట్ర కోఆపరేటివ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎన్నమనేని జగన్‌మోహన్‌రావును హనుమకొండ, వరంగల్ జిల్లాల తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్(టీజీవో) అసోసియేషన్స్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ మేరకు వారు హనుమకొండ కలెక్టరేట్‌లోని సహకార శాఖ కార్యాలయంలో జగన్‌మోహన్‌రావును కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న ఈగ వెంకటేశ్వర్లు జాయింట్ సెక్రెటరీగా ఎన్నికైనందుకు, భూపాలపల్లిలో పనిచేస్తున్న నాగ నారాయణ ఆర్గనైజేషన్ సెక్రెటరీగా ఎన్నికైన సందర్భంగా వారిని కూడా పుష్పగుచ్ఛాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఫణికుమార్, నీరజ, కోలా రాజేష్ కుమార్, అన్వర్ హుస్సేన్, వెంకటేశ్వర్లు, రాజేష్ కుమార్, మహేష్‌కుమార్, అస్నాల శ్రీనివాస్, రఘుపతిరెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, రవిచంద్ర, అజారుద్దీన్ తదితరులు ఉన్నారు.

దసరా వేళ 850 ప్రత్యేక బస్సులు

బాలసముద్రం, అక్టోబరు 1: దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వరంగల్ రీజియన్ పరిధిలో 850 బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన ఆర్టీసీ ఆర్‌ఎం డి.విజయభాను మంగళవారం తెలిపారు. హనుమకొండ డిపో నుంచి 125, జనగామ 120, వరంగల్ డిపో-1, 125, వరంగల్ డిపో-2, 125, మహబూబాబాద్ 45, నర్సంపేట 119, పరకాల 93, తొర్రూరు 48, భూపాలపల్లి 48 మొత్తం 850 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆయన తెలిపారు. మహాలక్ష్మీ పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున రవాణాపరంగా ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా వరంగల్ రీజియన్‌లో ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. హనుమకొండ నుంచి ఉప్పల్, పరకాల, భూపాలపల్లి, కాళేశ్వరం, మహబూబాబాద్, తొర్రూరు, నర్సంపేట వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆయన తెలిపారు.

నేనెవరో తెలుసా? నాగురించి తెలుసుకో!

సీఐ సతీష్‌తో నవీన్‌రాజ్ వాగ్వాదం.. మంత్రి సురేఖ పర్యటనలో ఘటన



సీఐ, నవీన్‌రాజ్ మధ్య వాగ్వాద దృశ్యం

వరంగల్ క్రైం, అక్టోబరు 1: నెనెవరో తెలుసా..? నువ్వెవరైతే నాకేంటి? నా గురించి తెలుసుకో..' అంటూ కొండా అనుచరుడు నవీన్‌రాజ్ చేసిన వార్నింగ్ ఇది. హనుమకొండ సీఐ సతీష్‌తో నవీన్‌రాజ్ అన్న మాటలకు అంతే ధీటుగా సీఐ సమాధానమిచ్చారు. ఈ వాగ్వాదం మంత్రి కొండా సురేఖ పర్యటనలో చోటు చేసుకుంది. అక్కడే ఉన్న ఎస్సై.. ఇద్దరిని సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. వివరాల్లోకి వెళితే..

వరంగల్‌లోని ఇస్లామియా జూనియర్ కళాశాలలో మంగళవారం ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి మంత్రి సురేఖ హాజరయ్యారు. ఈ క్రమంలో మంత్రి వెంట కాంగ్రెస్ నాయకుడు నవీన్‌రాజ్ వచ్చారు. ఈ కార్యక్రమానికి బందోబస్తు నిర్వహణకు హనుమకొండ సీఐ సతీష్ వెళ్లారు. మంత్రి సురేఖ సమీపంలో నవీన్‌రాజ్ ఉండగా బందోబస్తులో భాగంగా సీఐ సతీష్ ఆయనను పక్కకు జరిపాడు. నేనెవరో తెలుసా? నన్ను పక్కకు జరుపుతావా..? అని సీఐపై నవీన్‌రాజ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో సీఐ సతీష్ నువ్వు ఎవరైతే నాకేంటి? పక్కకు తప్పుకో.. అంటూనే నేనెవరో నువ్వు తెలుసుకో..? అంటూ సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో ఒకరిని ఒకరు నెట్టుకునే స్థాయిలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పక్కనే ఉన్న ఎస్ఐ ఇద్దరికి సర్దిచెప్పడంతో సద్దుమణిగింది.

లాభాల బంతి



పూజలవేళ రైతన్నకు 'పండుగ' ● తక్కువ విస్తీర్ణంలో, స్వల్ప పెట్టుబడితో పూలసాగు ● వైవిధ్య వ్యవసాయంతో శభాష్ అనిపించుకునంటున్న పటేల్‌గూడెం రైతు



పటేల్‌గూడెంలో సాగు చేసిన బంతిపూల తోట

లింగాలఘణపురం, అక్టోబరు 1: ఏళ్లుగా మూసపద్ధతిలో చేస్తున్న వ్యవసాయం కంటే వినూత్న వ్యవసాయం ఎంతో లాభదాయకం.. ఎకరాల కొద్దీ పంటలను సాగు చేసి లక్షల్లో పెట్టుబడి పెట్టి చీడపీడలతో ఛిద్రమయ్యే రైతుల కంటే వైవిధ్యమైన సాగు విధానంతోనే రైతులకు లాభాల పంట పండుతోంది. సీజన్‌కు అనుగుణంగా పంటలను సాగు చేస్తూ లక్షల్లో లాభాలను పొందడంలో లింగాలఘణపురం మండలం పటేల్‌గూడెం గ్రామానికి చెందిన పెండ్లి రమేశ్ అనే రైతు ఆదర్శంగా నిలుస్తూ వైవిధ్యమైన వ్యవసాయానికి కేరాఫ్‌గా నిలుస్తున్నాడు. అతితక్కువ విస్తీర్ణంలో పూలసాగు చేసి అత్యధికంగా లాభాల పంటను పండిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు.

పూల సాగు భళా..

లింగాలఘణపురం మండలం పటేల్‌గూడెం గ్రామానికి చెందిన ఓ సాధారణ రైతు పెండ్లి రమేశ్ చదువుకోకపోయిఆ సాగులో భేష్ అని పించుకుంటున్నాడు. కేవలం 15 గుంటల విస్తీర్ణంలో బంతిపూల సాగు మరో 20 గుంటల్లో లిల్లీపూల సాగు, ఎకరం విస్తీర్ణంలో మల్లెపూల సాగును చేస్తున్నాడు. రమేష్ అందరు రైతుల్లా కాకుండా విభిన్నమైన ఆలోచనా విధానంతో ముందుచూపుతో వ్యవహరిస్తూ గణేష్ నవరాత్రో త్సవాలు, దేవీశరన్నవరాత్రోత్సవాలు, దీపావళి, కార్తీక మాసం, పెళ్లిళ్ల శుభముహూర్తాలను దృష్టి లో పెట్టుకొని ఏ సీజన్‌కు ఏరకమైన పూలకు మార్కెట్లో డిమాండ్ ఉంటుందో ముందే అంచనావేసి ఆ రకమైన పూల సాగుకు శ్రీకారం చుడు తుంటాడు. ప్రధానంగా పెళ్లిళ్ల సీజన్‌లో జనవరి నుంచి మే వరకు ఐదుమాసాల పాటు మల్లెపూలు, సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు గణేశ్ నవరాత్రోత్సవాలు, దేవీ శరన్నవరాత్రోత్సవాలు, దీపావళి నోములు, కార్తీక మాసోత్స వాల సీజన్‌లో బంతిసాగును చేస్తూ మార్కెట్‌లో అత్యధిక లాభాలను పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.



లిల్లీపూల తోట

రోజుకు రూ.3వేల ఆదాయం

రమేశ్ సాగు చేసిన బంతిపూలు, లిల్లీపూల సాగుతో రెండు రెలలుగా రోజుకు రూ. 3వేల ఆదాయాన్ని పొందుతుండటం విశేషం. కేవలం 35గుంటల విస్తీర్ణంలోనే రెండు నెలలుగా రూ.1.80లక్షల ఆదాయాన్ని సాధించి శభాష్ అనిపించుకుంటున్నాడు. ప్రస్తుతం బంతిపూలపై రోజుకు రూ.1500, లిల్లీ పూల సాగుపై రూ.1500 లెక్కన ఆదాయం పొందుతూ అటు దినసరి కూలీలకు ఉపాధిని కల్పిస్తూ, ఇటు తాను కూడా స్వయం ఉపాధి పొందుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకే సవాల్‌గా నిలుస్తుండటం గమనార్హం.

పూలసాగు బాగుంది..

పెండ్లి రమేశ్, రైతు, పటేల్‌గూడెం



మొదట్లో అందరిలాగే వరి, పత్తి పంటలు వేశా. వాటిలో కష్టానికి తగిన ప్రతిఫలం లేదు. లాభాల సంగతి పక్కన పెడితే నష్టాలే ఎక్కువగా వచ్చిన సందర్భాలున్నాయి. దీంతో ప్రత్యేకంగా వ్యవసాయం చేయాలన్న ఆలోచన వచ్చింది. మొదట మల్లె తోట వేశా. లాభాలు బాగానే ఉంటున్నాయి. దీంతో పాటు బంతిపూల సాగు గురించి తెలుసుకుని వెంటనే 15 గుంటల్లో బంతి వేశా. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తున్నాయి. 50 నుంచి 60 రోజుల్లో పంట చేతికి వచ్చింది. ఇప్పటికే 5క్వింటాళ్ల బంతిపూలు కనిష్ఠంగా రూ.6వేల చొప్పున అవిమ్మి రూ.30వేలు సంపాదించా. మరో నాలుగు సార్లు బంతిపూలు కోతకు వస్తాయి. అదేవిధంగా లిల్లీపూల తోటలో రోజుకు 15కిలోల పూలను రూ.120 లెక్కన రూ.1800 దాకా మార్కెట్‌లో విక్రయిస్తున్నా. పూల సాగులో లాభదాయకంగా ఉండటంతో ఏటా పూలసాగుపై మొగ్గు చూపుతున్నా.

టామ్‌కామ్ ద్వారా విదేశాల్లో ఉద్యోగావకాశాలు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 1: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యంలో విదేశాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్‌దేశాలతో పాటు, ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్, పోలాండ్, రుమేనియా తదితర దేశాల్లో వివిధ ఉద్యోగాల కోసం టామ్‌కామ్ మెయిల్‌కు బయోడేటాను పంపించాల్సిందిగా ఆయన కోరారు. పూర్తి వివరాల కోసం 9440051285/ 9440048500/ 9701040062/ 9440051452 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

5న జాబ్ మేళా

ములుగురోడ్‌లోని వరంగల్ జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో అక్టోబర్ 5న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సీహెచ్. ఉమారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్, మద్రాసులో డిజిటల్ ప్రాసెస్ అసోసియేట్స్ 100 ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంటర్ ఎంపీసీలో 75శాతం మార్కులతో పాసైన అభ్యర్థులు మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. అభ్యర్థులు శనివారం ములుగురోడ్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్



భక్తుల దర్శనార్థం దేవాలయంలో ఉంచిన అయోధ్య రాముడి ధనుస్సు

నగరానికి చేరిన అయోధ్య రాముడి ధనస్సు

2025 నాటికి అయోధ్యలో ప్రతిష్ఠాపన

మట్టెవాడ, అక్టోబరు 1: అయోధ్యకు చెందిన అయోధ్య భాగ్యనగర సీతారామా సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయోధ్య కోదండ రాముడి ధనస్సు మంగళవారం వరంగల్ బట్టల బజార్‌లోని శ్రీబాల నగర వేంకటేశ్వర స్వామి దేవాలయానికి చేరింది. భక్తుల దర్శనం కోసం మంగళవారం దేవాలయంలో ధనస్సుని దర్శించుకున్నారు. 13 కిలోల వెండి, కిలో బంగారంతో రూపొందించిన ధనస్సును దేశవ్యాప్తంగా ప్రముఖ దేవాలయాల్లో భక్తుల దర్శనం అనంతరం 2025 మార్చిలో ఆయోధ్య కోదండరామ ప్రతిష్ఠాపన సందర్భంగా ఈ ధనస్సును కోదండరాముడి చేతిలో ప్రతిష్ఠించనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎలపాటి రత్నకార్ రెడ్డి, ఆలయ చైర్మన్ పరాశరం శ్రీనివాసచార్యులు, అర్చకులు శ్రీధరచార్యులు పాల్గొన్నారు.

3న జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 1: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాలులో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికపోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అర్గనైజింగ్ సెక్రటరీ పోతరాజు రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్, సబ్ జూనియర్స్ బాలబాలికల విభాగాల్లో ఎంపిక పోటీలను నిర్వహిస్తామన్నారు. జూనియర్స్ విభాగంలో 1జనవరి 2008 నుంచి 31 డిసెంబర్ 2009 మధ్యలో జన్మించినవారు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, అదే విధంగా సబ్ జూనియర్స్ విభాగంలో 1జనవరి 2010 నుంచి 31డిసెంబర్ 2011 మధ్యలో జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన జూనియర్స్, సబ్ జూనియర్స్ బాలబాలిక ఈ నెల 5, 6తేదీల్లో హైదరాబాద్ సరూర్‌నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు ఈ నెల 3న ఉదయం 7గంటలకు డీఎస్ఏ బాక్సింగ్‌హాల్లో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ 9959711609 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.



ఖమ్మం జట్టుపై ఘన విజయం సాధించిన కరీంనగర్ జట్టుతో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

హోరాహోరీగా అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

ఆదిలాబాద్‌పై నిజామాబాద్, ఖమ్మంపై కరీంనగర్ జట్లు ఘన విజయం

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 1: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ క్రీడా మైదానాల్లో కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న అండర్-19 అంతర్ జిల్లాల బాలుర క్రికెట్‌లీగ్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి.

మంగళవారం కోమటిపల్లిలోని ఫోర్ట్ క్లబ్ క్రికెట్ మైదానంలో పూల్ బీలో ఆదిలాబాద్ - నిజామాబాద్ జట్ల మధ్య జరిగిన పోరులో నిజామబాద్ జిల్లా జట్టు ఒక్క వికెట్ తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిలాబాద్ జట్టు నిర్ణీత 50ఓవర్లకు 28.3ఓవర్లను ఎదుర్కొని 93 పరుగులకు ఆలౌట్ అయింది. తదుపరి 94పరుగుల లక్ష్యసాధనలో బారిలోకి దిగిన నిజామాబాద్ జట్టు.. 27. 5ఓవర్లను ఎదుర్కొని 9వికెట్ల నష్టానికి 94పరుగులు చేసి ఒక్క వికెట్ తేడాతో విజయం సాధించింది. అదేవిధంగా పూల్ బీలోని మరో రెండు జట్లు కరీంనగర్, ఖమ్మం జట్ల మధ్య వరంగల్ నగర శివారులోని మొగిలిచర్ల క్రీడామైదానంలో పోటీలు నిర్వహించగా, కరీంనగర్ జట్టు ఖమ్మం జట్టుపై 6వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కరీంనగర్, ఖమ్మం జట్ల మధ్య జరిగిన పోటీల్లో ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం జట్టు నిర్ణీత 50ఓవర్లను కేవలం 25.4 ఓవర్లు ఎదుర్కొని 99పరు గులకు ఆలౌట్ కాగా, తదుపరి 100పరుగుల సాక్ష్య సాధనలో బారిలోకి దిగిన కరీంనగర్ జట్టు కేవలం 17.1ఓవర్లలో 102 పరుగులు సాధించి 6 వికెట్ల తేడాతో గమ్యాన్ని ముద్దాడి విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఖాజా, మాజీ కార్యదర్శి సభ్యులు తోట రాము, మట్టెడ కుమార్, బండారి ప్రభాకర్, రామకృష్ణ, పాల్గొన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారిగా వినయ్‌కృష్ణారెడ్డి

హనుమకొండ టౌన్, అక్టోబరు 1: ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారిగా హెచ్‌యం అండ్ ఎఫ్‌డబ్ల్యూ శాఖ జాయింట్ సెక్రెటరీ, ఐఏఎస్ టి.వినయ్‌కృష్ణారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, జనగాం, మహబూబాబాద్, ములుగు జిల్లాలను సందర్శించి ఆయా జిల్లాల కలెక్టర్లను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం పథకాల అమలుపై చొరవ చూపాలని ఉత్తర్వుల్లో సూచించారు.

బీఆర్‌ఎస్ నాయకులు చెరువులను కబ్జా చేశారు

కాపాడుకునేందుకు కుట్రలు చేస్తున్నారు

అక్రమ నిర్మాణాలు చేసి హైడ్రాపై విమర్శలు

పేద, మధ్యతరగతి ప్రజలు అందోళన చెందొద్దు

ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



బాలసముద్రం / కాజీపేట, అక్టోబరు 1: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఆ పార్టీలోని బడా నాయకులు చెరువులు, కుంటలను కబ్జా చేశారని, వాటిని కాపాడుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయిల్‌ఫెడ్ రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు, వారి మద్దతుదారుల ఆక్రమణలకు అంతులేకుండా పోయిందని చెరువులు, కుంటలు, వాగులు, వంకల బఫర్‌జోన్‌లు, ఫుల్ ట్యాంక్ లెవల్‌ను ఆక్రమించి ఫామ్‌హౌస్‌లు, గెస్ట్ హౌస్‌లు, మాల్స్, రాజభవనాలను మించిన బిల్డింగులు కట్టుకున్నారని ఆరోపించారు. వారు చేసిన కబ్జాల వల్ల చిన్నపాటి వర్షానికే మునిగి హైదరాబాద్ మహా నగరంలో డ్రైయినేజీలు పొంగి పొర్లుతున్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన మంత్రివర్గం అన్ని కోణాల్లో ఆలోచించి భవిష్యత్ తరాలకోసం మంచి నగరాన్ని అందించేందుకే హైదరాబాద్‌లో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, పరిరక్షణ, విపత్తుల నిర్వహణ కోసం హైడ్రాను ఏర్పాటు చేశారన్నారు. ఒకప్పుడు హైదరాబాద్ నగరానికి లేక్ సిటీగా పేరుండేదని గొలుసుకట్టు చెరువులు, సాగు, తాగునీరందించేవి ఆ చెరువులను వరద నీటి కాల్వలు, నాలాలు ఆక్రమణలు లేకుండా ప్రభుత్వం హైడ్రా పేరుతో చర్యలు చేపడుతోందని, రెవెన్యూ, నీటిపారుదల శాఖలు, నేషనల్ రిమోటింగ్ సెన్సింగ్, స్టేట్‌రిమోట్ సెన్సింగ్, విభాగాలతో అధ్యయనం చేయించి చట్టబద్ధంగా నోటీసులు ఇచ్చిన తర్వాతే హైడ్రా కూల్చివేతలకు దిగుతోందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు తమ ప్రభుత్వం నష్టం చేయదని, తెలిసీతెలియక ఇలాంటి వివాదాస్పద భూములు కొని ఇళ్లు కట్టుకుంటే ప్రభుత్వం వారికి డబుల్‌బెడ్రూమ్ ఇస్తుందని, కొందరు బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయం కోసం పేదలను రెచ్చగొట్టి భయందోళనలు సృష్టించి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

వర్సిటీలో అక్రమాలపై పంజా

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆకస్మిక తనిఖీలు ● పూర్వ వీసీ తాటికొండ రమేశ్ అక్రమాలపై దృష్టి ● ఫేక్ ప్రాజెక్టులు, పీహెచ్‌డీ సీట్ల అమ్మకాలపై విచారణ

కేయూ క్యాంపస్, అక్టోబరు 1: గత వీసీ తాటికొండ రమేశ్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ బాలకోటి నేతృత్వంలో తనిఖీలు జరిపారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్సిటీని జల్లెడ పట్టారు. సుమారు 20 నుంచి 30 మంది అధికారులు కేయూక్యాంపస్‌లోని రిజిస్ట్రార్ చాంబర్‌లో అడ్డా వేశారు. విద్యార్థి సంఘాల నేతలు, వర్సిటీ అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారితోపాటు ఇతర ప్రజాసంఘాల నాయకులు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు విజిలెన్స్ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదుల కాపీలను అధికారులు ముందు పెట్టుకుని ఒక్కొక్కటి క్షుణ్ణంగా పరిశీలిస్తూ తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా 8 అంశాలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. మాజీ వీసీ తాటికొండ రమేశ్ వర్సిటీ నిబంధనల అతిక్రమించి తనకు తానుగా సీనియర్ ప్రొఫెసర్ పదోన్నతి, అప్పటి రిజిస్ట్రార్ టి.శ్రీనివాసరావు ఆరుగురు ప్రొఫెసర్లకు సీడ్ మనీ పేరుతో ఫేక్ ప్రాజెక్టులు ఇచ్చిన ఉత్తర్వులపై దృష్టిసారించిన విజిలెన్స్ అధికారులు.. ఆయా రికార్డులను పరిశీలించారు. ప్రతీది ప్రత్యేకంగా నోట్ చేసుకుని వర్సిటీ నిబంధనలతో పాటు 'వీళ్ల తీసిన ఆర్డర్‌లో ఏముంది?' అనే అంశంపై చర్చించారు. అయితే నోటిఫికేషన్ లేకుండానే ఫేక్ ప్రాజెక్టులు మంజూరు చేసినట్లుగా విజిలెన్స్ అధికారులు గుర్తించినట్లు సమాచారం. మొత్తంగా ఆరుగురు ప్రొఫెసర్లకు సీడ్ మనీ పేరుతో ప్రాజెక్టులు ఇవ్వగా, అప్పటి రిజిస్ట్రార్ టి.శ్రీనివాసరావు తన పేరుపై తాను ఆర్డర్‌ను తీసినట్లుగా గుర్తించారు.



ఇన్‌చార్జి రిజిస్ట్రార్ నరసింహచారి, ఇతర అధికారులతో సమావేశమైన అధికారులు

పీహెచ్‌డీ సీట్ల అమ్మకాలు?

కాకతీయ యూనివర్సిటీలో కేటగిరి-1, 2 సీట్ల విభజనలో సరైన మార్గదర్శకాలను అనుసరించకపోవడంతో వివాదం తలెత్తింది. ఇంజనీరింగ్, ఫార్మసీతోపాటు డిమాండ్ కలిగిన కోర్సుల్లో పీహెచ్‌డీ సీట్లను ఇన్‌సర్వీస్ అభ్యర్థులకు కేటాయించారు. ప్రధానంగా ఇంజనీరింగ్ విభాగంలో కొందరు ప్రొఫెసర్లు మధ్యవర్తిగా వ్యవహరించి సీట్లకు వేలం వేసుకుని అమ్ముకున్నట్లుగా ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై విద్యార్థిసంఘాలు నిరసన ఆందోళనలు చేపట్టడం వర్సిటీలో తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసిన విషయం విదితమే. ఆయా అంశంపై విజిలెన్స్ అధికారులు కూపీలాగారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో నిబంధనలు ఎలా ఉన్నాయి.. వర్సిటీ అధికారులు ఎలా అడ్మిషన్లు చేపట్టారు.. అనే విషయంపై ఆరా తీశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఇన్స్‌పెక్టర్ రాకేశ్, అనిల్, హనక్, విజిలెన్స్ అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీనివాస్, అసిస్టెంట్ జియాలజిస్టు హరిప్రసాద్, గౌతమ్ రెడ్డి, ఫారెస్టు ఆఫీసర్లు పాల్గొన్నారు. వర్సిటీ నుంచి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ఏఆర్ డాక్టర్ కోలా శంకర్‌తోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ అధికారులకు బిగుస్తున్న ఉచ్చు

కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ అండ్ ఎన్‌పోర్స్‌మెంట్ అధికారుల వరుస దాడులు, సేకరించిన సమాచారాన్ని పోల్చుకుని రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్రమైన నివేదికను అందించనున్నారు. ఇప్పటికే వర్సిటీలోని భూములపై సమగ్ర నివేదికను రూపొందించే పనులను రెవెన్యూ, మునిసిపల్ అధికారులకు అప్పగించారు. వివిధ శాఖల అధికారుల బృందం ప్రత్యేక జాయింట్ కమిటీని ఏర్పాటు చేశారు. వర్సిటీ భూముల అక్రమణలు, వర్సిటీ ఉద్యోగుల భూముల్లో ఇళ్లు కట్టుకోవడాన్ని నిర్ధారించారు.

దేవీ శరన్నవరాత్రులకు సర్వం సిద్ధం

● ముస్తాబైన వరంగల్ భద్రకాళి ఆలయం ● 12న తెప్పోత్సవానికి సన్నాహాలు



మంత్రి కొండా సురేఖకు ప్రసాదం అందజేస్తున్న ఈవో, ప్రధానార్చకుడు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 1: దేవీశరన్న వరాత్రులకు సర్వం సిద్ధమైంది. వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుంద రంగా ముస్తాబు చేశారు. గురువారం నుంచి 13వతేదీ వరకు శరన్నవరాత్రులు జరగనుండ గా, ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశామని ఆల య ఈవో శేష భారతి, ప్రధానార్చకుడు భద్ర కాళి శేషు తెలిపారు. మంగళవారం ఆలయ అన్నప్రసాద ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో వారు మాట్లాడారు. గురువా రం నుంచి 13వ తేదీ వరకు దేవీ నవరాత్రులు జరుగుతాయని, 2న అమ్మవారికి పసుపుతో అభిషేకం, హరిద్రదర్శనం, 3న కలశ స్థాపన, 9న మూల నక్షత్రం సరస్వతీపూజ, 10న సద్దుల బతుకమ్మ సందర్భంగా భద్రకాళి దేవి జన్మదినోత్సవం మహారాత్రి అవనం జరుగుతుందని పేర్కొన్నారు. 11న మహానవమియాగ పూర్ణాహుతి, 12న విజయదశమి సందర్భంగా భద్రకాళి అమ్మవారి మహాదర్శనం, భద్రకాళి తటాకంపై హంసవాహనంలో తెప్పోత్సవం ఉంటుందన్నారు. 13న భద్రకాళి భద్రేశ్వరుల శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతీ రోజు భద్రకాళి అమ్మవారికి నిత్య పూజలు, హోమాలు, విశేష పూజలు ఉంటాయని, భక్తులకు మధ్యాహ్నం, రాత్రి భద్రకాళి సేవా సమితి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు పోలీసు శాఖ భద్రతా చర్యలు, శానిటేషన్, సిబ్బంది విధులు, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం..

నవరాత్రి ఉత్సవాలకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆలయ ఈవో శేషభారతి, ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆహ్వానించారు. మంగళవారం హనుమకొండలోని మంత్రి నివాసంలో కలిసిన వారు ఆహ్వా నపత్రికను అందజేశారు. ఈకార్యక్రమాల్లో అధికారులు కూచన హరినాథ్, శ్యాంసుందర్, అర్చకులు పాల్గొన్నారు.



పుట్టపై పడిన సూర్యకిరణాలు

నాగేంద్రుడిపై సూర్యకిరణాలు

గీసుగొండ, అక్టోబరు 1: ఊకల్‌లోని నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోని పుట్టపై మంగళవారం సూర్యకిరణాలు పడ్డాయి. ఉదయం స్వామివారికి అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు అలంకరణ చేస్తుండగా గర్భగుడిలోని నాగేంద్రుడి పడగపై సూర్యకిరణాలు పడి పసిడికాంతులు విరజిమ్మాయి. ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించిన భక్తులు తరించారు. ఈ విషయం చుట్టుపక్కల గ్రామాల్లో తెలియటంతో భక్తులు భారీగా తరలివచ్చి పుట్టలో పాలుపోసి పూజలు, చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో హైకోర్టు న్యాయవాది తీగల రాజేష్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ మాచినపెల్లి బాబురావు, రాజేందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖపై బీఆర్ఎస్ వైఖరిని ఖండిస్తున్నాం : స్వర్ణ

వరంగల్ సిటీ, అక్టోబరు 1: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుల్లారా.. ఖబడ్దార్.. అంటూ డీసీసీ అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ హెచ్చరించారు. సురేఖపై బీఆర్ఎస్ చేస్తున్న అసత్య ప్రచారాలపై మంగళవారం స్వర్ణ ఒక ప్రకటనలో స్పందించారు. సోదరభావాన్ని కూడా తప్పు బట్టడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ నేతలకు అక్కా, చెల్లెలు లేరా..? తల్లి బిడ్డలు లేరా..? అని ప్రశ్నించారు. శాంతియుతంగా బీఆర్ఎస్ భవన్ వద్ద నిరసన తెలిపిన సురేఖ అభిమానులు, కాంగ్రెస్ నేతలపై దాడులు చేయడం వారి దిగజారుడుతనానానికి నిదర్శనమని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు సురేఖకు క్షమాపణలు చెప్పాలని, లేదంటే బీఆర్ఎస్ నేతలను క్షేత్రస్థాయిలో తిరగనివ్వమని హెచ్చరించారు.

మహాత్ముడి కలలను సాకారం చేయాలి

వరంగల్ లీగల్, అక్టోబరు 1: పరిశుభ్రమైన ఆరోగ్యవంతమైన భారత్‌ను ఆవిష్కరించాలన్న మహాత్ముడి కలను నిజం చేయాలని వరంగల్ జిల్లా ప్రధాన జడ్జి బీవీ నిర్మల గీతాంబ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. కోర్టు ఆవరణలో సిబ్బందితో సహా ప్రతీఒక్కరు కోర్టు ఆవరణలో చెత్త వేయకుండా జాగ్రత్తపడడమే కాకుండా ఇతరులు కూడా చెత్త వేయకుండా చూడాలని ఆమె సూచించారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛ భారత్‌లో ప్రజలందరిని భాగస్వాములను చేయాలని న్యాయమూర్తి పిలుపునిచ్చారు. పారిశుధ్యంపైన చెత్త చెదారం తొలగించడంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ఒక అలవాటుగా మారాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో ఇతర న్యాయమూర్తులతో కలిసి చెత్తను ఊడ్చారు. కార్యక్రమంలో న్యాయమూర్తు లు మనీషా శ్రావణ్ ఉన్నమ్, ఎం.సాయికుమార్, చండీశ్వరీదేవి, శశి, వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భాగస్వాముల మధ్య వివాదం

» ఒకరి నిర్బంధం » బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

హనుమకొండ టౌన్, అక్టోబరు 1: ఓ ప్రయివేటు పాఠశాల భాగస్వాముల మధ్య జరిగిన వివాదంలో ఓ భాగస్వామిపై కేయూ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై సత్యాల్‌సింగ్ కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేటలోని మాస్టర్ మైండ్ స్కూల్‌లో చంద్రశేఖర్ వర్కింగ్ పార్టనర్‌గా, గోపాల్‌పూర్ మహాలక్ష్మీకాలనీకి చెందిన శ్రీనివాస్ పెట్టుబడిదారుడిగా ఉన్నారు. ఇద్దరికి కొంతకాలంగా పాఠశాలలో పెట్టుబడిగా పెట్టిన రూ.కోటి 40 లక్షలకు సంబంధించిన లావాదేవీల విషయంలో వివాదం జరుగుతోంది. ఈ క్రమంలో మాట్లాడుకుందామని చంద్రశేఖర్‌ను శ్రీనివాస్ హనుమకొండ గోపాల్‌పూర్‌లోని తన నివాసానికి పిలిపించుకున్నారు. ఆపై అక్కడే నిర్బంధించాడు. దీనిపై చంద్రశేఖర్ ఫిర్యాదుతో విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రెడ్డికాలనీ, అక్టోబరు 1: రెడ్డికాలనీలోని ఓ ఇంట్లో పేకాడుతున్న ఆరుగురిని మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ తెలిపారు. ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు రెడ్డికాలనీలో పేకాటడుతున్న ఆరుగురిని కేయూ పోలీసుల సమక్షంలో పట్టుకొని వారి నుంచి రూ.20, 820 నగదు, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్స్‌పెక్టర్ శ్రీధర్ తెలిపారు.

క్రీడా దుస్తుల పంపిణీ

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 1: ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయస్థాయి జూడో పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు మంగళవారం డీఈవో డి.వాసంతి క్రీడా దుస్తు లు పంపిణీ చేశారు. ఎస్‌జీఎఫ్‌ఐ సెక్రెటరీ దస్రునాయక్, పీడీలు రాజునాయక్, వేణుగోపాల్‌రెడ్డి, కిషన్ నాయక్, కైలాష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాడ్రా ఎప్పుడొచ్చేను ?

(5వ పేజీ తరువాయి)

రంగాశాయిపేట చెరువులతో పాటు నగరంలోని, శివారులోని చెరువులు, కుంటల్లో కబ్జారాయుళ్ల తిష్టవేసి చెరువులనే మింగేస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. అలాగే మురికి కాలువలను కూడా వదలకుండా ఓరుగల్లు నగరంలో కబ్జాకోరులు తిష్టవేశారు. హనుమకొండ పట్టణంలోని నయీంనగర్ నాలా-1, నయీంనగర్ నాలా- 2, భద్రకాళి నాలా, బొందివాగు నాలాను ఇరువైపుల అక్రమించేశారు. హనుమకొండ, వరంగల్ నగరంలో ఈ నాలుగు నాలాలకు ఇరువైపు వందల కోట్ల విలువైన భూములను కబ్జా చేసి 524 అక్రమ నిర్మాణాలు చేసినట్లుగా కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. అయితే వీటిలో కేవలం 107 అక్రమ కట్టడాలనే కూల్చివేశారు. ములుగు రోడ్డు సమీపంలో భద్రకాళి నాలాకు సంబంధించిన సుమారు 40ఎకరాల భూములను అక్రమించుకుని దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపట్టారనే ప్రచారం జరుగుతోంది. ఆధ్యాత్మిక నగరిగా పేరున్న వరంగల్‌లో వెయ్యికి పైగా ఆలయాలు, ఉపాలయాలున్నాయి. అయితే కబ్జాకోరులు ఆలయ భూములను కూడా వదలకుండా కబ్జా చేస్తున్నారు. నగరంలోని పద్మాక్షిమాత ఆలయం, సిద్దేశ్వరాలయం, మెట్టుగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం, మట్టెవాడలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంతో పాటు 17 ప్రముఖ ఆలయాలకు చెందిన సమారు 317ఎకరాలకు పైగా భూములు కబ్జాకు గురైనట్లుగా అధికారులు గుర్తించారు. కబ్జా భూముల్లో అక్రమార్కులు దర్జాగా ఫంక్షన్ హల్స్, కమర్షియల్ మాల్స్, పెట్రోల్ బంకులు, విద్యా సంస్థలతో పాటు అపార్ట్‌మెంట్లు, ఇంటి నిర్మాణాలను చేపట్టారు. అక్రమ నిర్మాణాలని తెలిసినా రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు విచ్చల విడిగా అనుమతులు ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది.

వైభవంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

కాళోజీ జంక్షన్, అక్టోబరు 1: స్పందన మానసిక దివ్యాంగుల, బధిరుల ఆశ్రమంలో ఒక రోజు ముందు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా అలంకరించి లయబద్ధంగా పాటలు పాడుతూ ఆటలు ఆడారు. ఈ సందర్భంగా అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ కె. అనితారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా తమ ఆత్మగౌరవాన్ని పెంచేలా బతుకమ్మ ఆటలు సాగుతాయని అన్నారు. బతుకమ్మ పండుగ మాత్రమే ప్రకృతిలోని పూలను అమ్మవారిగా కొలువడం పండుగ గొప్పదనం అని అన్నారు. మహిళలకు ఈ పండుగ ఎంతో ప్రీతికరమని గౌరమ్మ అందరి పసుపు కుంకుమలను కాపాడుతుందని తెలంగాణ ప్రజల నమ్మకమని అన్నారు. కార్యక్రమంలో ఇంకా 51వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షురాలు పెండెల శ్వేతారెడ్డి, సుచరిత, కరుకాల అర్పికారెడ్డి, హరిత, వసుధ తదితరులు పాల్గొన్నారు.

● హసన్‌పర్తి: మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అధ్యాపక సిబ్బంది, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు రంగురంగుల పూలను సేకరించి బతుకమ్మలను పేర్చి కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ మహేందర్, డాక్టర్ శ్రీవాణి, ఏవో వేణుగోపాలస్వామి, కోఆర్డినేటర్లు వేదిక, రూప్సీతో పాటు మహిళా అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

● మడికొండ: బతుకమ్మ వేడుకలు మంగళవారం వైభవంగా జరుపుకున్నారు. మడికొండలోని సెయింట్ మాథ్యూస్ హైస్కూల్‌లో విద్యార్థులు రంగురంగుల వస్త్రాలు ధరించి తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చిన బతుకమ్మలతో స్కూల్‌కు చేరుకున్నారు. స్కూల్‌లో 8 అడుగుల బతుకమ్మ ఆకర్షణీయంగా రూపొందించారు. అనంతరం 18 అడుగుల ఎత్తైన రావణాసురుడి ప్రతిమను దహనం చేశారు. మడికొండలోని మాస్టర్జీ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు మంగళవారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వయంగా రంగు రంగుల పూలతో బతుకమ్మలు పేర్చి స్కూల్ ప్రాంగణంలో ఉంచి బతుకమ్మ డీజేలో వస్తున్న బతుకమ్మ పాటలకు ఆడిపాడారు.


బతుకమ్మలతో ఏకశిలా పాఠశాల టీచర్లు


ఐనవోలులో బతుకమ్మలతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

● కాజీపేట: కాజీపేటలోని మంగళవారం పలు విద్యా సంస్థలో బతుకమ్మ వేడుకలు జరిగాయి. తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల, ఒలంపియాడ్‌స్కూల్‌లో బతుకమ్మలు ఆడారు ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ తాళ్ల చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.విజయలక్ష్మీతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. సెయింట్ గ్యాబ్రియేల్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో విద్యార్థులు దాండియా నృత్యాలు చేసి పాటలు పాడుతూ, ఆటలు ఆడారు. నాటికలు ప్రదర్శించారు.

● ఐనవోలు: ఐనవోలు, ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మలను అందంగా పేర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఐనవోలులో ఎంఈవో ఆనందం,హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు భీమాళ్ల సారయ్య, పాధ్యాయులు మహేందర్ రెడ్డి, లక్ష్మి, విజయ, రేవతి, భవన్‌కుమార్, ఏపీసీ అధ్యక్షురాలు అనిత, ఒంటిమామిడిపల్లిలో హెచ్‌ఎం ప్రతాప్ రత్నకుమార్, ఏపీసీ అధ్యక్షురాలు సకీనాబీ, ఉపాధ్యాయులు యాదయ్య, శ్రీనివాస్, ఆరోగ్యమ్మ, ఉషాశ్రీ, లలిత, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, మంజూల, రోజమ్మ, రాజనంద్, స్వప్న, రాజమాత, యమున, రోజారాణి, విజయకుమారి, భారతి, దినేష్, ప్రవళిక, విద్యాకమిటీ బాధ్యులు గోనె రాజు, గూడ రాజు, ఆనందం, మహ్మద్ రఫీ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పెండ్లి నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

● రెడ్డికాలనీ: రెడ్డికాలనీలోని ఏకశిల కాన్సెప్ట్ స్కూల్‌లో మంగవారం బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. విద్యార్థినులు వివిధ రకాలను పూలను బతుకమ్మగా పేర్చి ఉయ్యాల పాటల మధ్య ఆనందంగా బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఆడపడుచులకు అత్యంత ఇష్టమైన బతుకమ్మ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వప్నరెడ్డి, ఉపాధ్యాయులు శోభ, జయ, హరిత, పావని, విజయలక్ష్మి, సుకన్య, కావ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.


స్పందన ఆశ్రమంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

ఐనవోలు, అక్టోబరు 1: హిందువుల మనోభావాలను గాయపరిచే అనుచిత వాఖ్యలను మానుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ ఖండించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఐనవోలులో బడి-గుడిపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఐనవోలులో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, మాజీ ఎంపీటీసీ పెండ్లి కావ్యతిరుపతి, మాజీ ఉప సర్పంచ్ కొట్టం రాజు, నాయకులు మహేష్‌గౌడ్, రామ్‌రెడ్డి, రాజు, మహేష్, శక్తి కేంద్రం ఇంచార్జులు, భూతు అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూ దేవాలయాలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

హసన్‌పర్తి: హిందూ దేవాలయాలపై ఎమ్మెల్యే నాగరాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్‌లోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే నాగరాజు హిందూదేవాలయాలను వక్రీకరిస్తూ వక్ర బాష్యం చేయడాన్ని బీజేపీ ఖండిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ తాళ్లపెల్లి కుమారస్వామి గౌడ్, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, బీజేపీ రైల్వే బోర్డు మెంబర్ మేకల హరిశంకర్, డివిజన్ అధ్యక్షుడు మారం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం కాని సర్టిఫికెట్ల పరిశీలన

ఉదయం నుంచి పడిగాపులు కాసి వెనుదిరిగిన డీఎస్సీ అభ్యర్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 1: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం ప్రారంభం కాలేదు. దీంతో ఉదయం 10.30 గంటలకే రెండు జిల్లాల సర్టిఫికెట్ కేంద్రాలైన ప్రభుత్వ డైట్ కళాశాల, సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభ్యర్థులు పడిగాపులు కాశారు. అయితే వరంగల్, హనుమకొండ జిల్లాల డీఈవోలకు సైతం 1:3 ప్రాతిపదికన జాబితాలు ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయంలో ఉన్నారు. రాత్రి ఎనిమిది గంటల వరకు అభ్యర్థులు, అధికారులు జాబితాల కోసం ఎదురు చూశారు. అయినప్పటికీ జాబితాలు రాకపోవడంతో అధికారులు చేసేదేమీ లేక అభ్యర్థులను పంపించి వేశారు. జాబితాల కోసం రాత్రి వరకు ఎదురుచూసిన అభ్యర్థులు.. అసహనం వ్యక్తం చేశారు. 1:3 ప్రాతిపదికన ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం వారి మొబైల్ ఫోన్లకు సమాచారం చేరవేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. స్థానిక డీఈవోలు మాత్రం డీఈవో వెబ్ సైట్లలో జాబితాలు చూసి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రావా ల్సిందిగా అభ్యర్థులకు సూచించారు. బుధవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం కానుంది.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

కాజీపేట, అక్టోబరు 1 : ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఒంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దర్గా కాజీపేటకు చెందిన నెలికంటి రాకేశ్ (35) ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో ఉన్నట్టు తెలుస్తోంది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని స్వాధీ నం చేసుకుని మంగళవారం ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగిం చినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.


రాకేశ్ (ఫైల్)

నలుగురు ఎస్సైల బదిలీ

హనుమకొండ టౌన్, అక్టోబరు 1: కమిషనరేట్ పరిధిలో నలుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ
1. ఎస్‌కే.హమీద్	వీఆర్	బచ్చన్నపేట
2. కె.సతీష్	బచ్చన్నపేట	ఐటీ కోర్, కమిషనరేట్
3. బి.చందర్	సీఎస్‌బీ వరంగల్ అటాచ్డ్	వర్ధన్నపేట
4.ఎ.ప్రవీణ్‌కుమార్	వర్ధన్నపేట	కేయూసీ పీఎస్

ఎమ్మెలే నాగరాజు రాజీనామా చేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్

హనుమకొండ టౌన్, అక్టోబరు 1: కేవలం మాలల ఓట్లతోనే గెలిచానని విర్ర వీగుతూ మాదిగలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వర్ధన్న పేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి పోటీ చేసి గెలవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ డిమాండ్ చేశారు. మంగ ళవారం నయీంనగర్‌లోని లష్కర్‌సింగారంలో జరిగిన సమావేశంలో సుకు మార్ మాట్లాడుతూ..
రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి కేవలం మాల కులా లకు చెందిన నాయకుడిగా మాట్లాడుతున్న కేఆర్ నాగరాజు తక్షణమే పదవి నుంచి వైదొలగాలన్నారు. మంత్రి పదవి కోసం కేఆర్.నాగరాజు ఆడుతున్న నాటకాన్ని మాల సమాజం గ్రహించాలని కోరారు. మందకృష్ణ మాదిగ ఏనా డూ మాలలకు టికెట్లు ఇవ్వొద్దని అనలేదని, జానాభా దామాషా ప్రకారం మాత్రమే మాదిగలకు టికెట్లు ఇవ్వాలన్నారని గుర్తు చేశారు. సుప్రీం కోర్టు తీర్పును హేళన చేస్తూ మాట్లాడిన నాగరాజుపై సుమోటోగా చర్యలు తీసుకో వాలని కోరారు. ఎస్సీల వర్గీకణకు అనుకూలంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని సైతం లెక్కచేయని నాగరాజుపై సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మంద స్వరాజ్, రజినికుమార్, ఎర్ర రాము, బొక్క రాజేశ్, మట్టెడ అనిల్, భిక్షపతి, ఎల్లేశ్, సుధాకర్ బాబు, రాజేందర్, నరేశ్, వసంత్, సుధాకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయడం అభినందనీయం

రెడ్‌క్రాస్ రక్తదానం శిబిరంలో కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 1: యువకులు రక్తదానం చేయడం అభినందనీయమని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో అహ్మదీయ, నేతాజీ యువ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆపదలో ఉన్న వారికి ఉపయోగపడే విధంగా ఆరోగ్యంగా ఉన్న ప్రతీ ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి కలెక్టర్ ప్రావీణ్య సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీలోని తలసేమియా వ్యాధిగ్రస్తులకు కలెక్టర్ పండ్లు పంపిణీ చేశారు. సుమారు 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు పొట్లపల్లి శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ డాక్టర్ డాక్టర్ జి.కిషన్‌రావు, యువనేతాజీ ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్‌కుమార్, అహ్మదీయ యూత్ అసోసియేషన్ నాయకులు ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల డే కేర్ సెంటర్ ప్రారంభం

హనుమకొండ సిటీ: హనుమకొండ జడ్పీ కార్యాలయ ఆవరణలో వృద్ధుల డేకేర్ సెంటర్‌ను కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభిం చారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళ వారం ఈ కార్యక్రమం జరిగింది. డే కేర్ సెంటర్ ప్రారంభోత్సవ అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఫిజియోథెరపీతో పాటు వసతు లను సెంటర్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వృద్ధులకు ఎంతో అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి రాజమణి మాట్లాడుతూ.. వృద్ధుల ఫిర్యాదుల పరిష్కారం కోసం రెం డు ట్రిబ్యునళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రతీ ఒక్కరు వృద్ధుల పట్ల గౌరవంగా ఉండాలని జడ్పీ సీఈవో విద్యాలత సూచిం చారు. కార్యక్రమం ముగింపులో కలెక్టర్ ప్రావీణ్య వృద్ధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, వాసుదేవాచారి, డాక్టర్ చంద్రమౌలి, ప్రవీణ్‌కుమార్, లక్ష్మీకాంతరెడ్డి, విశ్వజ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

6న భారత్ గౌరవ్ టూరిస్ట్ స్పెషల్ రైలు

» 8 రాత్రులు, 9 రోజుల పాటు యాత్ర
» సద్వినియోగం చేసుకోవాలి : ఐఆర్‌సీటీసీ ఎగ్జిక్యూటీవ్ పవన్

కాజీపేట, అక్టోబరు 1: ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 6న కాజీపేట మీదుగా భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు, దివ్య దక్షిణ్ యాత్ర విత్ జ్యోతిర్లింగ పేరుతో ఈ రైలు ఏర్పాటు చేసింది. ఈ యాత్ర 8 రాత్రులు, 9 రోజుల పాటు కొనసాగనుంది. షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి. తొలిరోజు సికింద్రాబాద్‌లో ఈ నెల 6న మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి మరునాడు ఉదయం 4.40 నిమిషాలకు రేణిగుంటకు చేరుకుంటుంది. ఈ రైలు భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూర్, గూడూర్ రైల్వేస్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యాం కల్పించారు. రెండో రోజు తిరువన్నమలై, మూడో రోజు కుడైనగర్, నాలుగోరోజు రామేశ్వరం, ఐదో రోజు కన్యాకుమారి, ఆరో రోజు కన్యాకుమారి కొచ్చువెల్లి ట్రెసిటీ, ఏడోరోజు త్రిచీ తంజాపూర్ ప్రదేశాలో ప్రయాణం సాగుతుంది. 8వ రోజు రైలు తిరుగు ప్రయాణం సాగి తొమ్మిదోరోజు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది.. కాగా, లాడ్జింగ్, బోర్డింగ్‌తో సహా స్లీపర్‌లో ఒకరికి రూ.14,250, సెకండ్ ఏసీలో రూ.21,900, థర్డ్ ఏసీలో రూ.28,450 ఉంటుంది. బుకింగ్ కోసం www.irctctourism.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

చారిత్రక ప్రదేశాలను సందర్శింపజేయడమే లక్ష్యం

రైలు పర్యాటకులకు చారిత్రాత్మక ప్రదేశాల, ఆధ్యాత్మిక ప్రాంతాలు సందర్శింప చేయడమే ఇండియన్ రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ లక్ష్యమని ఐఆర్‌సీటీసీ లక్ష్యమని టూరిజం ఎగ్జిక్యూటీవ్ పవన్ అన్నారు. మంగళవారం కాజీపేట రైల్వే వీఐపీ లాంజ్‌లో టూరిజం రైలు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి కుసుమ సూర్యకిరణ్, టూరిజం మానిటర్‌లు ఎం.శ్రీకాంత్, కె.ప్రశాంత్ పాల్గొన్నారు. టూరిజం ఇతర వివరాలకోసం 92810 30749, 92810 30750 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పెద్దపెండ్యాల విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధర్మసాగర్, అక్టోబరు 1: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక అయినట్టు ప్రధానోపాధ్యాయుడు బత్తిని రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం కాజీపేటలోని సెయింట్ గాబ్రియల్ స్కూల్‌లో జిల్లాస్థాయి అండర్ 17 విభాగంలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు లక్ష్మి, శ్వేత, అభినవవర్షిని, నికిత, రవళి. సాయిచరణ్‌లు ఈనెల 6న మెదక్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో తలపడనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ మైదంశెట్టి రమేష్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఊరేగింపుల్లో డీజే నిర్వహణ నిషేధం : సీపీ

హనుమకొండ టౌన్, అక్టోబరు 1: వరంగల్ పోలీస్ కమిషరేట్‌లో డీజే వినియోగాన్ని నిషేధిస్తూ సీపీ అంబర్ కిషోర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీజేల నుంచి ఉత్పన్నమయ్యే అధిక డెసిబెల్స్ కారణంగా ప్రజలు, ముఖ్యం వృద్ధుల ఆరోగ్యం దెబ్బతింటుందన్న దృష్ట్యా ఇకపై కమిషనరేట్ పరిధిలోని మతపరమైన ఊరేగింపుల్లో డీజే, బాణాసంచా పేలుళ్లను నిషేధిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

టీపీఎఫ్ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలి

జిల్లా కన్వీనర్ రమాదేవి

వడ్డెపల్లి, అక్టోబరు 1: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 9న నిర్వహించే తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) 15వ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని టీపీఎఫ్ జిల్లా కన్వీనర్ బి.రమాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టీపీఎఫ్ ఆవిర్భావ సభకు సంబంధించిన కరపత్రాలను జిల్లా కమిటీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. కేసీఆర్ సీఎంగా కొనసాగిన సమయంలో టీపీఎఫ్‌పై తీవ్ర నిర్బంధం అమలు చేశారని అన్నారు. ఈ ఆవిర్భావ సభలో ప్రజా సంఘాల నాయకులు, టీపీఎఫ్‌తో పాటు కవులు, కళాకారులు హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో టీపీఎఫ్ జిల్లా నేతలు జనగాం కుమారస్వామి, పాకాల వెంకన్న, ఉదయ్‌సింగ్, భద్రులాల్, యాదగిరి, ప్రజా సంఘాల నాయకులు చారువాక విజయ్, కుమారస్వామి, రామన్న, రమేష్, కనకరాజు, చేరాలు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
బుధవారం
2 అక్టోబరు 2024

నవ్య

కుటుంబ కదంబం



ఫ్యాషన్

సెక్విన్లు దుస్తుల్లో ఒక భాగంగా కాకుండా, సెక్విన్లతో తయారైన దుస్తులే ఫ్యాషన్‌గా రాజ్యమేలడం మొదలుపెట్టాయి. లెహంగాలు, సూట్స్, చీరలు... ఇలా అన్ని రకాల దుస్తుల్లో సృజనాత్మకతతో మెరుపులు చిందిస్తున్న సెక్విన్ సెన్సేషన్ ఫ్యాషన్ మీకోసం!

సెక్విన్ సెన్సేషన్

తగిన మ్యాచింగ్‌తో...

లెహంగా, చీరలు, చుడీదార్లు, జాకెట్స్.. ఇలా అటు ఆధునిక వస్త్రధారణకూ, ఇటు సంప్రదాయ చీరలకూ సెక్విన్లు కొత్త హంగులను తెచ్చిపెడుతున్నాయి. ధరతో పాటు మెరుపు కూడా పెరిగిపోయే సెక్విన్లు డిజైన్ చేసే తీరు కూడా వినూత్నంగా ఉంటుంది. సౌకర్యంగా, సుతి మెత్తగా ఉంటూనే, నచ్చినట్టు డిజైన్ చేసుకోగలిగే సౌలభ్యం ఉన్న సెక్విన్లు అందుబాటులోకి రావడంతో వేడుకకు తగ్గట్టు దుస్తుల్ని డిజైన్ చేసుకునే ధోరణి కూడా పెరిగింది. అలాగే దాదాపు అన్ని రకాల పరిమాణాలు, రంగుల్లో సెక్విన్లు తయారవుతున్నాయి. కాంట్రాస్ట్ కలర్ సెక్విన్లు దుస్తుల్ని మరింత ఆకట్టుకునేలా కనిపించేలా చేస్తాయి. కాబట్టి ప్రత్యేకంగా కనిపించాలనుకునేవాళ్లు ఈ తరహా సెక్విన్ వర్క్ ఎంచుకోవాలి.

ప్రముఖులు మెచ్చే ఫ్యాషన్

మెరిసే దుస్తులను చిన్నతనంగా భావించే రోజులు పోయాయి. వీలైనంత మెరుపులు వెదజల్లే దుస్తులు ధరించడమే లేటెస్ట్ ఫ్యాషన్. ఫ్యాషన్ ట్రెండ్‌ను దగ్గరి నుంచి గమనించే వాళ్లకు ఈ సెక్విన్ ఫీవర్ ఎంతలా పూనిందో తేలికగానే అవగతమైపోతుంది. ఒంటికి హత్తుకున్న సిల్వర్ సెక్విన్ గౌన్ వేసుకుని, ప్యారిస్ ఫ్యాషన్ వీక్‌లో మెరుపులు చిందించిన, ప్రముఖ మోడల్, కైలీ జెన్నర్ మొదలు, అర్పితా మెహతా డిజైన్ చేసిన ఎరుపు చీర కట్టిన సమంతా రూత్ ప్రభు వరకూ సెక్విన్ లుక్‌ను దాదాపు మహిళలందరూ ఇష్టపడడం మొదలుపెట్టారు. మరీ ముఖ్యంగా ఈవినింగ్ పార్టీలు, లైట్ల వెలుగులతో మెరిసిపోయే వేడుకలకు సెక్విన్ దుస్తులు చక్కగా సూటవుతాయి. కాబట్టే సెక్విన్ ట్రెండ్ సెన్సేషన్‌గా మారింది.



యాక్సెసరీస్ ఆచితూచి

భారీ ఝుంకాలు, బ్రేస్‌లెట్లు ఈ తరహా దుస్తులతో మ్యాచ్ చేసుకోవచ్చు. అలాగే కాళ్లకు వేసుకునే హైహీల్స్ కూడా సెక్విన్ వర్క్ కలిగి ఉన్నవైతే ఇంకా బాగుంటుంది. ఇక చేతిలో మెరుపులీనే సెక్విన్ పర్స్, గోళ్లకు చమ్కీ నెయిల్ పెయింట్, పెదవుల మీద గ్లిట్టర్ లిప్‌స్టిక్, కనురెప్పలు, చుబుకాల మీద గ్లిట్టర్ బ్లష్ ధరిస్తే, ఆకాశంలో తారలా వెలిగిపోవచ్చు. అమెరికన్ డైమండ్స్‌తో తయారైన జ్యువెలరీ ఈ తరహా దుస్తులకు చక్కగా నప్పుతుంది.

వేడుక

పూలజాతర వచ్చేసింది

నేడు ఎంగిలిపూల బతుకమ్మ

తెలంగాణ గ్రామీణ సంస్కృతికి అద్దంపట్టే, ప్రకృతితో మమేకమయ్యే సంబరం... బతుకమ్మ పండుగ. ఈ వేడుకలు ప్రతి యేటా భాద్రపద అమావాస్య... అంటే మహాలయ అమావాస్య (పెతర మాసం) నాడు ప్రారంభమవుతాయి. ఈ సంబరాల్లో బతుకమ్మ



లను రోజుకో పేరుతో కొలుస్తారు. పూలతో చక్కగా బతుకమ్మను పేర్చి, తమలపాకులు ఉంచి, పసుపుతో తయారు చేసిన బతుకమ్మను దానిపై పెట్టి పూజలు చేస్తారు. ఈ తొమ్మిది రోజులూ రకరకాల ప్రసాదాలను బతుకమ్మకు నివేదిస్తారు. మొదటి రోజున ఎంగిలి పూల బతుకమ్మ అలంకరణ కోసం ముందురోజే రకరకాల పువ్వులు కోసుకొని తీసుకొచ్చి, నీళ్లలో వేస్తారు. మర్నాడు వాటితో బతుకమ్మను అలంకరిస్తారు. అందుకే 'ఎంగిలిపూల బతుకమ్మ' అంటారు.

ఈ రోజు నైవేద్యం: నువ్వులు, నూకలు లేదా బియ్యం, బెల్లం

శ్రీశక్తి



ప్రపంచంలోని సంపన్న వ్యాపార సామ్రాజ్యాల్లో ఒకటైన 'ఆదిత్య బిర్లా గ్రూప్'కు వారసురాలు... ఆ వారసత్వాన్ని నిలబెడుతూనే... తానేంటో నిరూపించుకున్నారు. సొంత కంపెనీలు ప్రారంభించి... వాటిని లాభాల బాట పట్టించారు. గాయనిగా పాటల తోటలో విహరిస్తూనే... తిరుగులేని పారిశ్రామికవేత్తగా ఎదిగారు. నవతరం నారి అనన్యా బిర్లా జర్నీ ఇది.



రంగం ఏదైనా కృషి 'అనన్య'ం

'ఆదిత్య బిర్లా గ్రూప్' చైర్మన్ కుమార్ మంగళం బిర్లా పెద్ద కుమార్తె అనన్యా బిర్లా. తల్లి నీరజ. బిర్లా వంశంలో ఐదో తరానికి చెందిన 30 ఏళ్ల అనన్య... చిన్నప్పుడే సంగీతంతో ప్రేమలో పడ్డారు. పదకొండేళ్లకు సంతూర్ వాయిద్యంపై సాధన మొదలుపెట్టారు. గాత్ర సంగీతంతో పాటు గిటార్, పియానో అభ్యసించారు. ముంబయి 'అమెరికన్ స్కూల్ ఆఫ్ బాంబే'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె... బ్రిటన్ వెళ్లి 'ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం' నుంచి ఎకనామిక్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పట్టా పొందారు. స్వతంత్ర భావాలతో పెరిగిన అనన్య... స్వయం కృషితో ఎదగాలనే పట్టుదలతో అడుగులు వేశారు.

'ఒక వారసురాలిగా వంశం పేరు నిలబెట్టడం ఎంత ముఖ్యమో... నేను నేనుగా ఉండడం కూడా అంతే ముఖ్యం. లేకపోతే మనం చేసే పనికి అర్థం ఉండదు' అంటూ ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన అనన్య... అందుకు తగినట్టే రెండు పడవల మీద కాలు పెట్టారు. అభిరుచికి తగినట్టు అటు సంగీత ప్రపంచంలో తనను తాను నిరూపించుకున్నారు. అలాగే అవకాశం ఉంది కదా అని వ్యాపార రంగంలో ఒక్కసారిగా అందలం అందుకోవాలని అనుకోలేదు. ఒక్కో మెట్టు ఎక్కుతూ, అన్నింటా పట్టు సాధించారు. అదే ఆమె విజయానికి బలమైన పునాదులు వేసింది.

సంగీతం వైపు పయనం...

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదివే రోజుల్లోనే అనన్య తన సంగీతాభిరుచికి పట్ట కట్టారు. అక్కడి క్లబ్‌లు, పబ్బుల్లో పాటలు పాడేవారు. గిటార్ వాయించేవారు. కొంతకాలానికి సొంతంగా లిరిక్స్ రాయడం కూడా మొదలుపెట్టారు. అమెరికా పాప్ గాయకుడు, నిర్మాత జిమ్ బీన్జ్‌తో కలిసి తొలి సింగిల్ 'లివిన్ ది లైఫ్' రూపొందించారు. 'పీఎం-ఏఎం రికార్డింగ్స్' ద్వారా భారత్‌కు చెందిన గాయకుల ఆల్బమ్ ప్రపంచ వ్యాప్తంగా విడుదల కావడం అదే మొదటిసారి. యూట్యూబ్‌లో సూపర్ హిట్. 14 మిలియన్ల మంది వీక్షించారు. అదే ఏడాది మరో ఇంగ్లీష్ సింగిల్ 'మెంట్ టూ బీ' వదిలారు. ఈ పాట కూడా విశేషంగా ఆకట్టుకుంది. అలా ఇప్పటికి దాదాపు ముప్పై ఆల్బమ్స్ చేశారు. చివరగా ఈ ఏడాది '24' పేరుతో రీమిక్స్ విడుదలైంది. అజయ్‌దేవ్‌గణ్ 'రుద్ర' వెబ్‌సిరీస్‌లో తొలిసారి తెరపై మెరిసిన అనన్య... 'షోక్: ది దేశీ షెర్లాక్'లో పూర్తి నిడివి గల పాత్ర పోషించారు. ప్రముఖ పాప్ గాయకులతో కలిసి ఎన్నో స్టేజ్ షోలు ఇచ్చారు. టోక్యో ఒలింపిక్స్ కోసం భారత అథ్లెట్లను ఉత్సాహపరిచేందుకు రూపొందించిన అధికారిక పాట 'హిందుస్థానీ వే'ను ప్రసిద్ధ సంగీత దర్శకుడు ఏఆర్ రహమాన్‌తో కలిసి ఆలపించారు. సాహిత్యంలో కూడా భాగం అయ్యారు. ఇలాంటి అరుదైన ఘట్టాలెన్నో ఆమె సంగీత జీవితంలో ఉన్నాయి. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చాయి.

పదిహేడేళ్లకే సొంత కంపెనీ...

పాటల ప్రపంచంలో తనను తాను నిరూపించుకున్న అనన్య... 17 ఏళ్లకే పారిశ్రామికవేత్తగా తన ప్రస్థానం ప్రారంభించారు. 2012లో 'స్వతంత్ర మైక్రోఫిన్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో కంపెనీ ఒకటి ప్రారంభించారు. గ్రామీణ మహిళలకు చిన్నమొత్తాల్లో రుణాలు ఇచ్చే సంస్థ ఇది. దీనికి గానూ ఉత్తమ అంకుర సంస్థగా నాడు అవార్డును కూడా అందుకున్నారు అనన్య. 'స్వతంత్ర' గత ఏడాది 1,479 కోట్లకు 'చైతన్య ఇండియా ఫిన్ క్రెడిట్ లిమిటెడ్'ను హస్తగతం చేసుకుంది. అనతికాలంలో దేశంలోనే రెండో అతిపెద్ద నాన్ బ్యాంకింగ్ మైక్రోఫైనాన్స్ కంపెనీ స్థాయికి దాన్ని తీసుకువెళ్లారు. మైక్రో ఫైనాన్స్ రంగంలో ఆమె సాధించిన విజయాలు ఎన్నో. ఈ ఏడాది 'ఫార్చ్యూన్ ఇండియా' ప్రకటించిన '40 అండర్ 40'లో ఆమెకు చోటు దక్కింది.

ఉద్యోగిగా మొదలై...


ఆక్స్‌ఫర్డ్‌లో చదివేటప్పుడు మానసిక ఒత్తిడికి లోనయ్యే విద్యార్థుల కోసం హెల్ప్‌లైన్ ఉండేది. ఆ స్ఫూర్తితో బ్రిటన్ నుంచి తిరిగి వచ్చాక 'అనన్యా బిర్లా ఫౌండేషన్' స్థాపించారు. భారత్‌లోని యువతలో మానసిక భయాందోళనలు తొలగించే లక్ష్యంతో ఇది ఏర్పాటైంది. అలాగే 'ఐకాయ్ అసాయ్' పేరుతో డిజైనింగ్ కంపెనీ ఒకటి నెలకొల్పారు. అంతేకాదు... మాతృ సంస్థ బిర్లా గ్రూప్‌కు చెందిన హిండాల్కో, గ్రాసిమ్, ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రీటైల్, మేనేజ్‌మెంట్ కార్పొరేషన్'లకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో ఒకరిగా కొనసాగుతున్నారు. తమ కంపెనీలో ఒక ఉద్యోగిగా చేరిన ఆమె... క్రమంగా అన్ని విషయాలనూ ఆకళింపు చేసుకున్నారు.

"మా నాన్నకు ముందే చెప్పాను... 'మన గ్రూప్‌లో నాకు అధికారిక హోదా ఏదీ వద్దని. ఎందుకంటే ఆ హోదా నన్ను నియంత్రిస్తుంది. అది నాకు సంతోషాన్ని ఇవ్వదు. నేను కష్టపడి పని చేయాలని అనుకొంటున్నాను. నా పని ప్రభావవంతంగా ఉండాలి. అది చూసి నా చుట్టూ ఉన్నవారు స్ఫూర్తి పొందాలి' అని"... ఇదీ అనన్యకు వృత్తి పట్ల ఉన్న నిబద్ధత. ఆమె మార్గదర్శకత్వంలోనే 'ఆదిత్య బిర్లా గ్రూప్ డిజిటల్' ఫిన్‌టెక్ యాప్ రూపుదిద్దుకుంది. ప్రస్తుతం మూడున్నర కోట్ల మందికి పైగా కస్టమర్లకు ఆర్థిక సేవలు అందిస్తోందంటే అది అనన్య కృషి ఫలితమే. 'తొలినాళ్లతో పోలిస్తే ఇప్పుడు నేను ఎంతో ఎదిగాను. నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అయితే ఇప్పటికీ నేను అదే వ్యక్తిని. నేను ఏంటనేది నేను కాదు... నా పనితనమే చెప్పాలి" అంటున్న అనన్య మరికొన్ని కొత్త ప్రాజెక్టుల పనిలో మరింత బిజీ అయ్యారు.

టైం మేనేజ్‌మెంట్‌తో సక్సెస్

ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో వేగంగా లక్ష్యాలను చేరుకోవలన్నా, అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నా టైం మేనేజ్‌మెంట్ ఉండాల్సిందే. టైం మేనేజ్‌మెంట్ వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఒత్తిడి తగ్గుతుంది. వర్క్, పర్సనల్ లైఫ్ బ్యాలెన్స్ అవుతుంది. ఇంకా...

టైమ్ మేనేజ్‌మెంట్ లక్ష్యాలను త్వరగా చేరుకునేందుకు ఉపయోగపడుతుంది. వ్యాపారవేత్తలకు, ఉద్యోగస్తులకు, నాయకులకు... టైమ్ మేనేజ్‌మెంట్ చాలా అవసరం. సమయాన్ని సరిగ్గా ఉపయోగించుకుంటే వర్క్, పర్సనల్ లైఫ్ బ్యాలెన్స్ చేసుకోవడంతో సంతోషాన్ని రెట్టింపు చేసుకోవచ్చు. సమయ నిర్వహణ ఒత్తిడిని తగ్గిస్తుంది. లక్ష్యాలను సులువుగా, వేగంగా చేరుకునేందుకు సహాయపడుతుంది. మంచి టైమ్ మేనేజ్‌మెంట్‌తో పెద్ద పెద్ద అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. చెమటోడ్చకుండా, స్మార్ట్‌గా పనిచేసేందుకు టైమ్ మేనేజ్‌మెంట్ సహాయపడుతుంది. షెడ్యూల్‌లోపల ముఖ్యమైన పనులు పూర్తి చేసుకోవచ్చు. సమయ నిర్వహణ వల్ల టైమ్, ఎనర్జీ మీ కంట్రోల్‌లో ఉంటాయి. దీనివల్ల అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చు.



ఒత్తిడి దూరం

సమయ నిర్వహణ వల్ల ఒత్తిడి తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. డెడ్‌లైన్ లోపల పనులు పూర్తవుతాయి. అంతేకాకుండా అలసిపోయిన ఫీల్ రాకుండా ఉంటుంది. టైమ్‌ని ఎలా ఇన్వెస్ట్ చేయాలో కాన్ఫిడెంట్‌గా ఉంటారు. ఏ టైమ్‌కి ఏ పని చేయాలో పక్కాగా ఉంటారు. దీనివల్ల రాత్రుళ్లు మంచి నిద్ర పోతారు. వర్క్ లైఫ్ బ్యాలెన్స్ చక్కగా ఉంటుంది. ఫలితంగా రిలేషన్‌షిప్స్ బాగుంటాయి. పనిపై ఫోకస్ పెరగడం వల్ల పెద్ద పెద్ద అవకాశాలను అందిపుచ్చుకుంటారు. ప్రాజెక్టులపై మరింత సమయం వెచ్చించే అవకాశం దక్కుతుంది.

ప్లానింగ్ ఉంటే...

ప్రతిరోజూ చేయాల్సిన ముఖ్యమైన పనులను పేపర్‌పై ప్రాధాన్యత క్రమంలో రాసుకోవాలి. దీనివల్ల ముఖ్యమైన పనులను ఏ రోజున, ఏ సమయంలోగా పూర్తి చేయాలనే విషయంపై అవగాహన వస్తుంది. పనికి అనుగుణంగా ప్రణాళిక తయారుచేసుకోవాలి. సమయానికి తగినట్టుగా మార్పులు చేసుకోవాలి. ప్రతిరోజు కొంత సమయాన్ని ముఖ్యమైన పనుల కోసం వినియోగించుకోవాలి. అందుకు తగ్గట్టుగా ప్రణాళిక వేసుకోవాలి. ఉదయం లేవగానే ఆ రోజు చేయాల్సిన పనులను ఒకసారి చెక్ చేసుకుని, అందులో ముఖ్యమైన పని ఏమిటో గుర్తించి దాన్ని ముందుగా పూర్తి చేయడానికి ప్రయత్నించాలి. సమయం సరిపోదని తెలిసినపుడు గడువులోగా పని పూర్తి చేస్తామని ప్రామిస్ చేయకూడదు. సమయాభావం వల్ల పని పూర్తి చేయలేకపోయినప్పుడు మీపై దురభిప్రాయం ఏర్పడే అవకాశం ఉంటుంది.

వృథా కానివ్వద్దు

సమయం తక్కువగా ఉన్నప్పుడు, పనిని తప్పకుండా పూర్తి చేయాల్సిన అవసరం ఉన్నప్పుడు కొలీగ్స్ సహాయం తీసుకోవాలి. పనిని షేర్ చేసుకోవడం మూలంగా త్వరగా పూర్తి చేయవచ్చు. ఫోన్‌లో గంటల తరబడి మాట్లాడటం, సోషల్ మీడియాలో ఎక్కువ ఉండటం వల్ల సమయం వృథా అవుతూ ఉంటుంది. కాబట్టి ఆఫీస్ పని వేళల్లో వాటి వాడకం తగ్గించుకోవాలి. ఏ పనిలోనైనా ఆటంకాలు ఉంటాయి. వాటిని సకాలంలో ఎలా అధిగమించాలో తెలుసుకోవాలి. అప్పుడే విజయం వరిస్తుంది.

పడకగది సర్దుకోండిలా...

పడకగది చిందరవందరగా ఉంటే చిరాకొస్తుంది. దాని ప్రభావం నిద్రపై పడుతుంది. కాస్త ఓపికతో సర్దుకుంటే పడకగది చిన్నగా ఉన్నా ఇబ్బంది లేకుండా వస్తువులను సర్దుకోవచ్చు. నిపుణులు సూచిస్తున్న సలహాలు ఇవి...

బెడ్ స్టోరేజ్

ప్రతి ఇంట్లో డబుల్‌కాట్ బెడ్స్ ఉంటాయి. ప్రస్తుతం బెడ్స్ కింద స్టోరేజ్ సదుపాయం ఉండే మంచాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. దాదాపు అన్ని ఫర్నిచర్ షాపుల్లో ఇవి లభిస్తున్నాయి. వీటిని ఎంచుకుంటే బెడ్స్ కింద స్టోరేజ్ బాక్సుల్లో బట్టలు, ఇతర వస్తువులు సర్దుకోవచ్చు. వీటితో చాలా వరకు బెడ్‌రూమ్ క్లట్టర్ ఫ్రీ అవుతుంది. రెండు బెడ్స్‌కు కలిపి నాలుగు స్టోరేజ్‌బాక్స్‌లు వస్తాయి. ఒక్కో బాక్స్‌లో ఒక్కోరకమైన వస్తువులు, దుస్తులు సర్దుకోవాలి. బెడ్ కన్నా కాస్త ఎత్తులో ఫ్లోటింగ్ షెల్ఫ్లు ఏర్పాటు చేసుకుంటే పుస్తకాలు, డెకరేటివ్ ఐటమ్స్, పర్సనల్ మెమెంటోస్‌ను సర్దుకోవచ్చు.



వార్డ్‌రోబ్స్

బెడ్‌రూమ్‌లో ఉన్న స్థలం, మీ అవసరాలను దృష్టిపెట్టుకుని దానికనుగుణంగా వార్డ్‌రోబ్స్ తయారుచేయించుకోవాలి. వాటిలో షెల్ఫ్లు, డ్రాస్, హ్యాంగింగ్ రాడ్స్ ఉండేలా చూసుకోవాలి. రోజూ ఉపయోగించే కుటుంబసభ్యుల బట్టలన్నీ ఇందులో సర్దుకోవాలి. మల్టీ ఫంక్షనల్ ఫర్నిచర్‌ని ఎంచుకుంటే వస్తువులన్నీ వాటిలో సర్దేసుకోవచ్చు. జువెలరీ వంటివన్నీ సులభంగా తీసుకునేలా పెట్టుకోవాలి. అండర్‌గార్మెంట్స్ ఒకచోట సర్దుకోవాలి. గోడలకు, డోర్స్ వెనకాల హుక్స్ ఏర్పాటు చేసుకుంటే బట్టలు వేసుకోవచ్చు. బ్యాగ్స్ వేలాడదీయవచ్చు.

వాడనివి డొనేట్

ఇంట్లో ఉపయోగించని దుస్తులు చాలా ఉంటాయి. వాటిని ఇంట్లోనే పెట్టుకోవడం వల్ల స్టోరేజ్ సమస్య ఏర్పడుతుందే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు. కాబట్టి అలాంటి దుస్తులను పక్కకు తీసి ఒక బాక్స్‌లో పెట్టి డొనేట్ చేయాలి. ఇది చెప్పులు, షూస్‌కి కూడా వర్తిస్తుంది. ఫర్నిచర్ సైతం అవసరమైనది మాత్రమే ఉండేలా చూసుకోవాలి. వారానికి ఒకసారైనా బెడ్‌రూమ్‌లో వస్తువులను నీట్‌గా సర్దుకోవాలి. అప్పుడే పడకగదిలో అడుగుపెట్టగానే ప్రశాంతమైన నిద్రకు ఆస్కారం ఉంటుంది.



మొబైల్ మ్యూజిక్ క్లాస్‌రూమ్... పేద పిల్లలకు సంప్రదాయ సంగీతంలో, వాద్య పరికరాల్లో శిక్షణ ఇచ్చేందుకు మురికివాడల్లో తిరిగే స్వరాల బండి. దీనికి సారథులు ముంబయికి చెందిన అక్కాచెల్లెళ్లు కామాక్షి, విశాల. ఆ కథేమిటంటే...

అక్కాచెల్లెళ్ల మ్యూజిక్ బస్సు



ప్రతిరోజూ ముంబయిలోని సంపన్న ప్రాంతమైన నేపియన్ సీ రోడ్డు ప్రాంతం నుంచి రకరకాల డిజైన్లు వేసి ఉన్న పసుపు పచ్చ రంగు బస్సు బయలుదేరుతుంది. పోలీస్ క్యాంప్, సిమ్లానగర్, లోటస్ క్యాంప్ లాంటి పేదల బస్తీలవైపు పరుగులు పెడుతుంది. ఆ బస్సు రాకకోసం ఆ బస్తీల్లోని పిల్లలు ఆత్రుతగా ఎదురుచూస్తూ ఉంటారు. వారంలో ఏడు రోజులు... రోజుకో ప్రాంతానికి వెళ్లే ఈ బస్సు.. ఒక సంచార సంగీత పాఠశాల. ఇది కామాక్షి ఖురానా, విశాల ఖురానా అనే అక్కాచెల్లెళ్ల వినూత్న ఆలోచన. "సంగీతం విశ్వ భాష. దానికి కుల, మత, ఆర్థిక, ప్రాంతీయపరమైన వివక్షలేవీ ఉండవు. ఆస్వాదించే హృదయం ఉంటే చాలు. సంగీతం మీద ఆసక్తి ఉన్న సంపన్న, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నేర్చుకొనే స్తోమత ఉంటుంది. మరి.. పేదవర్గాల మాటేమిటి? అణగారిన వర్గాల పిల్లలకు సంగీతం మీద మక్కువ పెంచి, గాత్రంలో, వాయిద్యాల్లో శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా ఈ సంచార సంగీత పాఠశాలను మేము ప్రారంభించాం" అంటారు ఆ ఇద్దరూ.

వారి వికాసం కోసం...

బాల్యంలోనే వారి జీవితం సంగీతంతో ముడిపడిపోయింది. "మా నాన్న సంగీతం గురుముఖంగా నేర్చుకున్నారు. నాన్న పాడుతూ ఉంటే ఆయన చుట్టూ తిరుగుతూ మేమూ గొంతు కలిపేవాళ్లం. మాకు మూడేళ్ల వయసున్నప్పుడు ఒక టీచర్ దగ్గర శిక్షణ కోసం మమ్మల్ని చేర్పించారు. అప్పటి నుంచీ ఇప్పటివరకూ కొత్త రీతులు నేర్చుకుంటున్నాం, సాధన చేస్తున్నాం. హిందుస్థానీ శాస్త్రీయ సంగీతంలో బ్యాచిలర్ డిగ్రీకి సమానమైన 'విశారద' పూర్తి చేశాం. మరోవైపు సైకాలజీలో డిగ్రీలు తీసుకున్నాం. ఆ తరువాత ఏం చెయ్యాలనే ప్రశ్న ఎదురైంది. ఏది చేసినా అది సంగీతానికి సంబంధించినదే అయి ఉండాలని గట్టిగా నిర్ణయించుకున్నాం. 'సౌండ్ స్పేస్' అనే సంస్థను ఏర్పాటు చేశాం. విద్య, ఆరోగ్యం, కార్పొరేట్ రంగాల కోసం వివిధ కార్యక్రమాలు రూపొందించాం. సైకాలజీ చదివాం కాబట్టి మానసిక సమస్యలు, ఒత్తిడులు, వాటి పరిణామాల గురించి మాకు తెలుసు. వాటి పరిష్కారానికి సంగీతాన్ని సాధనంగా ఉపయోగించడం... 'సౌండ్ స్పేస్' ప్రధాన కాన్సెప్ట్" అంటారు కామాక్షి, విశాల. ఆసక్తి ఉన్నవారెవరైనా సంగీతం నేర్చుకోవడానికి అనువుగా మాడ్యూల్స్, ప్రోగ్రామ్స్ చర్చా కార్యక్రమాలు, ప్రదర్శనలకు వారు రూపకల్పన చేశారు. పాఠశాలల్లో పిల్లల అభ్యసన సామర్థ్యం పెరగడానికి, అదే సమయంలో సంప్రదాయ సంగీతంలోని సౌందర్యం వారికి పరిచయం చెయ్యడానికి వీలుగా మ్యూజిక్, సైకాలజీ బోధన కోసం ఒక ప్రణాళికను తయారు చేశారు. ఇప్పుడు ముంబయి వ్యాప్తంగా ఎన్నో పాఠశాల్లో ఈ ప్రణాళిక అమలు అవుతోంది. అలాగే ఉద్యోగులలో నెలకొన్న ఒత్తిడి తగ్గడానికి, రోగుల్లో స్వస్థత చేకూర్చడానికి కూడా ప్రోగ్రామ్స్ తయారు చేశారు. "మేము పలు ఆసుపత్రులు, కార్పొరేట్ సంస్థలతో పాటు ఎన్జీవోలతో కలిసి పని చేస్తున్నాం. గుర్తింపు కూడా బాగానే ఉంది. కానీ మురికివాడల్లో పిల్లలను చూస్తే బాధ కలిగేది. మాకు అందుబాటులో ఉన్న పిల్లలందరి జీవితాల్లో సంగీతాన్ని నింపి, వారి వికాసానికి దోహదపడాలని అనిపించింది. అందుకే 'ది సౌండ్ స్పేస్ ఆన్ వీల్స్.. ఎ మొబైల్ మ్యూజిక్ క్లాస్‌రూమ్'ను ప్రారంభించాం అని చెప్పారు కామాక్షి.



జీవిత పాఠాలు కూడా...

కిందటి ఏడాది ఆగస్టులో... వర్లీలోని లోటస్ కాలనీలో మొదటి సంగీత తరగతి నిర్వహించారు. ఆ తరువాత... వారంలో ఏడు రోజులపాటు ఏడు బస్తీల్లో ఈ బస్సు తిరుగుతోంది. అందులో సంగీత పరికరాలు ఉంటాయి. మొత్తం ఆరుగురు ఇనస్ట్రక్టర్స్ పని చేస్తున్నారు ప్రస్తుతం అయిదు నుంచి పదిహేనేళ్ల మధ్య వయసున్న పిల్లలు... 500 మందికి పైగా ఈ క్లాసులకు వస్తున్నారు. ప్రతి తరగతిలో పాతిక మంది విద్యార్థులుంటారు. కనీసం నలభై నిమిషాల పాటు బోధన, యాక్టివిటీస్ ఉంటాయి. కేవలం సంగీత పాఠాలే కాదు, జీవిత పాఠాలు, మన సంస్కృతికి సంబంధించిన అంశాలు కూడా ఈ సంచార పాఠశాలలో చెబుతున్నారు. "సామాజికంగా వెనుకబడి ఉన్న పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరగడానికి ఇది దోహదపడుతోంది. వాళ్ళు తరగతులు మానెయ్యడం చాలా అరుదు. స్తోమత ఉన్నవారికి దొరికే చాలా సౌకర్యాలకు వారు దూరంగా ఉంటారు. మావంతుగా ఈ పని చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. అంతకుముందు బడికి వెళ్ళడానికి ఇష్టపడని పిల్లలు కూడా మా ఇనస్ట్రక్టర్స్ ప్రోత్సాహంతో బాగా చదువుతున్నారు. చాలామంది మ్యుజీషియన్స్ కావాలనుకుంటున్నారు. ప్రస్తుతం దాతల ద్వారా, క్రౌడ్ ఫండింగ్ ద్వారా ఈ బస్సు నడిపిస్తున్నాం. భవిష్యత్తులో అన్ని ప్రధాన నగరాలకు ఈ కాన్సెప్ట్‌ను తీసుకువెళ్ళాలని, ఇలాంటి సంచార పాఠశాలలు మరిన్ని నడపాలని మా కోరిక" అంటున్నారీ సోదరీమణులు.

మట్కాకు ముహూర్తం కుదిరింది



వరుణ్‌తేజ్ హీరోగా నటిస్తున్న 'మట్కా' చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. 1958-82 మధ్య కాలంలో జరిగే పీరియాడికల్ మూవీ ఇది. ఇందులో వరుణ్ నాలుగు విభిన్న గెటప్స్‌తో కనిపిస్తారు. ప్రస్తుతం కీలకమైన యాక్షన్ ఎపిసోడ్‌ను దర్శకుడు కరుణకుమార్ చిత్రీకరిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా శరవేగంతో జరుగుతోందనీ, నవంబర్ 14న సినిమాను విడుదల చేస్తామనీ నిర్మాతలు డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి చెప్పారు. రిలీజ్ డేట్‌ను వెల్లడిస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో సిగరెట్ కాలుస్తూ మెట్లు దిగి వస్తున్న వరుణ్‌తేజ్ రెట్రో గెటప్ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి హీరోయిన్లు.

'శ్వాగ్' ఒక వంశానికి సంబంధించిన కథ మాత్రమే కాదు పితృస్వామ్యం అనే క్లాష్ నుంచి 15వ శతాబ్దంలో మొదలయ్యే కథ కూడా. స్త్రీ, పురుషుల్లో ఎవరు గొప్ప అనే అంశంపై చర్చించే ఆసక్తికరమైన కథ. కొత్త కథలు ఎప్పుడు వచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారనే ధైర్యంతో ఈ సినిమా చేశాం' అన్నారు శ్రీవిష్ణు. ఆయన హీరోగా నటించిన 'శ్వాగ్' చిత్రం ఈ నెల నాలుగున విడుదలవుతున్న నేపథ్యంలో మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.

మేకప్ కోసం నాలుగున్నర గంటలు



- నేనెప్పుడూ డ్యూయెల్ రోల్స్ వేయలేదు. కానీ ఇందులో నాలుగు పాత్రలు పోషించాను. అందరూ ఒకే పోలికలతో ఉండే ఒకే వంశస్తులు. ఎలా చేయాలన్నది సవాల్‌గా అనిపించింది. గెటప్స్ అన్నీ సెట్ అయ్యాక నమ్మకం కుదిరింది.. ఈ నాలుగు పాత్రల్లో సింగ పాత్ర కొంచెం ఈజీ అనిపించింది. మిగతా మూడూ కష్టమైనవే. రోజూ నాలుగున్నర గంటల సేపు మేకప్ చేసుకోవడం, దాన్ని తీయడానికి మరో రెండు గంటలు పట్టడం.. చాలా టఫ్. అయితే టీజర్‌కు వచ్చిన రెస్పాన్స్ చూసిన తర్వాత ఆ కష్టాన్ని మరిచిపోయా.
- చాలా పెద్ద కథ ఇది. దీన్ని రెండున్నర గంటల్లో చెప్పారా అని సినిమా చూశాక ప్రేక్షకులు దర్శకుడు హసిత్ గోలిని అభినందిస్తారు. కథలో భాగంగానే ఉండే వినోదం అందరినీ అలరిస్తుంది. నా కెరీర్‌లో వన్ ఆఫ్ ద టాప్ ఫిల్మ్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది.
- సినిమాలో క్యారెక్టర్ బ్యాక్ స్టోరీస్ బాగా కుదిరాయి. రీతూ వర్మ పాత్రలో మంచి ట్రాన్స్‌ఫర్మేషన్ ఉంటుంది. ఈ సినిమా చూశాక మహిళల్ని ఎక్కువ అభిమానిస్తాం. గౌరవిస్తాం.
- ఒక థ్రిల్లర్ చేస్తున్నాను. అలాగే గీతా ఆర్ట్స్‌లో ఓ మంచి ఎంటర్‌టైనర్ చేస్తున్నాను.

గోవిందాకు బుల్లెట్ గాయం



ప్రమాదవశాత్తు తుపాకి పేలిన ఘటనలో బాలీవుడ్ సీనియర్ నటుడు గోవిందా గాయపడ్డారు. ఆయన కాలులోకి బుల్లెట్ దూసుకుపోయింది. కుటుంబ సభ్యులు ఆయన్ను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లడంతో వైద్యులు సర్జరీ చేసి ఆ బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందనీ, త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. మంగళవారం ఉదయం ముంబై జుహూలోని గోవిందా నివాసంలో ఈ ఘటన జరిగింది. ఆయన లైసెన్స్ రివాల్వర్ చేతిలో నుంచి జారి కిందపడి హఠాత్తుగా పేలింది.


జీబ్రా అందరికీ నచ్చుతుంది



సత్యదేవ్, కన్నడ నటుడు డాలీ ధనుంజయ నటిస్తున్న 'జీబ్రా' చిత్రం టీజర్‌ను హీరో నాని విడుదల చేశారు. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో ఎస్ఎన్ రెడ్డి, పద్మజ, బాలసుందరం, దినేశ్ సుందరం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టీజర్ విడుదల కార్యక్రమానికి అతిథిగా వచ్చిన మంచు మనోజ్ మాట్లాడుతూ 'టీజర్ అదిరిపోయింది. ఈ చిత్ర నిర్మాత ఎస్సెస్ రెడ్డి నా శ్రేయోభిలాషి. బాగా ఖర్చుపెట్టి సినిమా తీశారు. నా అభిమాన నటుడు సత్యదేవ్. ఈ సినిమా ఘన విజయం సాధించాలి' అన్నారు. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ 'ఓ కొత్త క్యారెక్టర్‌తో వస్తున్నా. అన్ని పరిశ్రమల్లోని ఆర్టిస్టులు, టెక్నీషియన్లు ఇందులో ఉన్నారు. ప్రతి వ్యక్తికి ఈ సినిమా నచ్చుతుంది' అన్నారు.

రజనీకి తీవ్ర అస్వస్థత

- రక్తనాళంలో వాపు
- స్టెంట్ వేసిన వైద్య బృందం



తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారు. సోమవారం అర్ధరాత్రి ఆయన అస్వస్థతకు గురి కావడంతో కుటుంబీకులు ఆయన్ని గ్రీమ్స్‌రోడ్డులో వున్న అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. రజనీ అనారోగ్యం గురించి తెలియగానే ఆయన అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల పూజలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా వుందని, రెండు రోజుల్లో డిశ్చార్జ్ అవుతారని మంగళవారం ఆసుపత్రివర్గాలు ప్రకటించాయి. 'గుండె నుంచి బయటకు వచ్చే ప్రధాన రక్తనాళం (బృహద్ధమని)లో వాపు వచ్చింది. దీనికి శస్త్రచికిత్స చేయకుండా ట్రాన్స్‌కాథెటర్ విధానం ద్వారా చికిత్స చేయడం జరిగింది. సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సాయి సతీష్ సారథ్యంలోని వైద్య బృందం స్టెంట్ వేసి, వాపును సరిచేశారు. ఎండోవాస్కులర్ రిపేర్ ప్రణాళికాబద్ధంగా సాగిందని ఆయన శ్రేయోభిలాషులకు, అభిమానులకు తెలియజేయాలనుకుంటున్నాం. రజనీకాంత్ ఆరోగ్యం నిలకడగా ఉంది. రెండు రోజుల్లో ఆస్పత్రి నుంచి ఇంటికి వెళతారు' అని ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులిటెన్‌లో పేర్కొన్నాయి. ఇదిలా వుండగా రజనీ త్వరగా కోలుకోవాలంటూ తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి స్టాలిన్ తదితరులు ఆకాంక్షించారు. తమిళనాడు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం స్వయంగా ఆసుపత్రికి వెళ్లి రజనీ ఆరోగ్యంపై వాకబు చేశారు. రజనీ క్షేమంగా వున్నారని, కోలుకుంటున్నారని మంత్రి ప్రకటించారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

ముఖేష్ డబుల్ ధమాకా

షూటింగ్ వరల్డ్ కప్



న్యూఢిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ వరల్డ్ కప్‌లో గుంటూరు షూటర్ ముఖేష్ నేలవల్లి ఒకే రోజు రెండు స్వర్ణాలు సొంతం చేసుకుని సంచలనం సృష్టించాడు. ఈ పోటీల్లో ముఖేష్‌కు ఇది మొత్తంగా మూడో పతకం. పెరూ రాజధాని లిమా నగరంలో మంగళవారం జరిగిన పురుషుల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత, టీమ్ ఈవెంట్‌ల్లో ముఖేష్ పసిడి పతకాలు కొల్లగొట్టాడు. వ్యక్తిగత విభాగంలో ముఖేష్ 585 పాయింట్లతో టాప్‌లో నిలవగా, టీమ్ ఈవెంట్‌లో ముఖేష్, సూరజ్, ప్రద్యుమ్న సింగ్ త్రయం 1729 పాయింట్లతో అగ్రస్థానం దక్కించుకుంది. భారత్‌కే చెందిన మరో షూటర్ పార్థ్ రాకేశ్ రెండు స్వర్ణాలతో అదరగొట్టాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఈవెంట్‌లో పార్థ్ (250.7 పాయింట్లు) వరల్డ్ చాంపియన్‌గా నిలిచాడు. 10 మీ. ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో అజయ్ మాలిక్, అభినవ్ షా, పార్థ్ రాకేశ్‌తో కూడిన భారత త్రయం 1883.5 పాయింట్లు స్కోరు చేసి పసిడి అందుకుంది. ఇక, మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో గౌతమి భానోత్, శాంభవి, అనౌష్క ఠాకూర్‌తో కూడిన భారత్ బృందం విజేతగా నిలిచింది.

అతిపిన్న వయస్సులోనే (22) ఓ క్యాలెండర్ ఏడాదిలో ఎక్కువ పరుగులు (929) చేసిన భారత బ్యాటర్‌గా జైస్వాల్. గవాస్కర్ (918)ను అధిగమించాడు.

1 టెస్టుల్లో అత్యధిక రన్‌రేట్ (రెండు ఇన్నింగ్స్ కలిపి 7.36) నమోదు చేసిన జట్టుగా భారత్.

2 అతి తక్కువ బంతుల (281)ను ఎదుర్కొని టెస్టు విజయం సాధించిన రెండో టీమ్‌గా భారత్. ఇంగ్లండ్ (276) ముందుంది.

4 టెస్టుల్లో ఎక్కువ విజయాలు (180) సాధించిన నాలుగో జట్టుగా భారత్. ఆస్ట్రేలియా (414) టాప్‌లో ఉంది.

స్వీప్ చేశారు

2-0తో సిరీస్ భారత్‌దే



మూడురోజుల ఆట దాదాపుగా వర్షంతో తుడిచిపెట్టుకు పోయిన వేళ.. మిగిలిన రెండు రోజుల్లో ఫలితం గురించి ఆలోచించగలమా? టీమిండియా ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపింది. ఈ తక్కువ సమయంలోనే ప్రత్యర్థి బంగ్లాదేశ్‌ను రెండుసార్లు ఆలౌట్ చేసింది. ఆ తర్వాత ఛేదనకు దిగి మరో సెషనున్నర సమయం ఉండగానే టెస్టు విజయాన్ని ఖాతాలో వేసుకుంది. పేసర్లు, స్పిన్నర్లనే తేడా లేకుండా కలిసికట్టుగా భారత బౌలింగ్ దళం విరుచుకుపడడంతో ఈ అరుదైన ఘట్టాన్ని సాధించింది. జట్టు ఖాతాలో ఇది వరుసగా 18వ స్వదేశీ సిరీస్ విజయం కావడం మరో విశేషం.

రెండో టెస్టులో ఘనవిజయం
బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ 146 ఆలౌట్
బుమ్రా, జడేజా, అశ్విన్‌లకు మూడేసి వికెట్లు

కాన్పూర్: ప్రపంచ టెస్టుచాంపియన్‌షిప్‌లో తామెందుకు అగ్రస్థానంలో కొనసాగుతున్నామో.. టీమిండియా మరోసారి చాటిచెప్పింది. బంగ్లాదేశ్‌తో అత్యంత ఆసక్తికరంగా సాగిన రెండో టెస్టులో భారత్ ఏడు వికెట్లతో ఘనవిజయం సాధించింది. అలాగే సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. వాస్తవానికి ఈ మ్యాచ్‌లో ఫలితం తేలుతుందని బహుశా ఎవరూ ఊహించి ఉండరేమో. కానీ కొత్త కోచ్ గంభీర్ దూకుడు వ్యూహానికి అనుగుణంగా రోహిత్ సేన బౌలింగ్.. బ్యాటింగ్‌లో తమ పవర్ ఏంటో చూపింది. కేవలం ఆరు సెషన్లలోనే అనుకున్నది సాధించగలిగింది. చివరి రోజు మంగళవారం బంతితో మరింతగా చెలరేగి బంగ్లా బ్యాటర్లను కట్టడి చేసింది. పేసర్ బుమ్రాతో పాటు స్పిన్నర్లు అశ్విన్, జడేజా మూడేసి వికెట్లతో తడాఖా చూపడంతో ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 146 పరుగులకే కుప్పకూలింది. షాద్‌మన్ (50), ముష్ఫికర్ (37) మాత్రమే రాణించారు. ఆ తర్వాత 95 పరుగుల స్వల్ప ఛేదన కోసం బరిలోకి దిగిన భారత్ 17.2 ఓవర్లలో 98/3 స్కోరు చేసి గెలిచింది. యశస్వీ జైస్వాల్ (51), విరాట్ (29 నాటౌట్) ఆకట్టుకున్నారు. మిరాజ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అంతకుముందు బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 233 రన్స్ చేయగా, భారత్ 285/9 స్కోరు దగ్గర డిక్లేర్‌చేసింది. **ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జైస్వాల్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా అశ్విన్** (11 వికెట్లు+114 పరుగులు) నిలిచారు.



జైస్వాల్

బౌలింగ్ ఉచ్చులో..: ఓవర్‌నైట్ స్కోరు 26/2తో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన బంగ్లాను మొదట అశ్విన్ దెబ్బకొట్టగా.. మిడిలార్డర్‌లో జడేజా వరుస ఓవర్లలో బిత్తరపోయేలా చేశాడు. ఇక టెయిలెండర్లను బుమ్రా తన పదునైన బంతులతో నిలువనీయలేదు. దీంతో ఈ జట్టు కనీసం ఓ సెషన్‌ను కూడా పూర్తి చేయలేకపోయింది. చివరి రోజు బంగ్లా ఆరంభంలోనే మోమినుల్ (2) వికెట్ కోల్పోయింది. కానీ ఓపెనర్ షాద్‌మన్ మాత్రం పోరాటం కనబరచాడు. అర్ధసెంచరీ సాధించిన తను కెప్టెన్ షంటో (19)తో కలిసి నాలుగో వికెట్‌కు 55 పరుగులు జోడించాడు. బౌలర్లను విసిగిస్తున్న ఈ జోడీని జడేజా విడదీశాడు. షంటో అనవసరంగా రివర్స్ స్వీప్‌నకు వెళ్లి బౌల్డయ్యాడు. ఇక్కడి నుంచి బంగ్లా వికెట్ల పతనం వేగంగా సాగింది. ఆ వెంటనే షాద్‌మన్‌ను ఆకాశ్ అవుట్ చేశాడు. అటు వరుస ఓవర్లలో లిట్టన్ (1), షకీబ్ (0)లను జడేజా వెనక్కి పంపడంతో స్కోరు 91/4 నుంచి 94/7కి పడిపోయింది. ఆ తర్వాత బుమ్రా మిగిలిన వికెట్లను పడగొట్టాడు. ఓపిగ్గా ఆడుతున్న ముష్ఫికర్ సరిగ్గా లంచ్ సెషన్ ఆఖరి బంతికి భారీ షాట్‌కు వెళ్లి బౌల్డ్ కావడంతో వీరి ఇన్నింగ్స్ ముగిసింది.

జైస్వాల్ హాఫ్ సెంచరీ: 95 పరుగుల స్వల్ప ఛేదనను భారత్ సునాయాసంగా ముగించింది. ఎప్పటిలాగే ఓపెనర్ జైస్వాల్ మరో హాఫ్ సెంచరీతో చెలరేగాడు. తొలి ఐదు ఓవర్లలోనే కెప్టెన్ రోహిత్ (8), గిల్ (6) వెనుదిరిగినా యశస్వీ తన సహజశైలిలోనే చెలరేగాడు. అటు విరాట్ కూడా కచ్చితమైన షాట్లతో ఆకట్టుకున్నాడు. 43 బంతుల్లోనే జైస్వాల్ వరుసగా రెండో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. బౌండరీతో మ్యాచ్‌ను ముగిద్దామనుకున్న జైస్వాల్ క్యాచ్ అవుటయ్యాడు. దీంతో మూడో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత పంత్ (4 నాటౌట్) ఫోర్‌తో రెండో సెషన్‌లోపే మ్యాచ్ ముగిసింది.

షకీబ్‌కు విరాట్ బహుమతి



కెరీర్‌లో చివరి టెస్టు ఆడేసిన బంగ్లా దిగ్గజ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్‌కు విరాట్ స్పెషల్ గిఫ్ట్ ఇచ్చాడు. మ్యాచ్ ముగిశాక అవార్డుల కార్యక్రమం జరుగుతున్న సమయంలో కోహ్లీ తన సంతకంతో కూడిన బ్యాట్‌ను తీసుకెళ్లాడు. నేరుగా షకీబ్ దగ్గరికి వెళ్లి అతడికి తన బ్యాట్‌ను బహుమతిగా అందించాడు. ఆ తర్వాత అతడి భుజంపై చేయి వేసి కాసేపు ఆప్యాయంగా సంభాషించడం కనిపించింది. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్‌కు ఎంపిక కాకపోతే ఇదే తన చివరి టెస్టు కానుందని షకీబ్ ఇదివరకే ప్రకటించాడు.

రోహిత్ సేన ఖాతాలో 12 పాయింట్లు

బంగ్లాపై రెండో టెస్టు విజయంతో డబ్ల్యూటీసీ పట్టికలో భారత్ అగ్రస్థానం మరింత బలపడింది. తాజా విజయంతో జట్టుకు 12 పాయింట్లు లభించాయి. మొత్తంగా రోహిత్ సేన ఇప్పటి వరకు ఆడిన 11 డబ్ల్యూటీసీ టెస్టుల్లో 8 విజయాలు, రెండు ఓటములు, ఓ డ్రాతో 98 పాయింట్లు సాధించింది. అలాగే 74.24 విజయాల శాతంతో ఫైనల్ వైపు దూసుకెళుతోంది. ఇక స్వదేశంలో కివీస్‌తో జరిగే సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేస్తే చాలు.. టీమిండియా డబ్ల్యూటీసీలో హ్యాట్రిక్ ఫైనల్ బెర్త్ దక్కించుకుంటుంది. భారత్‌తోపాటు ఆస్ట్రేలియా (62.50), శ్రీలంక (55.56) టాప్-3లో ఉన్నాయి.

అశ్విన్ @ 1



లేటు వయస్సులోనూ భారత స్పిన్నర్ ఆర్.అశ్విన్ రికార్డులను కొల్లగొడుతున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టుల్లో 34 వికెట్లు తీసి జహీర్ ఖాన్ (31)ను అధిగమించాడు. అలాగే డబ్ల్యూటీసీ తాజా సీజన్‌లో ఇప్పటికే ఆడిన 10 మ్యాచ్‌ల్లో అత్యధికంగా 53 వికెట్లు పడగొట్టాడు. ఆసీస్ పేసర్ హాజెల్‌వుడ్ (51) అతడి వెనుక ఉన్నాడు. అంతేకాకుండా వరుసగా మూడు డబ్ల్యూటీసీ ఎడిషన్లలోనూ 50+ వికెట్లు సాధించిన తొలి బౌలర్‌గా 38 ఏళ్ల అశ్విన్ నిలవడం విశేషం. అంతేకాకుండా టెస్టుల్లో 11 సార్లు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచిన ఈ భారత స్టార్ స్పిన్నర్.. మురళీధరన్‌తో కలిసి టాప్‌లో కొనసాగుతున్నాడు.

స్కోరుబోర్డు

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 233; భారత్ తొలి ఇన్నింగ్స్: 285/9 డిక్లేర్;
బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: షాద్‌మన్ (సి) జైస్వాల్ (బి) ఆకాశ్ 50; జకీర్ (ఎల్బీ)అశ్విన్ 10; హసన్ (బి) అశ్విన్ 4; మోమినుల్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 2; షంటో(బి) జడేజా 19; ముష్ఫికర్ (బి) బుమ్రా 37; లిట్టన్ (సి) పంత్ (బి) జడేజా 1; షకీబ్(సి అండ్ బి) జడేజా 0; మిరాజ్ (సి) పంత్ (బి) బుమ్రా 9; తైజుల్ (ఎల్బీ) బుమ్రా 0;ఖాలెద్ (నాటౌట్)5; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 47 ఓవర్లలో 146 ఆలౌట్.** వికెట్ల పతనం: 1-18, 2-26, 3-36, 4-91, 5-93, 6-94, 7-94, 8-118, 9-130;**బౌలింగ్:** బుమ్రా 10-5-17-3; అశ్విన్ 15-3-50-3; ఆకాశ్ 8-3-20-1; సిరాజ్ 4-0-19-0; జడేజా 10-2-34-3.
భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ (సి) హసన్ (బి) మిరాజ్ 8; జైస్వాల్ (సి) షకీబ్ (బి) తైజుల్ 51; గిల్ (ఎల్బీ) మిరాజ్ 6; విరాట్ (నాటౌట్) 29; పంత్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం: 17.2 ఓవర్లలో 98/3. వికెట్ల పతనం:** 1-18, 2-34, 3-92. **బౌలింగ్:** మిరాజ్ 9-0-44-2; షకీబ్ 3-0-18-0; తైజుల్ 5.2-0-36-1.

వైభవ్ సెంచరీ

● యువ భారత్ 296 ఆలౌట్
● అండర్-19 అనధికార టెస్ట్



చెన్నై: పదమూడేళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (104) శతకంతో చెలరేగినా.. ఆసీస్ స్పిన్నర్ విశ్వ రామ్‌కుమార్ దెబ్బకు భారత అండర్-19 జట్టు మిడిలార్డర్ తడబడింది. దీంతో భారీ స్కోరు చేస్తుందనుకొన్న భారత్ కేవలం 3 పరుగుల ఆధిక్యాన్ని మాత్రమే అందుకుంది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 103/0తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 296 పరుగులకు ఆలౌటైంది. విహాన్ మల్హోత్రా (76) హాఫ్ సెంచరీ చేయగా.. కెప్టెన్ సోహమ్ (33), అభిజ్ఞాన్ కుండూ (32) ఫర్వాలేదనిపించారు. విశ్వ రామ్‌కుమార్ 4 వికెట్లు, థామస్ బ్రౌన్ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్ 110/4 స్కోరు చేసింది. మంగళవారం ఆట నిలిచే సమయానికి సైమన్ బడ్జ్ (4), క్రిస్టియన్ హో (2) క్రీజులో ఉన్నారు. ఓపెనర్ రైలీ కింగ్‌సెల్ (48), ఆలివర్ పీక్ (32) రాణించారు. మొత్తంగా ఆసీస్ 107 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఎనాన్ 2 వికెట్లు పడగొట్టాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 293 పరుగులు చేసింది.

హైదరాబాద్ రంజీ కెప్టెన్ తిలక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా తిలక్ వర్మ నియమితుడయ్యాడు. ఈనెలలో జరిగే రంజీ సీజన్‌లో పోటీపడే హైదరాబాద్ జట్టును హెచ్‌సీఏ మంగళవారం ప్రకటించింది.
జట్టు: తిలక్ (కెప్టెన్), రాహుల్ సింగ్ (వైస్‌కెప్టెన్), సీవీ మిలింద్, తన్మయ్ అగర్వాల్, రోహిత్ రాయుడు, తనయ్ త్యాగరాజన్, అనికేత్ రెడ్డి, నితీశ్, అభిరథ్ రెడ్డి, హిమతేజ, రాహుల్ రాధేష్, రక్షణ్ రెడ్డి, కార్తికేయ, నిషాంత్, ధీరజ్ గౌడ్.
రిజర్వ్ ప్లేయర్లు: బుద్ధి రాహుల్, వరుణ్ గౌడ్, రిషభ్, భగత్, అజయ్‌దేవ్.

రాణించిన రహానె

ముంబై 237/4
'రెస్ట్'తో ఇరానీ కప్

లఖ్‌నవూ: అజింక్యా రహానె ఇరానీ కప్‌లో అదరగొట్టాడు. మంగళవారం రెస్టాఫ్ ఇండియాతో మొదలైన మ్యాచ్‌లో రహానె (86 నాటౌట్)తో పాటు సర్ఫరాజ్ (54 నాటౌట్), శ్రేయాస్ అయ్యర్ (57) సత్తా చాటడంతో తొలిరోజు ముంబై 237/4 స్కోరుతో మెరుగైన స్థితిలో నిలిచింది.

100 కొట్టినా ఫర్వాలేదనుకున్నాం..

'నాలుగోరోజు బంగ్లాను సాధ్యమైనంత త్వరగా ఆలౌట్ చేసి బ్యాటింగ్‌కు దిగాలనుకున్నాం. ఈక్రమంలో పిచ్ సహకరించకున్నా బౌలర్లు అద్భుతం చేసి అనుకున్నది సాధించారు. ఇక మా బ్యాటింగ్‌లో దూకుడును ప్రదర్శించి 100-150లోపే ఆలౌటైనా ఫర్వాలేదనే దృష్టికోణంతో ఆడాం. ఎలాగైనా మ్యాచ్ నెగ్గాలన్న లక్ష్యంతో బరిలోకి దిగాం' - **రోహిత్**

బిజినెస్

రూ. 10,900 కోట్లతో పీఎం ఈ-డ్రైవ్ షురూ

న్యూఢిల్లీ: ప్రజలు మరింతగా విద్యుత్ వాహనాలు (ఈవీ) వినియోగించడాన్ని ప్రోత్సహించేందుకు ప్రకటించిన పీఎం ఈ-డ్రైవ్ పథకాన్ని రూ.10,900 కోట్ల పెట్టుబడితో మంగళవారం ప్రారంభించారు. ఈవీల వినియోగానికి ప్రజలను ఆకర్షించడం, చార్జింగ్ మౌలిక వసతుల అభివృద్ధి, విద్యుత్ వాహనాల తయారీకి అనుకూల వాతావరణం కల్పించడం ఈ పథకం లక్ష్యాలు. 2026 మార్చి 31 వరకు ఈ పథకం అమలులో ఉంటుంది. సోమవారం నాటితో గడువు ముగిసిపోయిన ఈఎంపీఎస్-2024 పథకం ఇందులో విలీనమవుతుంది. ఒక్కో ఆధార్ కార్డుపై ఒక్కో వాహనాన్ని మాత్రమే అనుమతిస్తామని, వాహనం కొనుగోలు సమయంలో స్కీమ్ పోర్టల్ ఆ ఆధార్ కార్డు అసలైనదేనని ధ్రువీకరించగానే దానిపై ఈ వోచర్ జారీ అవుతుందని, ఈ వోచర్ డౌన్‌లోడ్ లింక్ కూడా సంబంధిత వ్యక్తి మొబైల్ నంబర్‌కు పంపుతారని ఈ పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా భారీ పరిశ్రమల శాఖ అడిషనల్ కార్యదర్శి హనీఫ్ ఖురేషి చెప్పారు. ఈ వోచర్ డౌన్‌లోడ్ చేసుకుని కస్టమర్ దానిపై సంతకం పెట్టి డీలర్‌కి ఇవ్వగానే డీలర్ కూడా సంతకం చేసి పీఎం ఈ-డ్రైవ్ పోర్టల్‌కు అప్‌లోడ్ చేస్తారని, దాని ఆధారంగానే సంబంధిత ఓఈఎం సబ్సిడీ రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

తెలంగాణలో 55 వేల మంది విక్రేతలు

అమెజాన్ ఇండియా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఈ ఏడాది పండగల సీజన్‌లో చిన్న, మధ్య తరహా వ్యాపారుల (ఎస్ఎంబీ)కు తోడ్పాటునందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు అమెజాన్ ఇండియా డైరెక్టర్ (సేల్స్) గౌరవ్ మాథుర్ వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి 55,000 మంది విక్రేతలు తమ ప్లాట్‌ఫామ్ ద్వారా తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారన్నారు. గత ఏడాది పండగల సీజన్‌లో విక్రేతల సంఖ్య 44,000గా ఉందని ఆయన తెలిపారు. వీరికి మరింత తోడ్పాటునందించే ఉద్దేశంతో అమ్మకం ఫీజును 3 నుంచి 12 శాతం వరకు తగ్గించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	535
వరంగల్	512	గోదావరి	535
చిత్తూరు	523	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	116
వరంగల్	110	గుంటూరు	121
కరీంనగర్	110	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	111
కర్నూలు	110	నెల్లూరు	111
విశాఖపట్నం	107	అనంతపురం	111
గోదావరి	116		

ఎఫ్ అండ్ ఓ నిబంధనలు
కఠినతరం



ఇండెక్స్ డెరివేటివ్స్ కనీస కాంట్రాక్ట్ సైజు రూ. 5 లక్షల నుంచి రూ. 15 లక్షలకు పెంపు

సర్క్యులర్ విడుదల చేసిన సెబీ

నవంబరు 20 నుంచి దశలవారీగా అమలు

న్యూఢిల్లీ: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగంలో స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను కట్టడి చేసేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈక్విటీ ఇండెక్స్ డెరివేటివ్స్ నిబంధనలను కఠినతరం చేసింది. ఇందులో భాగంగా కనీస కాంట్రాక్ట్ సైజు పెంపుతో పాటు ఆప్షన్స్ ప్రీమియం అప్‌ఫ్రంట్ వసూలు తప్పనిసరి చేసింది. పొజిషన్స్ లిమిట్స్ ఇంట్రాడే మానిటరింగ్, కాంట్రాక్టుల గడువు ముగింపు తేదీన క్యాలెండర్ స్ప్రెడ్ రద్దు, వీక్లీ ఇండెక్స్ డెరివేటివ్స్ హేతుబద్ధీకరణ, టెయిల్ రిస్క్ కవరేజీ పెంపు వంటి చర్యలను సైతం ప్రకటించింది. చిన్న మదుపరుల ప్రయోజనాలను, మార్కెట్ స్థిరత్వాన్ని రక్షించడమే ఈ చర్యల ముఖ్యోద్దేశం. తాజాగా ప్రకటించిన నిర్ణయాలు ఈ నవంబరు 20 నుంచి దశలవారీగా అమలులోకి రానున్నాయని మంగళవారం విడుదల చేసిన సర్క్యులర్‌లో సెబీ పేర్కొంది.

ఎఫ్ అండ్ ఓ విభాగ ట్రేడింగ్‌కు సంబంధించి సెబీ ఇటీవల ఒక అధ్యయన నివేదికను విడుదల చేసింది. 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం మధ్యకాలంలో ఎఫ్ అండ్ ఓ విభాగంలో ట్రేడింగ్ నెరిపిన కోటి మందికి పైగా వ్యక్తిగత ఇన్వెస్టర్లలో 93 శాతం మంది సగటున రూ.2 లక్షల చొప్పున నష్టపోయినట్లు సెబీ అధ్యయనంలో వెల్లడైంది. వీరి మొత్తం నష్టం రూ.1.8 లక్షల కోట్ల పైమాటేనని తెలిపింది. అంతేకాదు, 2021-22లో నష్టపోయిన వ్యక్తిగత ఇన్వెస్టర్ల వాటా 89 శాతంగా ఉండగా.. 2023-24 నాటికి 93 శాతానికి పెరిగింది.

ఈక్విటీ డెరివేటివ్స్ సెగ్మెంట్‌లో స్ట్రెస్ టెస్ట్‌కు కొత్త విధానం

ఈక్విటీ డెరివేటివ్ విభాగంలో ఒత్తిడిని మరింత మెరుగ్గా గుర్తించేందుకు సెబీ స్ట్రెస్డ్ వేల్యూ ఎట్ రిస్క్ (వీఏఆర్), ఎక్స్‌పోనెన్షియల్ వెయిటెడ్ మూవింగ్ యావరేజ్ (ఈడబ్ల్యూఎంఏ) వంటి కొత్త విధానాలను ప్రవేశపెట్టింది. మార్కెట్లో మారుతున్న స్థితిగతులను తెలుసుకోవడంతో పాటు పొంచి ఉన్న ముప్పును ముందుగానే పసిగట్టేందుకు ఇవి దోహదపడనున్నాయి.

సెబీ తాజా చర్యల వివరాలు..

- డెరివేటివ్స్ కనీస కాంట్రాక్ట్ సైజు రూ.5-10 లక్షల నుంచి రూ.15-20 లక్షల పెంపు. వచ్చేనెల 20 నుంచి ఇది అమలు కానుంది. మార్కెట్ వేగంగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో నియంత్రణ మండలి ఈ నిర్ణయం తీసుకుంది.
- మార్కెట్లో స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు 2025 ఏప్రిల్ నుంచి ఈక్విటీ ఇండెక్స్ డెరివేటివ్స్‌లో పొజిషన్స్ లిమిట్‌పై ఇంట్రాడే మానిటరింగ్ అమలులోకి రానుంది. ఇందులో భాగంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు ఈ విభాగంలో పొజిషన్స్ పరిమితికి లోబడి ఉన్నాయా లేదా అని తనిఖీ చేసేందుకు కనీసం నాలుగు పొజిషన్ స్నాప్‌షాట్స్‌ను యాధృచ్ఛికంగా ఎంపిక చేయనుంది.
- కాంట్రాక్టుల ముగింపు తేదీ రోజున స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను నిరోధించడం తోపాటు మార్కెట్లో ఊగిసలాటలను తగ్గించేందుకు ఎక్స్ఛేంజీలు ఒక ప్రామాణిక సూచీలో (బెంచ్‌మార్క్ ఇండెక్స్)లో వారం రోజుల గడువుతో కూడిన డెరివేటివ్ కాంట్రాక్టులను ఆఫర్ చేసేందుకు మాత్రమే అనుమతించబడతాయి. అలాగే, గడువు ముగింపు రోజున షార్ట్ ఆప్షన్స్ కాంట్రాక్టులపై అదనంగా 2 శాతం మార్జిన్‌ను విధించడం జరుగుతుంది. ఈ నిబంధనలు కూడా వచ్చే నెల 20 నుంచి అమలులోకి రానున్నాయి.
- ఆప్షన్స్ కొనుగోలుదారులు పూర్తి ప్రీమియంను ముందుగానే చెల్లించాల్సి ఉంటుంది. వ్యక్తిగత ఇన్వెస్టర్లు తమ ఆర్థిక పరపతి స్థాయికి మించి పొజిషన్స్ తీసుకోకుండా నిరోధించేందుకు ఇది దోహదపడనుంది. అలాగే, కాంట్రాక్టు గడువు ముగింపు రోజున క్యాలెండర్ స్ప్రెడ్ ప్రయోజనమూ అందుబాటులో ఉండవు. ఈ మార్పులు వచ్చే ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

మూడో రోజూ నష్టాలే..

ముంబై: సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా మూడో రోజు నష్టాల్లో ముగిశాయి. ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. సెన్సెక్స్ 33.49 పాయింట్లు కోల్పోయి 84,266.29 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 13.95 పాయింట్ల నష్టంతో 25,796.90 వద్ద స్థిరపడింది. గడిచిన 3ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,570 పాయింట్లు (దాదాపు 2 శాతం), నిఫ్టీ 419 పాయింట్లు (1.6 శాతం) క్షీణించాయి.

ఒకే రోజు 13 కంపెనీలు ఐపీఓలకు దరఖాస్తు: పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు వచ్చేందుకు కంపెనీలు భారీగా క్యూ కడుతున్నాయి. మంగళవారం ఏకంగా 13 కంపెనీలు ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించాయి. ఇందులో హైదరాబాద్‌కు చెందిన మిడ్‌వెస్ట్ కూడా ఉంది. మిగిలిన కంపెనీల్లో విక్రమ్ సోలార్, సంభవ్ స్టీల్, రాహీ ఇన్‌ఫ్రాటెక్, అజాక్స్ ఇంజనీరింగ్ సహా మరికొన్ని ఉన్నాయి. ఈ 13 కంపెనీలు ఐపీఓ ద్వారా రూ.8,000 కోట్లు సమీకరించాలని భావిస్తున్నాయి.

మిడ్‌వెస్ట్ రూ.650 కోట్ల సమీకరణ: దేశంలోని అతిపెద్ద బ్లాక్ గెలాక్సీ గ్రానైట్ ఉత్పత్తిదారుల్లో ఒకటైన హైదరాబాద్ సంస్థ మిడ్ వెస్ట్ ఐపీఓ ద్వారా రూ.650 కోట్లు సమీకరించాలనుకుంటోంది. అందులో రూ.250 కోట్ల విలువైన తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్లు కొల్లారెడ్డి రామ రాఘవ రెడ్డి, గుంటక రవీంద్ర రెడ్డికి చెందిన రూ.400 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఓఎఫ్ఎస్ పద్ధతిన విక్రయించనున్నారు.

'ఆటో' జోరుకు బ్రేక్

న్యూఢిల్లీ: దేశంలో ఆటోమొబైల్ మార్కెట్ జోరుకి బ్రేక్ పడింది. కొనుగోలుదారులు లేక డీలర్ల వద్ద పేరుకుపోయిన నిల్వలు తగ్గించాలన్న లక్ష్యంతో ఆటోమొబైల్ కంపెనీలు సరఫరాను తగ్గించాయి. ఫలితంగా వివిధ కంపెనీల టోకు విక్రయాలు సెప్టెంబరులో గణనీయంగా క్షీణించాయి. గత ఏడాది సెప్టెంబరుతో పోల్చితే మారుతి సుజుకీ (4%), హ్యుండయ్ (6%), టాటా మోటార్స్ (8%) విక్రయాలు తగ్గినట్లు ప్రకటించాయి. అయితే కియా (17%), మహీంద్రా (24%), టయోటా కిర్లోస్కర్ (14%), జేఎస్‌డబ్ల్యూ ఎంజీ విక్రయాలు పెరిగాయి. కాగా ద్విచక్ర వాహన కంపెనీలైన బజాజ్ ఆటో (23%), హెచ్ఎంఎస్ఐ, హీరో మోటోకార్ప్ (19%) విక్రయాలు పెరిగాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	76,910 ▼	70,500 ▼	1,01,000 ▲
ముంబై	75,515 ▲	69,172 ▲	89,882 ▲

సెప్టెంబరు ఆదాయంలో 6.5% వృద్ధి

జీఎస్‌టీ వసూళ్లు
రూ.1.73 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: సెప్టెంబరు నెలకు గాను వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 6.5 శాతం వృద్ధి చెంది రూ.1.73 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం వెల్లడించింది. 2023 సెప్టెంబరులో జీఎస్‌టీ స్థూల వసూళ్లు రూ.1.63 లక్షల కోట్లుగా ఉన్నాయి. కాగా, ఈ ఆగస్టులో ఆదాయం రూ.1.75 కోట్లుగా నమోదైంది. గత నెలకు రిఫండ్ల సర్దుబాటు అనంతరం నికర జీఎస్‌టీ ఆదాయం రూ.1.53 లక్షల కోట్లుగా ఉంది. 2023 సెప్టెంబరులో నమోదైన నికర జీఎస్‌టీ ఆదాయంతో పోలిస్తే 3.9 శాతం పెరిగింది. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, గత నెలలో తెలంగాణ జీఎస్‌టీ ఆదాయం ఒక శాతం వార్షిక పెరుగుదలతో రూ.5,267 కోట్లుగా, ఆంధ్రప్రదేశ్ జీఎస్‌టీ రెవెన్యూ 4 శాతం తగ్గుదలతో రూ.3,506 కోట్లుగా నమోదైంది.

2025 ఏప్రిల్ 1 నుంచి జీఎస్‌టీ యాంటీ ప్రాఫిటీరింగ్ దర్యాప్తులకు స్వస్తి

వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) నుంచి పన్ను అధికారులు జీఎస్‌టీ చట్టంలో భాగంగా యాంటీ ప్రాఫిటీరింగ్‌కు సంబంధించి కొత్త దర్యాప్తులేవీ చేపట్టబోరు. ఎందుకంటే, జీఎస్‌టీ చట్టంలోని యాంటీ ప్రాఫిటీరింగ్ క్లాజ్‌కు కటాఫ్ తేదీని 2025 ఏప్రిల్ 1గా ప్రకటించింది ప్రభుత్వం. మంగళవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది.

21,000 మంది బాలికలకు స్కాలర్‌షిప్స్

మలబార్ గ్రూప్



హైదరాబాద్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మాతృ సంస్థ మలబార్ గ్రూప్.. 2024 సంవత్సరానికి గాను బాలికల కోసం మలబార్ నేషనల్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమం కింద బాలికల విద్యకు తోడ్పాటునందించనున్నట్లు మలబార్ గ్రూప్ వెల్లడించింది. ఇటీవల ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహమ్మద్ సమక్షంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ ఈ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా 21,000 మంది బాలికల విద్య కోసం మలబార్ గ్రూప్ స్కాలర్‌షిప్స్‌ను అందించనుంది. ఇందుకోసం మలబార్ గ్రూప్ రూ.16 కోట్లను కేటాయించింది. ఈ కార్యక్రమంలో మలబార్ గ్రూప్ ఎండీ (ఇండియా ఆపరేషన్స్) ఆషెర్ ఓ, వైస్ చైర్మన్ అబ్దుల్ సలామ్ కేపీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషాద్ ఏకే పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు 95,000 మందికి పైగా బాలికలకు స్కాలర్‌షిప్స్‌ను మలబార్ గ్రూప్ అందించింది. ఇందుకోసం రూ.60 కోట్లు వెచ్చించింది.

2026 నాటికి రూ.100 కోట్ల టర్నోవర్

ఐస్‌బర్గ్ ఆర్గానిక్ ఐస్‌క్రీమ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఐస్‌బర్గ్ ఆర్గానిక్ ఐస్ క్రీమ్స్.. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.100 కోట్ల టర్నోవర్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మంగళవారం నాడిక్కడ మార్కెట్లోకి ప్రీమియం బ్రాండ్ 'ఆర్గానిక్ క్రీమరీ'ని విడుదల చేసిన సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు, ఆర్ఎస్ బిజినెస్ వెంచర్స్ ఎల్ఎల్‌పీ సీఈఓ సుహాస్ బీ శెట్టి మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.14 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేసిందని, కార్యకలాపాల విస్తరణ ద్వారా నిర్దేశిత లక్ష్యాన్ని అందుకోవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఐస్‌బర్గ్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఏడు రాష్ట్రాల్లో మొత్తం 72 విక్రయ కేంద్రాలను నిర్వహిస్తోందన్నారు. విస్తరణలో భాగంగా వచ్చే రెండేళ్లలో కొత్తగా రూ.11 కోట్ల పెట్టుబడితో 25 ఔట్‌లెట్స్‌ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 12న హైదరాబాద్‌లో 73వ ఔట్‌లెట్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో రూ.40 కోట్లతో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో కంపెనీ 36 ఫ్లేవర్స్‌తో కూడిన ఆర్గానిక్ ఐస్‌క్రీమ్స్‌ను ఉత్పత్తి చేస్తోంది. ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం రోజుకు 12,500 లీటర్లుగా ఉంది.

ఎంతమంది పిల్లలున్నా సర్పంచిగా పోటీ చేయొచ్చు

» స్థానిక సంస్థలకు సంతానం నిబంధన ఎత్తివేత

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇప్పటిదాకా ఉన్న ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తేయనున్నారు. ఇక నుంచి ఎంతమంది పిల్లలు ఉన్న వారైనా సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా పోటీ చేయొచ్చు. ఈ మేరకు పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేయనున్నారు. ఈ మేరకు బిల్లు కూడా సిద్ధమైంది. ఇప్పట్లో శాసనసభ సమావేశాలు లేకపోవడంతో దీన్ని ఆర్డినెన్సు రూపంలో తీసుకురానున్నారు. 2019లో మున్సిపాలిటీల ఎన్నికలు జరిగినపుడు మున్సిపల్ చట్టాన్ని సవరించి ఆ ఎన్నికల్లో పోటీ చేసిన వాళ్లకు సంతానం పరిమితి నిబంధనను ఎత్తేశారు. ఇప్పుడు పంచాయతీరాజ్ సంస్థలకు కూడా ఆ నిబంధనను ఎత్తేస్తున్నారు. 1995కు ముందు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారికి సంతాన పరిమితి నిబంధన లేదు. 1995లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన చట్టంలో ఇద్దరు పిల్లల నిబంధన చేర్చారు.

మేడిగడ్డ పూర్తయిందని సర్టిఫికెట్ ఇచ్చిందెవరు?

» అధికార్ల వివరాలు అడిగిన నీటిపారుదల శాఖ

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ, దానిచుట్టూ గైడ్ బండ్ వంటి నిర్మాణాలు జరుగుతుండగానే బ్యారేజీ పూర్తయినట్లు కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చిన అప్పటి మహాదేవ్‌పూర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)-1, రామగుండం ఇన్‌చార్జీ ఎస్ఈగా పనిచేసిన అధికారులపై చర్యలు తీసుకోవడానికి వీలుగా వారి వివరాలు ప్రభుత్వానికి అందించాలని నీటిపారుదలశాఖ కోరింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా మెమో జారీ చేశారు. బ్యారేజీ పూర్తికాకుండానే సర్టిఫికెట్‌లు ఇచ్చిన ఇంజనీర్లపై క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ పలు దఫాలుగా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు. గత జూన్ 3వ తేదీన ప్రభుత్వానికి నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ లేఖ రాస్తూ... నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీకి కంప్లీషన్ సర్టిఫికెట్ జారీ చేసిన మహాదేవ్‌పూర్‌లోని కాళేశ్వరం ప్రాజెక్టు డివిజన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)తో పాటు ఆ సర్టిఫికెట్‌పై కౌంటర్ సంతకం చేసిన రామగుండం ఎస్ఈపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 19న జారీ చేసిన మెమోలో కంప్లీషన్ సర్టిఫికెట్‌ను రద్దు చేయడమే కాకుండా ఈఈతో పాటు ఎస్ఈపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి వీలుగా వివరాలు అడిగారు.

విద్యుత్ ఉద్యోగులకు 20 శాతం ఫిట్‌మెంట్ !

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల వేతనాలను భారీగా పెంచే దిశగా డిస్కమ్‌లు అడుగులు వేస్తున్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరంలో 20 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తామని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీఈఆర్‌సీ)కి డిస్కమ్‌లు మంగళవారం తెలియజేశాయి. చివరిగా 2023 ఏప్రిల్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు 2022 ఏప్రిల్ 1 నుంచి వేతన సవరణ జరగ్గా 7 శాతం ఫిట్‌మెంట్ ఇస్తూ విద్యుత్ సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. గత పదేళ్లలో మూడు సార్లు వేతన సవరణ జరగ్గా ఉద్యోగుల వేతనాలు 180 శాతానికి పైగా పెరిగిన అంచనాలున్నాయి. వేతన సవరణతో పాటు సర్వీసు వెయిటేజీలు భారీగా ఇవ్వడమే ఇందుకు కారణం. అయితే, గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల డిస్కమ్‌లు భారీ నష్టాల్లో ఉన్నా 2026-27లో 20 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడానికి సుముఖత తెలుపుతూ టీజీఈఆర్‌సీకి సమాచారం ఇచ్చాయి.

ఆ వ్యాఖ్యలు మంచివి కావు

» ఆకతాయిల చర్యలకు బీఆర్ఎస్‌తో సంబంధం లేదు

» దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక/కేపీహెచ్‌బీకాలనీ/రాంనగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):మంత్రి కొండా సురేఖపై సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు, ప్రచారాలు సమాజానికి మంచివి కావని దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ.. కొన్నిశక్తులు తెలంగాణ నాయకత్వాన్ని పలుచన చేసే కుట్రలు చేస్తున్నాయని, ఇందులో పార్టీలకు అతీతంగా అందరూ బాధితులుగానే నిలబడుతున్నారని అన్నారు. 'ప్రజల శ్రేయస్సు కోరి.. తానే మంత్రి సురేఖను దుబ్బాకకు ఆహ్వానించాను. మంత్రి అంటే ఎంతో గౌరవం. ప్రజా జీవితంలో ఎన్నో త్యాగాలు చేయందే.. మహిళలు ఈ పదవి వరకు రాలేరు. వాళ్లపై కూడా వ్యక్తిగతం వ్యాఖ్యలు చేసే సంస్కృతి దాపురించింది. చిల్లర మనుషులు, సంస్కారం లేని వ్యక్తులు చేసే వ్యాఖ్యలను బీఆర్ఎస్‌కు ఆపాదించడం మంచిది కాదు. తెలంగాణ ఉద్యమం నుంచి ఆడబిడ్డలను గౌరవించే సంస్కృతి మాది. బతుకమ్మను గౌరవించుకున్నట్టుగానే ఆడబిడ్డలను నిండు మనస్సుతో గౌరవించే పార్టీ మాది. ప్రభుత్వం స్పందించి నిందితులను అరెస్ట్ చేయాలి' ఆయన ఆయన డిమాండ్ చేశారు. కాగా, మంత్రి కొండా సురేఖపై సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం కూకట్‌పల్లిలోని కేపీహెచ్‌బీలో కాంగ్రెస్ నాయకులు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు దిష్టిబొమ్మలను దహనం చేశారు. మరోవైపు.. మంత్రి సురేఖపై బీఆర్ఎస్ నేతలు చేసిన దుష్ప్రచారం చేసినందున మాజీ మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ విద్యానగర్ చౌరస్తాలో ఆయన కాన్వాయ్‌ను యూత్ కాంగ్రెస్ గ్రేటర్ అధ్యక్షుడు మోత రోహిత్ ఆయన అనుచరులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు.

నాబార్డు సీజీఎంగా ఉదయ్ భాస్కర్



చిక్కడపల్లి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నాబార్డు తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం)గా బీ ఉదయ్ భాస్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన ఆయనకు డెవలప్‌మెంట్ బ్యాంకింగ్‌లో 31 సంవత్సరాల అనుభవం ఉంది. ఏపీలోని బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయ కళాశాలలో పీజీ చేశారు. 1993లో కర్ణాటకలో నాబార్డులో చేరిన ఆయన ఏపీ, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో, ముంబైలోని ప్రధాన కార్యాలయంలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నాబార్డు వరంగల్ జిల్లా అభివృద్ధి అధికారిగా వాటర్‌షెడ్, గిరిజన అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేశారు.

తిరుపతన్నకు బెయిల్ నిరాకరణ

» పైఅధికార్లు చెప్పిన పనులు చేశాననడం సరికాదు

» చేయాల్సిన విధులు ఏమిటి? చేస్తున్న పనులేంటి?:హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో నాలుగో నిందితుడి (ఏ4)గా ఉన్న ఏఎస్పీ మేకల తిరుపతన్నకు హైకోర్టులో నిరాశ ఎదురయింది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ధర్మాసనం మంగళవారం కొట్టివేసింది. ప్రస్తుత కేసులో చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) రిపోర్ట్ వచ్చిందని, అందులో పిటిషనర్ సహా ఇతర నిందితుల మొబైల్, ల్యాప్‌ట్యాప్‌ల సమాచారం ఉందని ధర్మాసనం తెలిపింది. ఆ డేటాను విశ్లేషించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు, ఆరో నిందితుడు ఇంకా దొరకలేదని, వారంతా ఉన్నత పదవుల్లో ఉన్న పోలీసు అధికారులని గుర్తు చేసింది. ఫోన్ ట్యాపింగ్‌కు గురయిన వారి వివరాలతో పోలీసులు సమర్పించిన పత్రాలను ప్రాథమికంగా పరిశీలిస్తే నిందితులు ఉల్లంఘనలకు పాల్పడినట్లు తెలుస్తోందని వ్యాఖ్యానించింది. పిటిషనర్ సహా నిందితులంతా ఎస్ఐబీలో పనిచేశారు. నిషేధిత తీవ్రవాద సంస్థల సమాచార సేకరణకు ఏర్పాటు చేసిన ఎస్ఐబీని అప్పటి అధికార పార్టీ.. ప్రతిపక్ష నేతలు, ముఖ్యవ్యక్తులు, హైకోర్టు జడ్జిల వ్యక్తిగత సమాచారం సేకరణకు ఉపయోగించినట్లు ప్రాసిక్యూషన్ ఆరోపించింది. ఏఎస్పీ తిరుపతన్న తన 20 మంది బృందంతో కలిసి ప్రముఖుల వ్యక్తిగత సమాచారం సేకరించినట్లు తెలిపింది. ఎస్ఐబీ చీఫ్ చెప్పినట్లు చేశానని తిరుపతన్న అంటున్నప్పటికీ.. తాను చేస్తున్న పనిద్వారా తలెత్తబోయే పరిణామాలు ఏంటో తెలుసుకోవాల్సిన బాధ్యత ఆయనపై ఉందని ధర్మాసనం పేర్కొంది. తన అధికారిక విధి ఏంటి? తాను చేస్తున్నదేంటి? అనే విచక్షణ జ్ఞానం లేకుండా ప్రధాన నిందితుడు చెప్పినట్లు చేశానని తప్పించుకోవడం కుదరదని వ్యాఖ్యానించింది. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో బెయిల్ మంజూరు చేయలేమని పేర్కొంటూ పిటిషన్ కొట్టేసింది.

సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలతో సహకారం!

» రాజస్థాన్‌లో 27 మందిని అదుపులోకి తీసుకున్న రాష్ట్ర పోలీసులు

» వివరాలు వెల్లడించిన సీఎస్‌బీ చీఫ్

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు సమకూర్చి లావాదేవీలకు సహకరించిన ముష్కరుల బండారం బట్టబయలైంది. ఈ మేరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) పోలీసులు రాజస్థాన్‌లో రెండు వారాల పాటు మకాం వేసి.. స్పెషల్ ఆపరేషన్ నిర్వహించి వేర్వేరు ప్రాంతాల్లో నక్కిన 27 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిపై సైబర్ నేరాలకు సంబంధించి దేశవ్యాప్తంగా 2,223 కేసులున్నాయి. మన రాష్ట్రంలోనే 189 కేసులున్నాయి. కొందరిపై దేశవ్యాప్తంగా వివిధ చోట్ల సుమారు 200 దాకా కేసులున్నాయి. అయితే ఏ ఒక్క కేసులో ఏ రాష్ట్ర పోలీసులు కూడా వారిని అరెస్ట్ చేయకపోవడం విశేషం. వీరంతా 29 మ్యూల్ బ్యాంకు ఖాతాల నుంచి రూ. 11 కోట్లకుపైగా లావాదేవీలు జరిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎస్‌బీ చీఫ్ శిఖాగోయల్ వెల్లడించారు. పట్టుబడ్డవారంతా 30 ఏళ్లలోపువారేనని.. అంతా చదువుకున్న వారేనని.. వీరిలో విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు. ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో నమోదైన 189 కేసుల్లో సుమారు రూ. 9 కోట్లు దారిమళ్లించారని వివరించారు. పట్టుబడ్డ నిందితుల నుంచి 31 మొబైల్ ఫోన్లు, 37 సిమ్ కార్డులు, ఏడు చెక్‌బుక్‌లు, రెండు హార్డ్ డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం జుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితులను కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారించనున్నారు. ప్రాథమిక విచారణలో వీరితో పాటు మరో 33 మంది నిందితులకు ప్రమేయం ఉన్నట్లు తేలింది. కాగా సైబర్ నేరగాళ్లు అమాయకుల నుంచి దోచుకున్న డబ్బులు వివిధ ఖాతాలకు మళ్లిస్తుంటారు. ఇందుకోసం కమీషన్ ఆశచూపి మ్యూల్ బ్యాంకు (డబ్బులు డ్రా చేసుకునేందుకు ఇతరుల పేరుతో వారికి తెలియకుండా ఏర్పాటు చేసినవి) ఖాతాలు సమకూర్చుకుంటున్నారు. ఆయా ఖాతాల్లో జరిగే లావాదేవీల మేరకు రూ. 50 వేల నుంచి రూ.లక్ష దాకా కమీషన్ ముట్టజెపుతున్నారు. సైబర్ నేరగాళ్ల కోసం మ్యూల్ ఖాతాలు తెరిచేవారు ప్రత్యేకంగా సిమ్ కార్డు ఉపయోగించి ఎప్పుడు ఫోన్ స్విచ్‌ఆఫ్‌లోనే ఉంచుతున్నారు. వచ్చిన డబ్బులు, చెప్పిన ఖాతాల్లోకి దారిమళ్లించి వారి కమీషన్ వారు తీసుకుంటారు. ఒక్కో మ్యూల్ ఖాతాను గరిష్ఠంగా రెండు నెలలు ఉపయోగించుకుంటున్నారు సైబర్ నేరగాళ్లు. కమీషన్‌కు ఆశపడి బ్యాంకు ఖాతాలు ఇచ్చి సహకరిస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అలాంటివారిపైనా పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. కాగా అనుమానాస్పద లావాదేవీలు జరిగే ఖాతాలపై బ్యాంకర్లు నిరంతరం నిఘా ఉంచాలని శిఖాగోయల్ తెలిపారు. సైబర్ నేరగాళ్లకు బ్యాంకర్ల సహకారం ఉన్నట్లు తేలితే వారిపైనా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ నేరాల బారినపడితే గోల్డెన్ అవర్‌లో టోల్ ఫ్రీ నెంబరు 1930కు ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు.

మూసీ ప్రక్షాళన మీ నిర్ణయమే!

సరిహద్దులు, బఫర్ జోన్‌లను ఖరారు చేసిందెవరు..?.. ఆక్రమణలను తొలగించాల్సిందేనని ఆదేశాలివ్వలేదా?

» కాంగ్రెస్‌కు క్రెడిట్ దక్కుతుందన్న ఆక్కసుతో విమర్శలు

» కేటీఆర్‌పై మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం

» మూసీ ప్రక్షాళన ఆగదని స్పష్టీకరణ



హైదరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రక్షాళన బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయమేనని.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మూసీ నదిని ప్రక్షాళన చేయమని ఎవరైనా అడిగారా? అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించడం హాస్యాస్పదమని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా కొనసాగి మూసీ ప్రక్షాళనకు అనేక నిర్ణయాలు తీసుకున్న కేటీఆర్ ఇప్పుడు తమను ప్రశ్నించడం ఏమిటంటూ మండిపడ్డారు. "2017 మార్చి 25న మూసీ నది కాలుష్య నివారణతో పాటు రివర్ ఫ్రంట్ కోసం కార్పొరేషన్ ఏర్పాటు, దానికి ఛైర్మన్‌ను నియమించలేదా? అప్పుడు ప్రభుత్వం ఎవరిది? ప్రాజెక్టు కార్యాచరణపై మంత్రి హోదాలో కేటీఆర్ 2018లో సమావేశం ఏర్పాటు చేశారు. ఆక్రమణల లెక్కలు తీయాలని, అక్రమ కట్టడాలను తేల్చాలని, హద్దుల నిర్ధారణతో పాటు బఫర్ జోన్ తేల్చాలని కోరారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపకుండానే.. నెలలో యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని నిర్దాక్షిణ్యంగా ఆదేశించారు. నాడు అడ్డు తొలగించుకోవాలని చూసి.. నేడు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా ప్రవర్తిస్తూ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారు" అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీపై.. కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాల మినిట్స్‌ను శ్రీధర్‌బాబు మంగళవారం విడుదల చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లకు 2020లో కేటీఆర్ ఆదేశాలిచ్చారని.. అక్రమ కట్టడాలను కూల్చేయాలని 2021లోనూ చెప్పారని తెలిపారు.

8,480 అక్రమ కట్టడాలని తేల్చిందెవరు?

మూసీలో 8,480 అక్రమ కట్టడాలు ఉన్నట్లు గత ప్రభుత్వమే గుర్తించిందని, 2016లోనే జీవో విడుదల చేసి.. నదీ గర్భం నుంచి 50 మీటర్ల వరకు బఫర్ జోన్‌గా గుర్తించాలని చెప్పారని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. 15 వేలమంది నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని 2022లో నిర్ణయించారని చెప్పారు. ప్రక్షాళనను గత ప్రభుత్వం కాగితాలు, మాటలకే పరిమితం చేసిందని.. దీంతో చిన్న వర్షాలకూ మూసీ పరిసరాలు మునిగిపోతున్నాయని శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రజల ప్రాణాలు కాపాడడం, నదీ సుందరీకరణతో హైదరాబాద్‌ను తీర్చిదిద్దడం, మూడు జిల్లాల ప్రజలకు శుభ్రమైన నీరు, గాలి అందించేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపి.. వారికి ఇబ్బంది లేకుండా ... దీనిని పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మూసీ హద్దులపై 3 జిల్లాల పరిధిలో 55 కి.మీ. సర్వే చేశారని.. దాని ప్రకారమే తమ ప్రభుత్వంలో అధికారులు హద్దులు నిర్ధారించారని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. వారు చేసింది ఒప్పయితే.. తమది తప్పవుతుందా? అని ప్రశ్నించారు. విశ్వనగరం అనే పేరును నిజం చేయాలన్న లక్ష్యంతో గొప్ప కార్యక్రమాన్ని చేపడితే బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాళేశ్వరం, మల్లన్నసాగర్ ఇతర ప్రాజెక్టుల భూ నిర్వాసితుల విషయంలో ఎందుకు కనికరం చూపించలేదని మంత్రి నిలదీశారు. హైడ్రా, మూసీ నది విషయంలో మంచి చేయాలనే ముందుకువెళ్తున్నామని తెలిపారు. మూసీ నిర్వాసితులు స్వచ్ఛందంగా డబుల్ బెడ్‌రూ ఇళ్లకు వెళ్తున్నారని పేర్కొన్నారు. ఇదంతా చెప్పకుండా వ్యతిరేకిస్తున్న కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. డబుల్ ఇళ్లను మూసీ నిర్వాసితులకు తొలి ప్రాధాన్యంగా కేటాయిస్తామన్నారు. కొత్త రేషన్ కార్డుల పై మంత్రి స్పందిస్తూ.. ఈరోజు కమిటీ సమావేశమైందని, ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాంతాలను ఎంపిక చేశామని చెప్పారు. ఫ్యామిలీ కార్డులు అమలు చేశాక.. ప్రజల నుంచి వచ్చే సూచనలతో ఇతర ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో చేపడతామన్నారు.

స్వీడిష్ లైఫ్ సైన్సెస్ ప్రతినిధులతో భేటీ

శ్రీధర్‌బాబుతో స్వీడిష్ లైఫ్ సైన్సెస్ రంగానికి చెందిన సీఈవోల ప్రతినిధుల బృందం భేటీ అయింది. రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై ఆసక్తిని వెల్లడించారు. ప్రపంచ స్థాయి పోటీ ఎదుర్కొనే సమున్నత లక్ష్యంతో పరిశ్రమల అనుకూల వాతావరణాన్ని సృష్టించామని మంత్రి వారికి చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడం ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బయో ఏషియా-25ను వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనుంది. హెచ్ఐసీసీలో జరగనున్న ఈ భారీ అంతర్జాతీయ వేడుక లోగోను మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం విడుదల చేశారు.

పథకాల అమలుకు ప్రత్యేక అధికారులు!

ఉమ్మడి జిల్లాల వారీగా 10 మంది

సీనియర్ ఐఏఎస్‌ల నియామకం

వెంటనే జిల్లాలను సందర్శించాలి

జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలి: సీఎస్

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పథకాలు, కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. క్షేత్ర స్థాయిలో పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా గతంలో జిల్లాల్లో పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారుల ద్వారా పర్యవేక్షణ, సమన్వయాన్ని పెంపొందించాలని నిర్ణయం తీసుకుంది. అందుకే ప్రభుత్వం ఉమ్మడి జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించింది. పథకాల అమలుపై వీరు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తారు. అటు కలెక్టర్లకు, ఇటు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటారు. ఈ మేరకు 10 ఉమ్మడి జిల్లాలకు 10 మంది సీనియర్ ఐఏఎస్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది. దీనికి సంబంధించి సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రవాణా శాఖ కమిషనర్ ఇళంబర్తి; కరీంనగర్‌కు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్; నల్లగొండకు పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్; నిజామాబాద్‌కు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్; రంగారెడ్డికి సెర్ప్ సీఈవో డి.దివ్య; మహబూబ్‌నగర్‌కు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి; వరంగల్‌కు రోడ్లు-భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన దాసరి; ఖమ్మం జిల్లాకు ఖనిజాలు, భూగర్భ గనుల శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్; హైదరాబాద్‌కు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటలను నియమించింది. ఈ మేరకు ప్రత్యేక అధికారులు వెంటనే సంబంధిత జిల్లాలను సందర్శించి, కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను పకడ్బందీగా, ప్రభావశీలంగా అమలు చేసేలా చూడాలని తెలిపింది.

టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌తో జగ్గారెడ్డి భేటీ

పార్టీ కోసం పని చేసిన నేతలకు పదవులపై చర్చ

మహేశ్‌ను శాలువాతో సత్కరించిన వర్కింగ్ ప్రెసిడెంట్

హైదరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి భేటీ అయ్యారు. మహేశ్‌గౌడ్ బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారి ఆయన్ను కలిసిన జగ్గారెడ్డి.. శాలువాతో సన్మానించారు. గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై వారిద్దరూ చర్చించుకున్నారు. కష్టకాలంలో ఉన్నప్పుడు జిల్లాల్లో పార్టీనే నమ్ముకుని పని చేసిన నేతలు, కార్యకర్తలకు పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని జగ్గారెడ్డి ప్రస్తావించారు. టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి పని చేసిన మూడేళ్లూ.. కార్యనిర్వాహక అధ్యక్షుడి హోదాలో మహేశ్ కుమార్ గౌడ్.. పార్టీ నేతలందరినీ సమన్వయపర్చిన తీరును గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత అటు సీఎంను, ఇటు పీసీసీని, పార్టీ అనుబంధ సంఘాలు, నేతలు, కార్యకర్తలను మహేశ్‌గౌడే సమన్వయం చేసిన సంగతీ వారి మధ్య చర్చకు వచ్చింది. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నుంచి రావడమే కాకుండా.. మూడేళ్ల పాటు పార్టీని సంస్థాగతంగా నడిపిన తీరే అధిష్ఠానాన్ని ఆకర్షించిందని, అందుకే మహేశ్‌గౌడ్‌ను అధ్యక్షుడిగా ఎంపిక చేసిందని జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు.



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను శాలువాతో సన్మానిస్తున్న జగ్గారెడ్డి

రేవంత్ సర్కారు.. ఇక ఇంటికే

» ఆరు గ్యారెంటీల అమలుకు కాలం చెల్లింది

» కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా.. ఎండగడతాం: బీజేపీ నేత అభయ్ పాటిల్

» రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలి

» రాష్ట్రంలో సీఎం, డిప్యూటీ సీఎం ట్యాక్స్ వసూళ్లు

» పేదల ఇళ్లను కూల్చుతూ.. పెద్దలతో బేరాలు

» రేవంత్‌ది అరాచక పాలన: మహేశ్వర్‌రెడ్డి

» ప్రజలే రేవంత్ భరతం పడతారు: ఈటల

» ముగిసిన బీజేపీ రైతు హామీల సాధన దీక్ష



రైతు హామీ సాధన దీక్షలో ఎంపీలు ఈటల, అర్వింద్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్/కవాడిగూడ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అమలుకు కాలం చెల్లిందని.. రేవంత్ ప్రభుత్వం ఇంటికి వెళ్లే సమయం దగ్గర పడిందని బీజేపీ జాతీయ నేత, పార్టీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తాము విస్తృత స్థాయిలో ఎండగట్టబోతున్నామని ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి తుగ్లక్‌ను తలపిస్తున్నారని, కుటుంబ ప్రయోజనాల కోసమే ఆయన సీఎం అయ్యారని విమర్శించారు. ధర్నాచౌక్‌లో బీజేపీ చేపట్టిన 24 గంటల రైతు హామీల సాధన దీక్ష మంగళవారం ముగిసింది. బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డికి అభయపాటిల్ నిమ్మరసం అందించి దీక్షను విరమింపచేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్, అరాచక పాలన సాగిస్తూ, హామీల అమలును గాలికొదిలేశారని మండిపడ్డారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి, ఢిల్లీకి హైదరాబాద్‌కు చక్కర్లు కొడుతున్నారని విమర్శించారు. పేదల ఇళ్లను కూలుస్తూ, పెద్దల ఇళ్లతో బేరాలు చేసుకుంటూ.. ఆ డబ్బులను ఢిల్లీతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు అందిస్తున్నారని ఆరోపించారు. బీట్యాక్స్ పేరు మీద ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేస్తున్న వసూళ్లను ఢిల్లీకి కప్పం కడుతున్నారా..? లేదా జేబులో వేసుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. ప్రభుత్వ అవినీతి అక్రమాలను అసెంబ్లీ వేదికగా, ప్రజా క్షేత్రంలో ఎండగట్టామని తెలిపారు. సివిల్ సప్లయ్స్ కుంభకోణం, యూ ట్యాక్స్, బీ ట్యాక్స్, ఆర్ ట్యాక్స్, ఆర్ ఆర్ ట్యాక్స్, ట్రిపుల్ ఆర్ ట్యాక్స్, ఎగ్జిమ్ బ్యాంక్ గోల్ మాల్, సుంకిశాల నిర్లక్ష్యం, అమృత్ నిధుల దుర్వినియోగం.. ఇలా ఎన్నో అవినీతి, అక్రమాలను ఆధారాలతో బయటపెట్టామని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ రైతు దీక్ష వల్ల కాంగ్రెస్ పార్టీకి రైతులను గుర్తు చేసే మంచి సందర్భం వచ్చిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. "రైతుల ఆదాయాన్ని మోదీ ఎక్కడ రెట్టింపు చేశారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అడుగుతున్నారట. 2014లో మోదీ ప్రధాని అయినప్పుడు కనీస మద్దతు ధర ఎంత ఉందో.. ఇప్పుడు ఎంత ఉందో..? కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలి. మోదీ 22 పంటలను జాతీయ పంటలుగా గుర్తించారు. పసుపు ధర రెట్టింపు పలుకుతోంది" అని వివరించారు.

హైడ్రాతో కక్ష సాధింపు: కొండా

సీఎం రేవంత్‌రెడ్డి ఎవరి మాటా వినని సైకో అని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆయన చేసిన మోసానికి ప్రజలే భరతం పడతారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని అన్నారు. రోజుకో మాటతో అధికారులు తప్పించుకుంటున్నారంటే.. హైడ్రా ఎంత పేలవంగా ఉందో అర్థమవుతోందన్నారు. హైడ్రా పేరిట బీజేపీ కార్పొరేటర్ నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల జోలికి మాత్రం వెళ్లడం లేదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. వ్యాపార సంస్థల ప్రకటనల్లాగే కాంగ్రెస్ ఎన్నికల హామీలు ఇచ్చి మోసం చేసిందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. రుణమాఫీ విషయంలో షరతులు పెట్టి.. రేవంత్ రైతులను ముంచారని మండిపడ్డారు. ఈ దీక్షలో ఎంపీలు నగేశ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ పాల్వాయి హరీశ్, సూర్యనారాయణ గుప్తా, రామారావుపాటిల్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో బతుకమ్మ!

» నేటి నుంచి 9 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు

» ఉత్సవాలకు హాజరుకానున్న సీఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పల్లె, పట్నం అన్న తేడాలేకుండా ఆనందోత్సాహాలతో జరుపుకొనే బతుకమ్మ ఉత్సవాలు బుధవారమే ప్రారంభం కానున్నాయి. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈసారి రవీంద్రభారతిలో బతుకమ్మ సంబరాలను నిర్వహించేందుకు ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసింది. సాంస్కృతిక శాఖ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం ఎంగిలిపూల బతుకమ్మతో వేడుకలను ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా ఒకొక్క పువ్వేసి చందమామ పుస్తకాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరిస్తారు. 3న రవీంద్రభారతి ఆడిటోరియంలో అటుకల బతుకమ్మ వేడుకలు జరుగుతాయి. ముద్దపప్పు బతుకమ్మ వేడుకల సందర్భంగా 4న ఉదయం కవిసమ్మేళనం, సాయంత్రం వసుమతి వరకాల బృందం ఆధ్వర్యంలో కాళి- భద్రకాళి పేరిణి నృత్యరూపకంను ప్రదర్శించనున్నారు. 5న సాయంత్రం నానబియ్యం బతుకమ్మ ఉత్సవాలు, 6న సాయంత్రం అట్ల బతుకమ్మ వేడుకలు జరుగుతాయి. అదేరోజు ఎస్పీ బాలసుబ్రమణ్యం 'స్వర నీరాజనం సంగీత కార్యక్రమం జరుగుతుందని శాఖ అధికారులు తెలిపారు. 7న అలక బతుకమ్మ సందర్భంగా ఆటపాటలు ఉండవు. 8వ తేదీన వేపకాయల బతుకమ్మ వేడకలు, 9న వెన్నెల ముద్ద బతుకమ్మ వేడుకలు జరుగుతాయి. 10న సద్దుల బతుకమ్మ సందర్భంగా పలువురు ప్రముఖుల సమక్షంలో పూజలు జరుగుతాయి. అనంతరం అమరవీరుల స్మారకం నుంచి వెయ్యి బతుకమ్మలతో మహిళలు, జానపద గిరిజనకళాకారుల నృత్యాలు, ఆటాపాట మధ్య టాంక్‌బండ్‌కు ఊరేగింపు జరుగుతుంది. ఆ రోజు సాయంత్రం 7 గంటలకు ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మల ఆటపాటలు నిర్వహిస్తారు. ఈ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డితో పాటుపలువురు ప్రముఖులు పాల్గొంటారు.

గవర్నర్, సీఎం బతుకమ్మ శుభాకాంక్షలు

ప్రకృతిని, పువ్వులను ఆరాధిస్తూ మహిళలు వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండగ బతుకమ్మ అని సీఎం రేవంత్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు వారు వేర్వేరుగా బతుకమ్మ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సాముహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు బతుకమ్మ నిదర్శనమని రేవంత్ పేర్కొన్నారు. ప్రకృతిని తల్లిగా భావించి జరుపుకునే పవిత్రమైన పండగ బతుకమ్మ అని గవర్నర్ అన్నారు. కాగా, అహింసను ఆయుధంగా మలచిన సమర యోధుడు, మానవాళికి మానవత్వం నేర్పిన మహనీయుడు మహాత్మా గాంధీ అని సీఎం రేవంత్ అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా సీఎం రేవంత్.. జాతిపిత గాంధీని స్మరించుకున్నారు. అలాగే, బుధవారం, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

మల్లన్నసాగర్ నిర్వాసితుల గోడు పట్టదా..?

» నాడు వాళ్ల ఇళ్లను నువ్వే కూల్చేశావు కదా

» హరీశ్‌రావుపై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ధ్వజం



తుక్కాపూర్ గ్రామ సమస్యలపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని చూపుతున్న మైనంపల్లి

తొగుట/గజ్వేల్, అక్టోబరు1: హైడ్రా బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న హరీశ్‌రావు ముందుగా మల్లన్నసాగర్ నిర్వాసిత కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు డిమాండ్ చేశారు. హరీశ్‌రావు దత్తత తీసుకున్న గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామంలో కొన్ని ఇళ్లను స్వయంగా బుల్డోజర్లతో కూల్చేశాడని.. నేడు ఆయనే బుల్డోజర్లకు అడ్డం పడుకుంటానని దొంగ ఏడుపు ఏడుస్తున్నాడని విమర్శించారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్ గ్రామాన్ని మైనంపల్లి మంగళవారం సందర్శించారు. మల్లన్నసాగర్ నిర్వాసితులతో మాట్లాడారు. తమ భూములు మొత్తం ప్రాజెక్టులో మునిగాయని, కేవలం ఊరే మిగిలిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ భూనిర్వాసితులతో మైనంపల్లి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో మూసీ నిర్వాసితులకు తన ఆస్తి మొత్తం రాసిస్తానని.. దమ్ముంటే కేటీఆర్, హరీశ్‌రావు తమ ఆస్తులు రాసివ్వాలని సవాల్ విసిరారు. మూసీ పక్కన ఉన్న పేద వాళ్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ముకేశ్ అంబానీ తలచుకుంటే మధ్య తరగతి వాళ్లు తీసుకున్న లోన్లు మాఫీ చేయొచ్చని మైనంపల్లి అన్నారు.

ప్రత్యామ్నాయం చూపాకే కూల్చాలి: కూనంనేని

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో అనధికారిక నిర్మాణాలు ఉండి.. అందులో పేదలు నివాసం ఉంటే వారికి ప్రత్యామ్నాయం చూపిన తరువాతనే కూల్చివేతలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. హైడ్రా పేరుతో పేదలను భయపెట్టడం తగదని సూచించారు. ప్రభుత్వ, చెరువుల స్థలాల్లో నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు, బీఆర్ఎస్ హయాంలో జీవో 317తో ఉపాధ్యాయులను తమ సొంత జిల్లాల నుంచి నిర్బంధంగా ఇతర జిల్లాలకు బదిలీ చేశారని, ఫలితంగా వారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

క్షీరసాగర మథనంలో మొదట విషమే వస్తుంది

» ఆ తర్వాత వచ్చేది అమృతమే: ఎంపీ చామల

హైదరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మూసీ నది ప్రక్షాళన, హైడ్రా అంశాలపై బీఆర్ఎస్ పార్టీ విమర్శలను కాంగ్రెస్ నాయకులు తిప్పికొట్టారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి బీఆర్ఎస్ విషం చిమ్ముతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షీరసాగర మథనంలో మొదట విషమేవస్తుందని, ఆ తర్వాత వచ్చేది అమృతమేనని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అమృతం రావడానికి కొంత కాలం ఆగాలన్నారు. హైదరాబాద్‌లో నాలాలపై 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నాయని, వాటి కూల్చివేతకు ప్రజలు సహకరించాలని మాజీ సీఎం కేసీఆర్ గతంలో అసెంబ్లీ సాక్షిగా చెప్పలేదా అని గుర్తుచేశారు. మూసీ ప్రక్షాళన, హైడ్రా విషయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎందుకు మాట్లాడడం లేదని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతగా ఆయనకు క్యాబినెట్ ర్యాంక్ ఇచ్చింది ఫాంహౌస్‌లో పడుకోవడానికా అని నిలదీశారు. రాహుల్ గాంధీకి హరీశ్‌రావు లేఖ రాసింది మూసీ బాధితుల కోసం కాదని, సీఎం రేవంత్ రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేకన్నారు.

కూల్చివేతలపై ప్రజలే తిరగబడతారు:లక్ష్మణ్

» మంత్రి సురేఖకు జరిగిన అవమానానికి చింతిస్తున్నా

» మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు

న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మూసీ రివర్ ఫ్రంట్ పేరుతో చేపట్టిన కూల్చివేతలను ఆపకపోతే ప్రజలే తిరగబడి రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చివేస్తారని ఎంపీ లక్ష్మణ్ హెచ్చరించారు. జనాన్ని భయాందోళనలకు గురిచేస్తూ, ఇళ్లను కూల్చడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందని విమర్శించారు. మూసీ కూల్చివేతలను బీజేపీ అడ్డుకుంటుందని తెలిపారు. గ్యారెంటీల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి సీఎం రేవంత్ హైడ్రా పేరుతో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రచారాన్ని లక్ష్మణ్ ఖండించారు. కాగా, మంత్రి కొండా సురేఖ పట్ల సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టిన విషయంలో ఎందుకు స్పందించడం లేదని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నిలదీశారు. తన వల్ల మంత్రికి జరిగిన అవమానానికి చింతిస్తున్నానని తెలిపారు. పోస్టు పెట్టిన అకౌంట్‌లో కేసీఆర్, హరీశ్ ఫొటోలు ఉన్నాయని తెలిపారు. తప్పుడు పోస్టు పెట్టిన వారిని తక్షణం పోలీసులకు అప్పగించాలని, పార్టీ నుంచి బహిష్కరించాలని హరీశ్ ను డిమాండ్ చేశారు.

దూకుడు పెంచండి.. విమర్శలను తిప్పికొట్టండి

» ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి: మహేశ్‌గౌడ్

హైదరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీరంతా అద్భుతంగా పని చేశారు. కేసీఆర్‌ను గద్దె దించడంలో మీ పాత్ర చాలా ఉంది. పార్టీ అధికారంలోకి వచ్చాక మీరు విశ్రాంతి తీసుకుంటే ఎట్లా?' అంటూ వివిధ కార్పొరేషన్ చైర్మన్లను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. దూకుడు పెంచాలని, హైడ్రా, మూసీతోపాటు వివిధ అంశాలపై సోషల్ మీడియా ద్వారా ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తోన్న విమర్శలను తిప్పికొట్టాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రభుత్వంలోని వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతో గాంధీభవన్‌లో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. అనుభవం, పనితీరు, సామాజిక, స్థానికత తదితర అంశాల ప్రాతిపదికన 40 మందికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే, ప్రతిపక్షంలో ఉండగా అద్భుతంగా పని చేసిన వారు అధికారంలోకి వచ్చి పదవులు పొందాక కాస్త విశ్రాంతి తీసుకుంటున్నట్టుగా కనిపిస్తోందని మహేష్ గౌడ్ అన్నారు. రోజులో 18 గంటలపాటు పని చేస్తూ సీఎం, మంత్రులు రోజుకో పథకాన్ని తీసుకొస్తూ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కానీ, ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో దూకుడు పెంచాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని దిశానిర్దేశం చేశారు.

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ నిర్ధారణకు రీ సర్వే చేయాలి

» మునిసిపల్ శాఖకు మజ్లిస్ ఎమ్మెల్యేల వినతిపత్రం

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మూసీనది ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల సరిహద్దులను నిర్ధారించేందుకు రీ సర్వేకు ఆదేశించాలని మజ్లిస్ శాసనసభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టు పేరిట నది పరిసర ప్రాంత నివాసాలను బలవంతంగా కూల్చివేసే చర్యలకు స్వస్తి పలకాలని కోరారు. ఎలాంటి సర్వే, విధి విధానాలు పాటించకుండా ఏళ్లుగా ఆ ప్రాంతంలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను భయాందోళనకు గురిచేసి ఇళ్లను కూల్చివేస్తున్నారని మజ్లిస్ ఎమ్మెల్యేలు మంగళవారం సచివాలయంలో మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్‌కు సమర్పించిన వినతి పత్రంలో ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు హయాంలో మూసీ నది ప్రాంతాన్ని సర్వే చేసి ఖరారు చేసిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల సరిహద్దులను పరిగణనలోకి తీసుకోకుండా అధికారులు చట్టాన్ని అతిక్రమించి వ్యవహరిస్తున్నారని మజ్లిస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. విధి విధానాలను అనుసరించకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్న సర్వే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖలు ఒక వేళ సర్వే నిర్వహించిన పక్షంలో ప్రభావిత కుటుంబాలకు ముందస్తు నోటీసులు జారీ చేయాలని కోరారు. దశాబ్దాలుగా నివసిస్తున్న కుటుంబాలకు బల్దియా ఇంటి నెంబర్‌లను సైతం కేటాయించిందని గుర్తు చేశారు. వీటిని అక్రమ నిర్మాణాల పేరిట ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు.





మూసీ పరివాహక ప్రాంతం మలక్‌పేటలోని శంకర్‌నగర్ బస్తీలో రివర్ బెడ్ మార్కింగ్ ఇళ్లను ఖాళీ చేస్తున్న నిర్వాసితులు

ఖాళీ చేసిన ఇళ్ల కూల్చివేత

(మొదటిపేజీ తరువాయి)

ఇళ్ల తాళాలు అప్పగించాకనే.. మూసీలో ఖాళీ చేసిన ఇళ్లను పడగొడుతున్నారు. ప్రజలు నివసిస్తున్న వాటి జోలికి వెళ్లడం లేదు. మంగళవారం రెవెన్యూ అధికారులు, పోలీసుల పర్యవేక్షణలో హైదరాబాద్‌లోని నాంపల్లి, సైదాబాద్, హిమాయత్‌నగర్ మండలాల పరిధి శంకర్‌నగర్, వినాయక వీధిలో ఇళ్ల కూల్చివేత చేపట్టారు. ఈ ప్రాంతాల్లో 333 నిర్మాణాలుండగా 300 ఇళ్లకు రివర్ బెడ్ మార్కింగ్ పెట్టారు. 83 ఇళ్లను పడగొట్టినట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఎక్కువగా రేకుల షెడ్లు ఉన్నాయి. ఇరుకు గల్లీల్లో ఉండడంతో పొక్లెయిన్లు లేకుండా కూలీలను ఏర్పాటు చేసి నెమ్మదిగా పడగొడుతున్నారు. ఇంటి సామగ్రిని తీసుకెళ్లేందుకు నిర్వాసితులకు అవకాశం కల్పించారు. వస్తువుల తరలింపునకు ప్రత్యేక వాహనాలను అందుబాటులో ఉంచారు. నిర్వాసితులను మలక్‌పేట్‌లోని పిల్లి గుడిసెలు, ఉప్పల్‌లోని ప్రతాప్ సింగారంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయానికి తరలిస్తున్నారు. కాగా, శంకర్‌నగర్‌లో కొందరు నిరసన వ్యక్తం చేశారు. చిన్న డబుల్ బెడ్ రూంలలో పెద్ద కుటుంబాలు ఎలా ఉంటాయని వాపోయారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయగా పోలీసులు సముదాయించారు. మూసీతో తలెత్తే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చాలా మంది ఖాళీ చేసేందుకు ముందుకొస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు పిల్లలున్న కుటుంబాలు సంతోషంగా వెళ్తుండగా, 6 నుంచి 10 మంది ఉన్నవారు భావోద్వేగానికి గురవుతున్నారు. శనివారం నుంచి 148 మంది వెళ్లినట్లు హైదరాబాద్ ఆర్డీవో మహిపాల్ తెలిపారు. నాంపల్లి నుంచి జియాగూడలోని డబుల్ బెడ్‌రూంలకు 24 మందిని తరలించినట్లు చెప్పారు.

అందరికీ ఒకే విధంగానా?

మూసీ సుందీకరణ ప్రాజెక్టులో.. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో డ్రోన్ సర్వే ద్వారా 2,166 నిర్మాణాలను గుర్తించారు. 1,478 ఇళ్లకు రివర్ బెడ్ మార్కింగ్ వేశారు. హైదరాబాద్ జిల్లాలో 1,595 నిర్మాణాలకు గాను 1,333కు మార్కింగ్ పెట్టారు. అధికారులు కౌన్సెలింగ్ ఇస్తూ డబుల్ బెడ్‌రూమ్‌లకు తరలించే చర్యలు తీసుకుంటున్నారు. అయితే, నిర్వాసితుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు మూసీ ఇబ్బందులు తీరినట్లేనని భావిస్తుండగా.. మరికొందరు తమకు తీరని అన్యాయం చేస్తున్నారని విలపిస్తున్నారు. 30, 40 గజాల్లో ఉంటున్నవారికి, 100-150 గజాల్లో రూ.లక్షలతో ఇల్లు కట్టుకున్నవారికి డబుల్ బెడ్‌రూమ్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. కాగా, డబుల్ బెడ్ రూం ఇళ్లకు వెళ్లినవారిలో కొందరు సౌకర్యాలు లేవని ఆరోపిస్తున్నారు. అయితే, అప్పటికే ఆ ఇళ్లలో ఉన్నవారు సహకరించడం లేదని.. ఈ సమస్య నివారణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పారు. మూసీ నిర్వాసితుల సమస్యలు తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు.

సామాన్యులకు నష్టం కలిగించను

(మొదటిపేజీ తరువాయి)

జరిపారు. అక్రమ నిర్మాణాలను కూల్చే విషయంలో హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో వారితో ఆయన చర్చలు సాగినట్లు తెలిసింది. ఇప్పటివరకు హైడ్రా అధ్వర్యంలో జరిగిన కూల్చివేతలు, వాటిపై వచ్చిన ప్రతిస్పందనల గురించి ముఖ్యమంత్రి వివరించారు. ఈ చర్యలతో ప్రభుత్వానికి ప్రజలలో చాలా మంచి పేరు వచ్చిందన్నారు. దానిని సహించలేక ప్రతిపక్షం ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలుచేసే ప్రచారాన్ని ఉధృతంగా చేస్తోందని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో వర్షాలు, వరదల మూలంగా ఏర్పడుతున్న కల్లోల పరిస్థితులను అరికట్టాలంటే ఇలాంటి చర్యలు తప్పవని ఆయన చెప్పారు. న్యాయస్థానానికి తగిన వివరణలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సామాన్య ప్రజలకు, బడుగు, బలహీన వర్గాలకు నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలన్నదే తన ఉద్దేశమని ఆయన వివరించినట్లు తెలిసింది. నిర్వాసితులకు న్యాయం చేసేందుకు, ప్రత్యామ్నాయ నివాస ఏర్పాట్లు కల్పించేందుకు తగిన ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. హైకోర్టు చేసిన వ్యాఖ్యలు గురించి ఆయన అభిషేక్ సింఘ్వీ సలహాలను కోరినట్లు సమాచారం. ఇటీవల జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురైన ఖర్గేను పరామర్శించిన రేవంత్ ఆయనతో రాష్ట్రంలో ఇటీవల చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలను వివరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కేసీ వేణుగోపాల్‌తో కూడా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై చర్చించారు. హరియాణా ఎన్నికలలో తలమునకలై ఉన్నందువల్ల రాహుల్‌గాంధీని కలుసుకోలేకపోయారు. హరియాణా ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత మరోసారి రమ్మని కేసీ ఆయనకు సూచించినట్లు తెలిసింది. సీఎం తదుపరి పర్యటనలో త్వరలో చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణపై వివరంగా చర్చించే అవకాశాలున్నాయి. కాగా, రాత్రి హైదరాబాద్‌కు సీఎం రేవంత్‌రెడ్డి తిరుగు పయనమయ్యారు.

రాష్ట్రానికి 416 కోట్ల వరద సాయం

మోదీ, అమిత్ షాకు కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు

న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా ఇటీవల వరదలతో నష్టపోయిన 14 రాష్ట్రాలకు కేంద్రం రూ.5,858.6 కోట్లను విడుదల చేసింది. ఇందులో ఏపీకి రూ.1,036 కోట్లు, తెలంగాణకు రూ.416.8 కోట్లను అందించింది. ఈ నిధుల్లో అత్యధికంగా మహారాష్ట్రకు రూ.1,492 కోట్లు దక్కాయి. గుజరాత్‌కు రూ.600 కోట్లు, హిమాచల్ ప్రదేశ్‌కు రూ.189 కోట్లు, కేరళకు రూ.145 కోట్లు, మణిపూర్‌కు రూ.50 కోట్లు, నాగాలాండ్‌కు రూ.25 కోట్లు వచ్చాయి. గత నెలలో భారీ వర్షాలతో నష్టపోయిన రాష్ట్రాల్లో కేంద్ర బృందాలు పర్యటించి, ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రధాని మోదీ ఈ నిధులు విడుదల చేశారని కేంద్రం పేర్కొంది. కాగా, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి.. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు తెలిపారు.

కమీషన్లు రావనే మూసీ ప్రక్షాళన చేయలే!

» వెయ్యి కోట్లు అప్పు తెచ్చి ఏం చేశారు?

» ప్రజారోగ్యం కోసమే మూసీ ప్రక్షాళన

» జనాన్ని రెచ్చగొడుతున్న కేటీఆర్, హరీశ్ : మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల పేరిట లక్షల కోట్ల రూపాయలు దోచుకోవడం బీఆర్ఎస్ నైజమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పనుల్లో అక్రమాలంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజారోగ్యం దృష్ట్యా సీఎం రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణకు సిద్ధమవుతుంటే దాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ వచ్చాక మూసీ కోసం రూ.వెయ్యి కోట్లు అప్పుతెచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని ఏం చేసిందని ప్రశ్నించారు. కాళేశ్వరం పేరిట లక్ష కోట్లు సంపాదించుకున్నారని.. పేదలకు ప్రయోజనం కలిగించే మూసీని బాగు చేస్తే కమీషన్ రాదనే ఆ పనులను ముట్టుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల నిర్వాకం వల్ల హైదరాబాద్‌లో నిత్యం 2000 ఎంఎల్‌డీల వరకు మురుగు, రసాయనాలతో కూడిన వ్యర్థజలాలు మూసీలో కలుస్తున్నాయని.. దమ్ముంటే మూసీ పీడిత ప్రాంతాలకు రావాలని సవాల్ చేశారు. మూసీని శుద్ధి చేయకపోతే భవిష్యత్తులో మనుషులే మిగలరని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ప్రతిపాదనను బీఆర్ఎస్ అడ్డుకొంటే ఆ ప్రాంతంలో నివసించే ప్రజలంతా చనిపోవాలా? అని నిలదీశారు. అమాయక ప్రజలను రెచ్చగొట్టి, అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు మూసీ నది ఒడ్డున నెల రోజులపాటు నివాసం ఉంటే.. అక్కడి ప్రజల బాధలేమిటో తెలుస్తాయని చెప్పారు. కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేకు మూసీ చైర్మన్ పదవి ఆశ చూపి చిల్లర రాజకీయం చేసిన కేసీఆర్.. ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారని నిలదీశారు. మూసీ పీడిత గ్రామాలకు వచ్చి ప్రజల ఇబ్బందులు తెలుసుకోవాలని, అందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు బస్సును ఏర్పాటు చేస్తానని మంత్రి చెప్పారు. తాను కూడా వస్తానని, స్థానిక ప్రజలే మీకు బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. మూసీ శుద్ధిలో భాగంగా నిరాశ్రయులయ్యే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రజల ఆమోదంతోనే ఈ ప్రక్రియ కొనసాగిస్తామని చెప్పారు.

ధనిక, పేద తేడా లేకుండా హెల్త్‌ప్రొఫైల్!

» ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ కార్డులు

» ఆర్డీవో స్థాయిలో పైలట్ ప్రాజెక్టు పర్యవేక్షణ

» రేపు ప్రారంభించనున్న సీఎం

» దసరా లోపు లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు: పొంగులేటి



హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబానికి హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ప్రొఫైల్ రూపొందించి, విశిష్ట సంఖ్య (యూనిక్ నంబర్)తో స్మార్ట్ కార్డు ఇవ్వడమే ఫ్యామిలీ కార్డు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సామాన్య ప్రజలకు సాధ్యమైనంత మేలు చేయాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డును తీసుకొస్తోందని వెల్లడించారు. అత్యంత ప్రాధాన్యం ఉన్న ఈ కార్డుల జారీలో పొరపాట్లకు తావులేకుండా, కుటుంబ సభ్యుల వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయం నుంచి మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి సంబంధించి 119 నియోజకవర్గాల్లోని 238 ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్నామని వివరించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక పట్టణ, ఒక గ్రామీణ ప్రాంతాన్ని ఎంచుకోవాలని సూచించారు. 3 నుంచి 7వ తేదీ వరకు ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరించాలన్నారు. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి నియోజకవర్గానికి ఆర్డీవో స్థాయి, జోనల్ కమిషనర్ స్థాయి వారిని ప్రత్యేక అధికారులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 3న పైలట్ ప్రాజెక్టును సీఎం ప్రారంభిస్తారన్నారు. దాని ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు.

ఎల్ఆర్ఎస్ ముందుకు సాగడం లేదు

నాలుగేళ్ల నుంచి లక్షలాది మంది ఎల్ఆర్ఎస్ కోసం ఎదురు చూస్తున్నారని, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలని మంత్రి పొంగులేటి కలెక్టర్లను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదన్నారు. కొన్ని జిల్లాల్లో వేల సంఖ్యలో దరఖాస్తులు ఉంటే పదుల సంఖ్యలో కూడా పరిష్కరించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పట్టణ అభివృద్ధి సంస్థ (యూడీఏ)ల పరిధి పెంపు, కొత్త యూడీఏల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. గత ప్రభుత్వం అరకొరగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించిందని, ఇందులో కొన్ని మాత్రమే పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. పూర్తయిన ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి, దసరాలోపు ఇళ్లను అందించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.

చీపుర్లు, రోకళ్లతో సిద్ధంగా ఉండండి

» చాకలి ఐలమ్మ, రాణిరుద్రమ మీకు స్ఫూర్తి

» మనకేంది అనుకుంటే.. మొదటికే మోసం

» మూసీ సుందరీకరణపై మేమూ దృష్టి పెట్టాం

» పేదలకు ఇబ్బంది అని కేసీఆర్ వద్దన్నారు

» హైకోర్టు మందలించినా సిగ్గు, లజ్జ లేదు

» 'బాధితులకు బీఆర్ఎస్ భరోసా'లో కేటీఆర్



అంబర్‌పేట నియోజకవర్గం గోల్నాక తులసిరాంనగర్(లంక)లో మూసీ బాధితులతో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్ సిటీ/గోల్నాక/హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): "పక్క వాళ్ల ఇళ్లు కూలగొడుతున్నరు మనకేంది.. వాళ్లతో పంచాయతీ ఉందని మీరు అనుకోవద్దు. ఇయ్యాల వాళ్ల వంతు.. రేపు అదే బుల్డోజర్ మీ వద్దకు వస్తుంది. నలుగురు బ్రోకర్ గాళ్లను పంపి విభేదాలను ఇచ్చగొట్టే ప్రయత్నం చేస్తరు. మన ప్రాంతానికి బుల్డోజర్లు వస్తున్నయంటే అందరూ ఒక్కటి కావాలి. యంత్రాలు, అధికారులను అడుగు పెట్టనీయొద్దు. మన ఇళ్ల మీదకు వస్తున్నారంటే.. ఒక్కో మహిళ చీపుర్లు, రోకళ్లు చేతబట్టాలి. చాకలి ఐలమ్మ, రాణిరుద్రమల్లా పోరాడాలి" అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్ అంబర్‌పేట నియోజకవర్గంలోని గోల్నాక తులసిరాంనగర్(లంక)లో జరిగిన 'మూసీ బాధితులకు బీఆర్ఎస్ భరోసా' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానికులతో మాట్లాడి వారి బాధలు తెలుసున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం పేదలకు బతుకమ్మ, దసరా పండుగ సంతోషం లేకుండా చేస్తోందని మండిపడ్డారు. పేదల ఇళ్లు కూలగొట్టి రూ.1.50 లక్షల కోట్లతో మాల్, హోటల్ కడతామంటున్నారని, దీంతో ఎవరికి లాభమనిని ప్రశ్నించారు. ఇళ్లలో ఎవరూ లేని సమయంలో వస్తారని, అందరూ వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని.. ఒక్క మెసేజ్‌తో అప్రమత్తంగా ఉండాలని స్థానికులకు సూచించారు. మూసీ సుందరీకరణ చేయాలని తమ ప్రభుత్వ హయాంలోనూ భావించామని, 28 వేల పేదల ఇళ్లు తొలగించాల్సి వస్తుందంటే.. కేసీఆర్ సూచనతో ప్రాజెక్టును పక్కన పెట్టామని కేటీఆర్ తెలిపారు. రేవంత్‌రెడ్డి మాత్రం రూ.1.50 లక్షల కోట్లతో పేదలను ఆగం చేసే ప్రాజెక్టు చేపడుతున్నారని ఆరోపించారు. తాము రూ.16 వేల కోట్లతో ప్రతిపాదించిన ప్రాజెక్టు పది రెట్లు ఎలా పెరిగిందని ప్రశ్నించారు. మార్క్ చేసిన ఇళ్లపై ఆర్‌బీ ఎక్స్ అని రాస్తున్నారు.. వాటిని చెరిపేసి కేసీఆర్ అని రాయండి.. ఎవడు వచ్చి టచ్ చేస్తడో చూస్తామన్నారు. నిన్ననే హైకోర్టు ప్రభుత్వాన్ని, హైడ్రాను మందలించింది అయినా రేవంత్‌కు సిగ్గు, లజ్జా లేకుండా మలక్‌పేట నియోజకవర్గంలో కూల్చివేతలు ప్రారంభించారని విమర్శించారు. మీకు కష్టం వస్తే ఎమ్మెల్యే వచ్చాడు.. మీ ఓట్లతో గెలిచిన ఎంపీ ఎక్కడ అని సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నించారు. పేదలను ఆగం చేసేందుకు రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి ఒక్కటయ్యారని, అందుకే ఇక్కడి ఎంపీ మాట్లాడడం లేదన్నారు.

ఫిరాయింపులపై రెండు మాటలా?

'పార్టీ ఫిరాయింపులపై హిమాచల్‌లో నీతులు చెబుతారు. తెలంగాణలో గేతులు తప్పుతారు? యూపీలో బుల్డోజర్‌రాజ్ తప్పంటారు. హైదంరాబాద్‌లో మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ఒప్పంటారు..! ఇదేం నీతిమాలిన.. అవకాశవాద రాజకీయం రాహుల్ గాంధీజీ' అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. మరోవైపు.. కేటీఆర్ వాహనంపై కాంగ్రెస్ వర్గం దాడి చేయడం సరికాదని మాజీ మంత్రులు, హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి తదితరులు ఖండించారు.

కూల్చివేతల్లో గాయపడ్డ హోంగార్డు తలలో రక్తం గడ్డకట్టింది

» పుర్రె క్రాక్ వచ్చి.. మాట పడిపోయింది

» సర్జరీపై వైద్యులు ఆలోచిస్తున్నారు

» ప్రభుత్వం ఆదుకోవాలి: హోంగార్డులు

» హోంగార్డుకు అండగా ఉంటాం: ఎస్పీ

» హోంగార్డులంటే అంత చులకనా?: హరీశ్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్/సంగారెడ్డి క్రైం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ పెద్ద చెరువులో ఇటీవల రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్న క్రమంలో గాయపడిన హోంగార్డు గోపాల్ పరిస్థితి దీనంగా ఉందని హోంగార్డుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డును తెలంగాణ హోంగార్డుల సంఘం అధ్యక్షుడు కొత్వాల్ దయానంద్, ఉపాధ్యక్షులు అశోక్‌కుమార్, హరిబాబు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం హోంగార్డుకు ప్రాణాపాయం తప్పినప్పటికీ.. తలకు బలమైన గాయం అయిందని, పుర్రె క్రాక్ రావడంతో పాటు, రక్తం గడ్డకట్టడంతో మాట పడిపోయిందని వైద్యులు తెలిపినట్లు పేర్కొన్నారు. కుడికాలు, కుడిచేయికి పక్షవాతం వచ్చినట్లుగా సరైన కదలికలేదని చెప్పారని వారు వెల్లడించారు. పుర్రె క్రాక్ వచ్చినందున సర్జరీ చేయడానికి ఏ మేరకు అవకాశాలు ఉన్నాయా అని వైద్యులు సమాలోచనలు చేస్తున్నారని, ఒకటి రెండు రోజుల్లో నిర్ణయించి చెప్తామన్నారని హోంగార్డుల సంఘం ప్రతినిధులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పదేళ్లుగా హోంగార్డుగా పనిచేస్తున్న గోపాల్‌కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారని, ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతూ.. దీనస్థితిలో ఉన్న హోంగార్డును ప్రభుత్వం ఆదుకోవాలని, రాష్ట్రంలో పనిచేస్తున్న 16వేల మంది హోంగార్డులకు ఆరోగ్య భద్రత కార్డులను అందించాలని ప్రభుత్వాన్ని వారు వేడుకున్నారు. మరోవైపు.. కూల్చివేతల సమయంలో గాయపడిన హోంగార్డు గోపాల్‌కు అన్ని విధాలా అండగా ఉంటామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అతన్ని మెరుగైన ఆరోగ్య చికిత్స కోసం ఏఐజీ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. పోలీసుల సంక్షేమానికి జిల్లా ఎస్పీ అన్ని విధాలా కృషి చేస్తున్నారని పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దుర్గారెడ్డి తెలిపారు. కాగా, హోంగార్డులంటే అంత చులకనా?.. ప్రమాదం జరిగి ఇన్ని రోజులైనా ఒక్క పోలీసు ఉన్నతాధికారి కూడా పరామర్శించరా? అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు పోలీసు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో హోంగార్డు గోపాల్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకరమైన డిటోనేటర్లతో పేలుళ్లు చేసినప్పు డు కనీస జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే గోపాల్ గాయపడ్డారన్నారు. ఆయన ఆరోగ్యం పూర్తిగా నయమయ్యే వరకు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించాలని, ఆయనకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని హరీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తిరుమల లడ్డూపై సిట్‌కు తాత్కాలిక బ్రేక్

» చట్టాలను,కోర్టు తీర్పులను గౌరవిస్తాం: ఏపీ డీజీపీ



తిరుమల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వ్యవహారంపై ఏర్పాటు చేసిన సిట్ విచారణను తాత్కాలికంగా నిలిపివేసినట్లు డీజీపీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు. దీనిపై విచారిస్తున్న సుప్రీంకోర్టు ఇచ్చే తదుపరి ఆదేశాలకు అనుగుణంగా దర్యాప్తు కొనసాగిస్తామని పేర్కొన్నారు. దేశమంతా కలకలం రేపిన లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంపై విచారణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వశ్రేష్ఠ త్రిపాఠి నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గత మూడురోజులుగా తిరుపతి, తిరుమలల్లో త్రిపాఠి బృందం పర్యటిస్తూ, వివిధ కోణాల్లో దర్యాప్తును వేగంగా ముందుకు తీసుకెళుతోంది. ఈ క్రమంలో అనూహ్యంగా సిట్ విచారణకు బ్రేక్ పడింది. ఇదే అంశంపై డీజీపీ తిరుమలలోని గోకులం గెస్ట్‌హౌస్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడారు. "కల్తీ నెయ్యి వాడి లడ్డూను అపవిత్రం చేసినట్టు టీటీడీ నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. కేసు తీవ్రతను బట్టి ఐజీ స్థాయి అధికారితో సిట్‌ను ఏర్పాటు చేశాం. టీటీడీ కొనుగోళ్ల విభాగంలో ప్రక్రియ ఎంటీ, శాంపిళ్ల ఎలా తీసుకుంటారు, ఎక్కడ తప్పు జరిగే అవకాశముంది వంటి సమాచారాన్ని సిట్ సేకరిస్తోంది. అయితే సుప్రీంకోర్టులో దీనిపై వాదనలు జరుగుతున్నందున, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు (గురువారం వరకు) దర్యాప్తును ఆపాలని కోరాం" అని తెలిపారు. కోర్టు పరిధిలో ఈ అంశం ఉన్న క్రమంలో ఎక్కువ మాట్లాడటం సమంజసం కాదన్నారు. టీటీడీ అంతర్గత విచారణ చేపట్టిన తర్వాతే పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారనీ, దాని ఆధారంగానే కేసు నమోదు చేసి సిట్‌ను ఏర్పాటు చేసినట్టు ఒక ప్రశ్నకు సమాధానంగా డీజీపీ తెలిపారు. సుప్రీంకోర్టు నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతే తిరిగి సిట్ విచారణ కొనసాగుతుందన్నారు. చట్టాలకు, న్యాయస్థానాల ఆదేశాలకు అనుగుణంగానే పోలీసు శాఖ పనిచేస్తుందని తెలిపారు. న్యాయస్థానం ఆదేశాలను పాటిస్తామన్నారు. ఎవరినో తప్పుబట్టాలనో, లేదా ఇరికించాలనో తమకు ఉండదన్నారు. కోర్టు తీర్పులపై చర్చ చేయకూడదని తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశామని డీజీపీ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా సరిపడా బందోబస్తును ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

600 వైద్య పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బీమా వైద్య సేవల విభాగంలోని(ఈఎస్ఐ) ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న 600 వైద్య సిబ్బంది పోస్టుల భర్తీకి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆరు వందల పోస్టుల్లో వైద్యులు, స్టాఫ్‌నర్సుల పోస్టులే ఎక్కువగా ఉన్నాయి. ఈ పోస్టులను మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా భర్తీ చేయాలని జీవోలో సర్కారు పేర్కొంది. కాగా ఒక్క సెప్టెంబరులోనే మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సుమారు 4 వేల పోస్టుల(ల్యాబ్ టెక్నీషియన్స్, స్టాఫ్‌నర్స్, ఫార్మసిస్టు)కు నోటిఫికేషన్ జారీ చేసింది. తాజాగా మరో 600 పోస్టుల భర్తీకి సర్కారు ఆమోదం తెలపడంతో పోస్టుల సంఖ్య పెరగనుంది.

పోస్టుల వివరాలివే..

పోస్టు పేరు	సంఖ్య
సివిల్ అసిస్టెంట్ సర్జన్(ఎంబీబీఎస్)	124
డెంటల్ అసిస్టెంట్ సర్జన్(బీడీఎస్)	7
స్టాఫ్‌నర్స్	272
ఫార్మసిస్ట్ గ్రేడ్ 2	99
ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2	34
ఏఎన్ఎమ్	54
రేడియోగ్రాఫర్	5
డెంటల్ హైజీనిస్టు	1
ఆడియోమెట్రిక్ టెక్నీషియన్	1
డెంటల్ టెక్నీషియన్	3

రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లు

» పర్యావరణహితానికి ఎంతో ఉపయోగం
» ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
» గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీపై జపాన్ కంపెనీ యమనాషితో చర్చలు

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): థర్మల్ విద్యుత్తుకు ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక విద్యుత్తును ఉత్పత్తి చేయడంలో భాగంగా సోలార్ ప్లాంట్లతో పాటు గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లనూ తెలంగాణలో ఏర్పాటు చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. జపాన్‌లోని టోక్యోకు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న యమనాషి గ్రీన్ హైడ్రోజన్ కంపెనీ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఆయన మంగళవారం అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ జరుగుతున్న గ్రీన్ హైడ్రోజన్ ఉత్పాదనను పరిశీలించారు. సైంటిస్టులు, కంపెనీ నిర్వాహకులతో చర్చించారు. ఇక్కడ ఉత్పత్తి అయిన హైడ్రోజన్‌ను రేసింగ్ కార్లకు ఇంధనంగా, సూపర్ మార్కెట్లలో ఫ్యూయల్ సెల్స్‌గా, ఫ్యాక్టరీలలోని బాయిలర్లకు ఉష్ణాన్ని అందించేదిగా వినియోగిస్తున్నారని నిర్వాహక ఇంజనీర్ కునిగి వివరించారు. ఈ తరహా గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లను తెలంగాణలోనూ ఏర్పాటు చేయటానికి ఇంధన శాఖ సన్నాహాలు ప్రారంభించాలని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గ్రీన్ హైడ్రోజన్‌ను ఎరువుల కర్మాగారాలు, ఆర్టీసీకి, ఇతర పరిశ్రమలకూ సరఫరా చేయవచ్చని తద్వారా పర్యావరణహిత చర్యలకు ఎంతో దోహదం చేసిన వారమవుతామని ఆయన పేర్కొన్నారు. యమనాషి కంపెనీ రూపొందిస్తున్న బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం(బీఈఎస్ఎస్) బ్యాటరీల తయారీ విభాగాన్ని కూడా భట్టి పరిశీలించారు. తెలంగాణలో గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం సాంకేతికత వినియోగంపై ఉమ్మడి భాగస్వామ్యంతో ప్లాంట్ల ఏర్పాటుకు కలిసి రావాలని భట్టి కోరగా.. యమనాషి కంపెనీ అధికారులు సానుకూలంగా స్పందించారు.



జపాన్‌లోని యమనాషి కంపెనీని సందర్శించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

షిబుయా తరహా ట్రాఫిక్ నియంత్రణ

టోక్యో నగరంలోని హచుకో రైల్వే స్టేషన్ వద్ద గల షిబుయా క్రాసింగ్‌ను భట్టివిక్రమార్క సందర్శించారు. ఒకేసారిగా 3000 మంది బాటసారులు ఎలాంటి ఆటంకం లేకుండా రోడ్లు దాటడానికి చేసిన క్రాసింగ్ ఏర్పాటును పరిశీలించారు. హైదరాబాద్‌లో అత్యంత రద్దీగా ఉండే కూడళ్లలో షిబుయా తరహా ట్రాఫిక్ నియంత్రణ పద్ధతిని అమలు జరపనున్నామని భట్టి తెలిపారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ బలరామ్ ఆయన వెంట ఉన్నారు.

25% బ్యాంకు గ్యారెంటీ ఇస్తేనే ధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆస్తులు బ్యాంకులో తాకట్టు పెట్టాలి. అందుకు తగిన చెక్కులు కూడా ఇవ్వాలి. అప్పుడు సదరు బ్యాంకరు... రూ.కోటికి గ్యారెంటీ లెటర్ ఇస్తారు. ఆ బ్యాంకు గ్యారెంటీ లెటర్‌ను రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు అప్పగిస్తే కోటి రూపాయల విలువైన ధాన్యం ఇస్తారు. అప్పుడు ధాన్యాన్ని దారిమళ్లించకుండా సకాలంలో ధాన్యం మిల్లింగ్‌చేసి.. సీఎంఆర్ డెలివరీ చేసి, ఆస్తులు, చెక్కులు తాకట్టు నుంచి విడిపించుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఏపీ, ఛత్తీస్‌గఢ్‌లో బ్యాంకు గ్యారెంటీ విధానం అమల్లో ఉంది. సేకరణ, కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియలో అక్రమాలను నియంత్రించేందుకు ఇప్పటికే కొన్ని నిబంధనలు మార్చుతూ సెప్టెంబరు 30న (సోమవారం) జీవో 21 జారీ చేశారు. షెడ్యూల్ ప్రకారం మంగళవారం (అక్టోబరు 1న) ధాన్యం సేకరణ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా మరికొన్ని విధానపరమైన నిర్ణయాలు తీసుకొని మార్గదర్శకాలు రూపొందించనున్నారు. ఇందులో ప్రధానంగా 25 శాతం బ్యాంకు గ్యారెంటీ అంశంపై చర్చ జరుగుతోంది. అయితే బ్యాంకు గ్యారెంటీ విధానాన్ని రైస్‌మిల్లర్ల లాబీ ముందుకు పడనిస్తుందా? లేదా? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.



ఆ మిల్లర్లకు ధాన్యం ఇవ్వరు

కస్టమ్ మిల్లింగ్ పరంగా రైస్‌మిల్లుల గత చరిత్రను పరిశీలించిన తర్వాతే ధాన్యం అప్పగించాలని, గతంలో బకాయిలు ఉండి కార్పొరేషన్‌ను సతాయించిన మిల్లర్లకు ఎంతపడితే అంత ధాన్యం ఇచ్చేదిలేదనే నిబంధన కూడా పెట్టారు. రైస్ మిల్లులు, సామర్థ్యం వారీగా కేటాయింపులు చేయటానికి గుర్తింపు పొందిన రైస్‌మిల్లర్ల సంఘం నుంచి లెటర్ తీసుకోనున్నారు. రైస్‌మిల్లర్ స్వయంగా డిక్లరేషన్ ఇవ్వటంతోపాటు, అసోసియేషన్ నుంచి కూడా లెటర్ సమర్పించాల్సి ఉంటుంది. కాగా జాయింట్ కస్టోడియన్‌గా రైస్‌మిల్లర్‌తోపాటు డిప్యూటీ తహసీల్దారు/ఏసీఎస్‌వో/తహసీల్దారును పెట్టారు. రైస్ మిల్లర్ ధాన్యం అమ్ముకున్నా, సకాలంలో డెలివరీ ఇవ్వకపోయినా అధికారిని ఒక్కరినే బాధ్యులను చేసేవారు. ఇప్పుడు రైస్‌మిల్లర్‌నే పూర్తి బాధ్యునిగా చేశారు. ఒకవేళ ఎవరైనా రైస్‌మిల్లును లీజుకు తీసుకుంటే.. తప్పనిసరిగా ఆ రిజిస్టర్డ్ డాక్యుమెంటును పౌరసరఫరాల సంస్థకు సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ ఒక రైస్‌మిల్లులో ఒకరి కంటే ఎక్కువ భాగస్వాములుంటే.. పార్ట్‌నర్‌షిప్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ డీడ్‌నూ రైస్ ఇవ్వాల్సి ఉంటుంది. రైస్‌మిల్లర్లపై క్రిమినల్ కేసులు, 6-ఏ కేసులు పెండింగ్‌లో ఉంటే.. ఈ సీజన్‌తోపాటు వచ్చే రెండు ప్రొక్యూర్మెంట్ సీజన్లలో కూడా ధాన్యం ఇవ్వకూడదని నిర్ణయించారు.

3నెలలు దాటితే బియ్యం తీసుకునేదిలేదు

కేంద్ర ప్రభుత్వం నెలలు, ఏళ్ల తరబడి సీఎంఆర్ తీసుకోవటానికి ఆసక్తి చూపించటం లేదు. ఈసారి మూడు నెలల టార్గెట్ విధించిందని, అంటే.. సేకరణ సీజన్‌లో మూడు నెలల్లో మిల్లింగ్‌చేసి బియ్యం ఇస్తేనే తీసుకుంటామని, లేకపోతే ఆ బియ్యం రాష్ట్ర ప్రభుత్వం కోటాలోకే వెళ్తాయని, వాటిని కేంద్ర ప్రభుత్వం తీసుకోబోదని ఎఫ్‌సీఐ నుంచి స్పష్టమైన ఉత్తర్వులు వచ్చాయి. ఈ టార్గెట్ చేరుకునేందుకు ఎప్పటికప్పుడు మిల్లింగ్ చేయించాల్సి ఉంటుంది. లేకపోతే రాష్ట్ర ప్రభుత్వంపై మోయలేనంత భారం పడుతుంది.

బ్లెండింగ్, సార్టెక్స్ మిషన్లు మస్ట్

రాష్ట్రంలో ఉన్న ప్రతి రైస్‌మిల్లులో బ్లెండింగ్, సార్టెక్స్ మిషన్లు ఏర్పాటుచేసుకోవాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. పోషకాహార భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం సేకరించే బియ్యం మొత్తాన్ని ఫోర్టిఫైడ్ రూపంలో తీసుకుంటోంది. ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్‌ను బియ్యంలో కలపటానికి బ్లెండింగ్ మిషన్లు తప్పనిసరి. అందుకే ప్రతి రైస్‌మిల్లులో బ్లెండింగ్ మిషన్ ఏర్పాటుచేసుకోవాలనే నిబంధన పెట్టారు. డ్యామేజ్, రంగుమారిన బియ్యం ఇవ్వకుండా ప్రజలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలంటే సార్టెక్స్ మిషన్ తప్పనిసరి అని ఈ నిబంధన పెట్టారు.

సకాలంలో మిల్లింగ్ చేయాల్సిందే!

» రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్

హైదరాబాద్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని రైస్‌మిల్లులు దించుకోవాల్సిందేనని, సకాలంలో మిల్లింగ్ చేసి 67% రికవరీతో బియ్యం తిరిగివ్వాల్సిందేనని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ స్పష్టంచేశారు. కేంద్రం, భారత ఆహార సంస్థ జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగానే రాష్ట్రంలో సేకరణ ప్రక్రియ జరుగుతుందని, రైస్‌మిల్లర్లు నిబంధనలకు లోబడి సీఎంఆర్ ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. రాష్ట్ర పౌరసరఫరాల భవన్‌లో మంగళవారం రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో చౌహాన్ మాట్లాడారు. ఎవరైనా రైస్‌మిల్లర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బియ్యం ఔట్‌టర్న్, మిల్లింగ్ చార్జీలు, గోనె సంచుల ధరల విషయంలో ఎఫ్‌సీఐ నిబంధనలే వర్తిస్తాయని తెలిపారు. బ్యాంకు గ్యారెంటీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహించిన తర్వాత నిర్ణయాన్ని వెల్లడిస్తుందని స్పష్టంచేశారు. ఈ అంశంపై వారం రోజుల్లో స్పష్టత వస్తుందని తెలిపారు. కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రొక్యూర్మెంట్ పాలసీకి అనుగుణంగా రైస్‌మిల్లర్లు నడుచుకోవాలని సూచించారు. తేమ శాతాన్ని 17 నుంచి 14 శాతానికి తగ్గించాలని మిల్లర్ల నుంచి వచ్చిన ప్రతిపాదనలపై కమిషనర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఒకేరకం గా 17% తేమ నిబంధనే అమలులో ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు.

మతపరమైన ఉత్సవాలు, ఊరేగింపుల్లో డీజేల నిషేధం

» హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వెల్లడి

హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 1(ఆంధ్రజ్యోతి): పండగైనా, పబ్బమైనా.. పెళ్లిలైనా.. పేరంటాలైనా.. వేడుక ఎలాంటిదైనా.. అక్కడ డీజే మోతలు మోగడం పరిపాటిగా మారింది. డీజేలేనిదే దావత్‌కు అర్థమేలేదన్నట్లు పరిస్థితులు తయారయ్యాయి. మజా కోసం మొదలైన ఈ డీజే సంస్కృతితో.. మరణాలు సంభవిస్తుండటంతో పోలీసులు కొరడా ఝుళిపించేందుకు సిద్ధమయ్యారు. డీజే మితిమీరిన శబ్దాలతో పసిపిల్లలు, యువకులకు కూడా గుండెపోట్లు వస్తుండటం, కర్ణభేరులు దెబ్బతింటుండటంతో నష్టనివారణ చర్యలకు ఉపక్రమించారు. ఇక నుంచి అన్ని రకాల మతపరమైన ఊరేగింపులు, ఉత్సవాల్లో డీజేల వినియోగంపై నిషేధం విధిస్తున్నట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. డీజే సౌండ్లు, ఫైర్‌క్రాకర్స్ కారణంగా విపరీతమైన శబ్ద కాలుష్యంతో పాటు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతున్న నేపథ్యంలో వాటి నిషేధంపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు సీపీ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ ఊరేగింపుల్లో విపరీతమైన శబ్దంతో డీజే సౌండ్స్ పెట్టి పోటాపోటీగా ఊరేగింపులు, ఉత్సవాలు నిర్వహించారు. నిబంధనలు తుంగలో తొక్కి నిర్వాహకులు ఇష్టానుసారంగా ప్రవర్తించారు. ఉత్సవాల్లో నిర్వాహకులు, యువత అడుగడుగునా అధికారులకు అడ్డంకులు సృష్టించారు. విపరీతమైన డీజే సౌండ్ల వల్ల వృద్ధులు, చిన్నారులు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు. ఈ క్రమంలో నగరవాసుల నుంచి డయల్-100కు వందలాది ఫిర్యాదులు వచ్చాయని సీపీ తెలిపారు. ఇటీవల బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర పోలీస్ కమిషనర్లు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ సహా.. పలు శాఖల ఉన్నతాధికారులతో పాటు.. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజాసింగ్, పాషాఖాద్రి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, వివిధ సంస్థల ప్రతినిధులతో సీపీ సీవీ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. డీజే సౌండ్ వల్ల ఏర్పడుతున్న అనర్థాలు, అనారోగ్య సమస్యలు, ధ్వనికాలుష్యం, వృద్ధులు, చిన్నారులు పడుతున్న ఇబ్బందులు వంటి అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డీజేలపై నిషేధం విధిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నామని సీపీ పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఎన్ఐడీలో డిజైన్ ప్రోగ్రామ్‌లు



అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్ సహా అహ్మదాబాద్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో బీ డిజైన్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. దీని వ్యవధి నాలుగేళ్లు. అహ్మదాబాద్, బెంగళూరు, గాంధీనగర్ క్యాంపస్‌లలో ఎం డిజైన్ ప్రోగ్రామ్ ఉంది. దీని వ్యవధి రెండున్నరేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల భాషలో నిర్వహిస్తారు. డిజైన్ అప్టిట్యూడ్ టెస్ట్ (డీఏటీ) ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో ప్రిలిమ్స్, మెయిన్స్ దశలు ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత పొందినవారిని మెరిట్ ప్రకారం షార్ట్‌లిస్ట్ చేస్తారు. ప్రతి కేటగిరీలో సీట్ల సంఖ్యకు మూడు రెట్లమందిని మెయిన్స్‌కు అనుమతిస్తారు. ప్రిలిమ్స్, మెయిన్స్ స్కోర్ ఆధారంగా తదుపరి అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తారు.

బీ డిజైన్

విభాగాలు: యానిమేషన్ ఫిల్మ్ డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్, సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్.

సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో 125 సీట్లు; ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 75 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థుల కోసం అహ్మదాబాద్ క్యాంపస్‌లో 19 సీట్లు, మధ్యప్రదేశ్ క్యాంపస్‌లో 11 సీట్లు, హరియాణా క్యాంపస్‌లో 11 సీట్లు అదనంగా ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 2004 జూలై 1 తరవాత జన్మించి ఉండాలి. సీబీఎస్ఈ/ఐబీ/ఐసీఎస్ఈ/ఇతర గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2024-25 విద్యా సంవత్సరం నాటికి సైన్స్, ఆర్ట్స్, కామర్స్, హ్యుమానిటీస్ గ్రూప్‌లతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే. వీరు 2025 జూలై 15 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల 'జాయింట్ సర్వీసెస్ వింగ్ కోర్సు' ఉత్తీర్ణులు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్) నుంచి కనీసం అయిదు సబ్జెక్టులతో సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు; హెచ్ఎస్‌సీ ఒకేషనల్ ఎగ్జామ్ పాసైనవారు; బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే మూడేళ్ల డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఎగ్జామ్(లండన్/శ్రీలంక) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను పేపర్-పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్, విజువల్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు. మెయిన్స్ ఎగ్జామ్‌ను స్టూడియో సెటప్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఇందులో మల్టిపుల్ టెస్ట్‌లు ఉంటాయి. ప్రిలిమ్స్ స్కోర్‌కు 40 శాతం, మెయిన్స్ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు.

ఎం డిజైన్

విభాగాలు-సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో యానిమేషన్ ఫిల్మ్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్ విభాగాల్లో ఒక్కోదానిలో 19 సీట్లు; సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్‌లో 12 సీట్లు ఉన్నాయి. గాంధీనగర్ క్యాంపస్‌లో ఫొటోగ్రఫీ డిజైన్, ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ ఆటోమొబైల్ డిజైన్, న్యూ మీడియా డిజైన్, స్ట్రాటజిక్ డిజైన్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ డిజైన్, లైఫ్ స్టయిల్ యాక్సెసరీ డిజైన్ విభాగాల్లో ఒక్కోదానిలో 19 సీట్లు; టాయ్ అండ్ గేమ్ డిజైన్‌లో 12 సీట్లు ఉన్నాయి. బెంగళూరు క్యాంపస్‌లో యూనివర్సల్ డిజైన్, డిజిటల్ గేమ్ డిజైన్, ఇన్ఫర్మేషన్ డిజైన్, ఇంటరాక్షన్ డిజైన్, డిజైన్ ఫర్ రిటైల్ ఎక్స్‌పీరియెన్స్ విభాగాల్లో ఒక్కోదానిలో 19 సీట్లు ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 1993 జూలై 1 తరవాత జన్మించి ఉండాలి. ఇంటర్ తరవాత మూడేళ్లు/నాలుగేళ్ల వ్యవధిగల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు; డిజైన్, ఫైన్ ఆర్ట్స్, అప్లయిడ్ ఆర్ట్స్, ఆర్కిటెక్చర్ విభాగాల్లో నాలుగేళ్ల డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 జూన్ 28 నాటికి డిగ్రీ/డిప్లొమా చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అర్హులే. వీరు 2025 జూలై 31 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను పేపర్-పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్, విజువల్స్ అంశాల నుంచి ఆంగ్ల మాధ్యమంలో ప్రశ్నలు అడుగుతారు. మెయిన్స్ ఎగ్జామ్‌లో స్టూడియో టెస్ట్, ఇంటర్వ్యూలు ఉంటాయి. ప్రిలిమ్స్ స్కోర్‌కు 30 శాతం, స్టూడియో టెస్ట్ స్కోర్‌కు 40 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; విదేశీ విద్యార్థులకు రూ.5,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 3
- **ఎడిట్ విండో ఓపెన్:** డిసెంబరు 4 నుంచి 9
- **ప్రిలిమ్స్ అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** డిసెంబరు 24 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **ప్రిలిమ్స్ తేదీ:** 2025 జనవరి 5న
- **ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల:** బీ డిజైన్‌కు 2025 ఏప్రిల్ 1న; ఎం డిజైన్‌కు 2025 ఫిబ్రవరి 17న
- **మెయిన్స్ అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** బీ డిజైన్‌కు 2025 ఏప్రిల్ 14 నుంచి; ఎం డిజైన్‌కు 2025 ఫిబ్రవరి 24 నుంచి
- **మెయిన్స్ తేదీలు:** బీ డిజైన్‌కు 2025 ఏప్రిల్ 26 నుంచి మే 4 వరకు; ఎం డిజైన్‌కు 2025 మార్చి 3 నుంచి ఏప్రిల్ 6 వరకు
- **మెయిన్స్ ఫలితాలు విడుదల:** బీ డిజైన్‌కు 2025 మే 16న; ఎం డిజైన్‌కు 2025 మే 6 సీట్ అలాట్‌మెంట్, డాక్యుమెంట్స్ అప్‌లోడింగ్: బీ డిజైన్‌కు 2025 మే 27 నుంచి 30 వరకు; ఎం డిజైన్‌కు 2025 మే 6 నుంచి 7 వరకు
- **వెబ్‌సైట్:** admissions.nid.edu

ఐఐటీ గాంధీనగర్‌లో
పీహెచ్‌డీ సీడీపీ

గాంధీనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీజీ)- పీహెచ్‌డీ కంటిన్యూయింగ్ డాక్టోరల్ ప్రోగ్రామ్(సీడీపీ)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని రీసెర్చ్ స్కాలర్స్, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. అకడమిక్ మెరిట్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు: బయలాజికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కాగ్నిటివ్ అండ్ బ్రెయిన్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ డిజైన్ అండ్ టెక్నాలజీ, మెటీరియల్స్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఎంఏ/ఎమ్మెస్సీ/ఎంటెక్/బీఎస్-ఎంఎస్/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం


- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 17
- **అభ్యర్థుల షార్ట్ లిస్ట్ విడుదల:** అక్టోబరు 24 నుంచి 26 వరకు
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** నవంబరు 1 నుంచి 20 వరకు
- **వెబ్‌సైట్:** iitgn.ac.in




లిటిల్స్

నిజాయితీకి పరీక్ష

అవంతీ పురం అనే రాజ్యాన్ని మహేంద్రుడనే రాజు పాలిస్తూ ఉండేవాడు.అతనికి కుడి భుజంలాంటి మహామంత్రి ఒకరోజు అనారోగ్యం కారణంగా మరణించాడు. మహేంద్రుడు మంత్రి కుమారుడిని మంత్రి స్థానంలో నియమించాడు.పదవినైతే ఇచ్చాడు కానీ మహేంద్రుడికి అతని తెలివితేటలు ఏ పాటివో అతను ఆ పదవికి అర్హుడేనా అని పరీక్ష పెట్టాలి అనిపించింది. వెంటనే మంత్రి కుమారుడిని పిలిపించి, ఇలా చెప్పాడు ' మన రాజభవనంలో పని చేయడానికి ఒక నమ్మకమైన ఉద్యోగి కావాలి. అతను చాలా నిజాయితీపరుడై ఉండాలి అటువంటి వ్యక్తిని ఎంపిక చేసే బాధ్యత నీకు అప్పగిస్తున్నాను. మీనాన్న బ్రతికి ఉన్నప్పుడు ఇలాంటి చిక్కు సమస్యలు అన్నిటినీ ఆయనే పరిష్కరించే వాడు ఇపుడు నువ్వు ఆ బాధ్యత తీసుకోవాలి.అన్నాడు అలాగే మహారాజా అని వెళ్లిపోయిన మంత్రి కుమారుడు ఆ మర్నాడు ఉద్యోగం కోసం వచ్చిన పదిమంది యువకులతో కాసేపు మాట్లాడి, వారందరినీ కొంతసమయం ఒక గదిలోకి పంపి, అందరూ బయటకు వచ్చిన తరువాత, ఆ పదిమందినీ రాజుగారి చుట్టూపరిగెత్తమన్నాడు వారిలో తొమ్మిది మంది ఇదేమి వింత పరీక్షఅని పరిగెత్తడానికి నిరాకరించారు. ఒకే ఒక యువకుడు మాత్రం పరుగు తీసాడు మంత్రి కుమారుడు ఆ యువకుడిని రాజు గారికి చూపించి, మహారాజా.. ఇతనే మీకు కావలసిన నిజాయితీపరుడు ఇతన్ని మీరు పూర్తిగానమ్మవచ్చు' అన్నాడు అది విన్న రాజుగారు అలా ఎలా చెప్పగలవు? నాచుట్టూ పదిసార్లు పరిగెడితే మనిషిలో నిజాయితీ తెలిసిపోతుందా; ఇదేమిపరీక్ష అని అడిగాడు దానికి మంత్రి కుమారుడు 'మహారాజా.. మీ చుట్టూ పరుగు తీయడం కాదు వీరందరికీ అసలు పరీక్ష ఆ చీకటి గదిలోనే ముగిసింది, నేను ఈ పదిమందిని బంగారు నాణాలు రాశులుగా పోసి ఉన్న ఒక చీకటి గదిలో కాసేపు ఉండమని చెప్పాను వారిలో తొమ్మిదిమంది పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగి తనను ఎవరూచూడటంలేదనుకున్నట్లు, పట్టినన్ని బంగారు కాసులు తమ జేబులలో నింపుకున్నారు. మీ చుట్టూ పరిగెడితే ఆ నాణాల చప్పుడుకు వారి దొంగతనం బయట పడుతుందనే భయం వల్లనే పరుగు తీయడానికి నిరాకరించారు. ఇక పోతే, ఈ యువకుడు మాత్రం ఆ చీకటి గదిలోఉన్నపుడు బంగారు కాసుల వైపు చూడనైనాలేదు అందుకేఅంత ధైర్యంగాపరుగు తీసాడు' ఇతనే మీకు కావలసిన నిజాయితీపరుడైన ఉద్యోగి' అన్నాడు. మంత్రి కుమారుడికి మంత్రి పదవిని ఇచ్చి తానుతప్పు చేయలేదని, తెలివైన చురుకైన యువకుడు మంత్రిగా లభించడం రాజ్యానికి చాలా మంచిజరుగుతుందని ఎంతోసంతోషించాడు మహేంద్రుడు.



6 తేడాలను కనిపెట్టండి






సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 424

			7			1	4	
	4							7
5		2		3				
		6				2		
7	9		5		2		8	3
		1				7		
				2		4		9
8							1	
	1	7			6			

సుడోకు - 423 సమాధానం

7	1	6	8	5	2	3	9	4
8	9	2	3	6	4	5	1	7
4	5	3	9	7	1	2	6	8
6	4	5	7	1	8	9	2	3
9	3	7	5	2	6	4	8	1
2	8	1	4	9	3	6	7	5
5	7	8	2	4	9	1	3	6
1	2	4	6	3	7	8	5	9
3	6	9	1	8	5	7	4	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

జాబ్ కార్నర్

ఏఐఐఎస్‌హెచ్‌లో ఫ్యాకల్టీ

ఖాళీలు 22

మైసూరులోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్(ఏఐఐఎస్‌హెచ్)... డైరెక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ప్రొఫెసర్: 3
2. అసోసియేట్ ప్రొఫెసర్: 12
3. అసిస్టెంట్ ప్రొఫెసర్: 7

విభాగాలు: ఆడియాలజీ, స్పీచ్-లాంగ్వేజ్ పాథాలజీ, స్పీచ్ సైన్సెస్, క్లినికల్ సైకాలజీ, ఈఎన్‌టీ, స్పీచ్ అండ్ హియరింగ్, ఎలక్ట్రానిక్స్, స్పెషల్ ఎడ్యుకేషన్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ, ఎంబీబీఎస్/ఎంఎస్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ప్రొఫెసర్ పోస్టులకు 50 ఏళ్లు; అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు 45 ఏళ్లు; అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.


దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.250; మహిళ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ద చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్, మానసగంగోత్రి, మైసూరు చిరునామాకు పంపాలి.

చివరి తేదీ: ప్రకటన వెలువడిన 45 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.

ప్రకటన వెలువడిన తేదీ: 2024 ఆగస్టు 29

వెబ్‌సైట్: https://aiishmysore.in/



జీఎంసీలో వివిధ పోస్టులు

ఖాళీలు 12

సికింద్రాబాద్‌లోని గాంధీ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టుల వివరాలు

1. సైంటిస్ట్ సి(మెడికల్/నాన్ మెడికల్): 3
2. డీఈఓ(డేటా ఎంట్రీ ఆపరేటర్): 2
3. రీసెర్చ్ అసోసియేట్: 1
4. ప్రాజెక్ట్ అసిస్టెంట్: 2
5. రీసెర్చ్ అసిస్టెంట్: 2
6. ల్యాబ్ టెక్నీషియన్: 1
7. ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్-3: 1

అర్హత: సంబంధిత విభాగాల్లో ఇంటర్, డిగ్రీ, పీజీ, ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు సైంటిస్ట్ సి పోస్టుకు రూ.67,000; డీఈఓకు రూ.20,000; రీసెర్చ్ అసోసియేట్‌కు రూ.56,840; ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.32,350-రూ.33,700; రీసెర్చ్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు రూ.28,000; ల్యాబ్ టెక్నీషియన్‌కు రూ.20,000.

ఎంపిక విధానం: దరఖాస్తుల షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 5

ఇంటర్వ్యూ తేదీ: అక్టోబరు 8

దరఖాస్తు: ఆఫ్‌లైన్ ద్వారా గాంధీ మెడికల్ కాలేజ్, ప్రిన్సిపల్, జీఎంసీ, హైదరాబాద్ చిరునామాకు పంపించాలి.

వెబ్‌సైట్: https://gmcsecunderabad.org/

SCHOLARSHIP ALERT

Sensodyne IDA Shining Star Scholarship Programme 2024-25

Description: Haleon India, makers of Sensodyne, invites applications for the 'Sensodyne IDA Shining Star Scholarship Programme 2024-25' to support meritorious and underprivileged BDS students across India.



Eligibility:

- Open to students pursuing their first year of the Bachelor of Dental Surgery (BDS) programme from government and government-funded colleges only.
- Applicants must have scored a minimum of 60% in their Higher Secondary Education.
- Successful applicants must maintain a 60% score in every semester/year to continue availing of the benefits during their 4-year course.
- The annual family income of the applicant from all sources must not be more than INR 8,00,000.

Prizes & Rewards: INR 4,20,000 for 4 years (INR 1,05,000 per year)
Last Date to Apply: 31-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SSPPS4

Tata Capital Pankh Scholarship Program

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)
Last Date to Apply: 15-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/TCPS27

OakNorth STEM Scholarship and Mentorship Programme

Description: OakNorth STEM Scholarship and Mentorship Programme aims to provide financial support to meritorious female students belonging to Uttarakhand, Bihar and Haryana pursuing graduation in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects from government colleges/universities.
Eligibility: Female students from Haryana, Uttarakhand and Bihar who have passed Class 12 and are currently pursuing graduation (any year) in STEM-related subjects from government universities/colleges are eligible. The annual family income of the applicants must be less than INR 3.5 lakh from all sources. Aggregate marks secured by candidates in the Class 12 (or equivalent) examination must be 80% or above (with the exception of children with single parents or orphans) and 65% in the previous class/semester/year (if applicable).
Prizes & Rewards: INR 30,000 (fixed amount)
Last Date to Apply: 18-10-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ONSS3

Santoor Scholarship Programme

Description: Santoor Scholarship Programme 2024-25 aims to support the undergraduate studies of young women from disadvantaged backgrounds in the states of Andhra Pradesh, Karnataka, Telangana or Chhattisgarh.
Eligibility: Open to young women from underprivileged backgrounds residing in Andhra Pradesh, Karnataka, Telangana, and Chhattisgarh.
Applicants must have: passed Class 10 from a local government school.
passed Class 12 from a government school or junior college in the academic year 2023-24. And enrolled in a full-time graduate programme starting in 2024-25.

Note:

- The full-time graduate course must have a minimum duration of 3 years.
- Students with a strong interest in pursuing higher education in humanities, liberal arts, and sciences, are strongly encouraged to apply.
- Priority will also be given to students from aspirational (backward) districts.

Prizes & Rewards: INR 24,000 per annum
Last Date to Apply: 15-10-2024
Application mode: Online applications only! Students can apply online at Buddy4study or download the application form from www.santoorscholarship.com.
Short Url: www.b4s.in/aj/SWS7

buddy4study.com